సాహిత్య

# ప్రస్థానం

మార్చి 2015

వెల రూ. 10



సాహితీస్రవంతి






ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన మాక్సీం గోర్కీ సమగ్ర రచనలు 8 పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యులు సీతారాం యేచూరి. చిత్రంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె. లక్ష్మయ్య

ఫిబ్రవరి 8, 9 తేదీలలో విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ సిపిఐ(ఎం) పార్టీ రాష్ట్ర మహాసభలలో ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన ప్రముఖ రచయిత సివి సమగ్ర రచనల ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో నరసింగరావు, పి. మధు, కె. లక్ష్మయ్య, పాటూరి రామయ్య, బి.వి. రాఘవులు, కూర్చున్న వారు సివి, ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకురాలు కె. ఉషారాణి



సివి ని పలకరిస్తున్న సాహిత్య ప్రస్థానం సంపాదకులు తెలకపల్లి రవి.



ఫిబ్రవరి 26న గుంటూరులో గద్దిపాటి కోటేశ్వరరావు సంస్మరణ కార్యక్రమంలో జంధ్యాల పాపయ్య శాస్త్రి రచన ఉమర్ ఖయ్యాం పుస్తకావిష్కరణ సభ. ప్రసంగిస్తున్న బి.వి. రాఘవులు. చిత్రంలో గద్దిపాటి బాలకోటేశ్వరరావు, డా॥ జంధ్యాల జయశంకర్ బాపూజీ, తెలకపల్లి రవి,




తన రచనలతో
సివి.




ఫిబ్రవరి 28న అనంతపురం సిపిఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రసిద్ధ సాహిత్యవేత్త విద్వాన్ విశ్వం శతజయంతి సభలో ప్రసంగిస్తున్న తెలకపల్లి రవి. చిత్రంలో సింగమనేని నారాయణ, రాంభూపాల్, మల్లెల నరసింహ్మామూర్తి, సూర్యసాగర్ తదితరులు




తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17న హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన కవితల జాతర కార్యక్రమంలో ప్రసంగిస్తున్న తెలంగాణ సాహితి కన్వీనర్ కె. ఆనందాచారి. చిత్రంలో అమ్మంగి వేణుగోపాల్, నిఖిలేశ్వర్, శివారెడ్డి, మోతుకూరి నరహరి జూలూరి గౌరీశంకర్, నాళేశ్వరం శంకరం, కవి యాకూబ్

సాహిత్య ప్రస్థానం
మార్చి 2015
సంపుటి : 14 సంచిక : 3

# తెలు'గోడు'

అంతరంగం అట్టడుగున అంతమందిమీ మానవులమే అన్న శ్రీశ్రీ వాక్యాల్లాగే రాష్ట్రాలు రెండైనా భాష పరంగా అటూ ఇటూ తెలుగు వారే. ఉమ్మడి రాష్ట్రంగా వున్నప్పుడు ప్రాచీన భాష హోదాకై జరిగిన సమరంలో అమితంగా వాడుకలోకి వచ్చిన మాట తెలు'గోడు'. ఇప్పుడు కేంద్రం వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే మరోసారి ఆ మాట ముందుకు తీసుకురావలసిన అవసరం కనిపిస్తుంది. రాజధాని రహితమైన ఆంధ్రప్రదేశ్ సమస్యకు అనేక హామీలిచ్చినా వాటిని నెరవేర్చే దిశగా కేంద్రం చేస్తున్నది నామమాత్రం. తెలంగాణ విషయంలోనూ అందుతున్న సహాయం అంతంతే. ఉభయ రాష్ట్రాలకు కేంద్రంలోని తెలుగు పెద్దలు వాగ్దాన వర్షం కురిపించారు. వాగ్దానాల వరద పారించారు. తీరా అమలుకు వచ్చే సరికి ఒకరికి హళ్లి మరొకరికి సున్నా అంటున్నారు. ఏమంటే వేచి చూడాలంటారు. విభజన బిల్లు ఆమోదం పొంది ఏడాది గడిచాక కూడా ఇంకా నిరీక్షా మంత్రం పఠించడం హాస్యాస్పదం. విభజన ఆకాంక్షించిన వాళ్లకూ, విభజనపై ఆవేదన చెందిన వాళ్లకూ కూడా అన్యాయం చేయడంలో కేంద్రం సమధర్మం పాటిస్తున్నట్టు కనిపిస్తుంది. అయితే ఈ సమయంలో కేవలం గోడు వెళ్లబోసుకోవడం వల్ల ప్రయోజనం శూన్యం. తెలుగు ప్రజల అభ్యున్నతి, రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధి కోసం అన్ని పక్షాలూ అన్ని తరగతుల ప్రజలూ కలసి ఎలుగెత్తి నినదించాలి. సమస్యలనూ అవసరాలనూ నిర్దిష్టంగా విస్పష్టంగా వినిపించాలి. అన్ని విధాల వత్తిడి తెచ్చి కోర్కెలు సాధించుకోవడం ఇప్పటి చారిత్రక కర్తవ్యం. అది తెలుగువారి ప్రజాస్వామిక హక్కు కూడా.

బొమ్మలు : తుంబలి శివాజి, జె.వెంకటేష్, భాస్కర్

## ఈ సంచికలో ...

కవిత ... 4
తప్పటడుగుల బాల్యం (కథ) ... 5
కవిత ... 9
సామాన్యుడి చేతిలో సామాజికాస్త్రం
సినీ సంభాషణం... 11
కవిత ... 14
దేశీయతకి పట్టం కట్టిన బాలచంద్రనెమాడే ... 15
కవిత ... 18
తెలుగు రచయిత్రి తొలి సాంఘిక నవల... 19
సామర్థ్యం (కథ) ... 24
కాలువమల్లయ్య కథలు - సామాజిక చిత్రణ ... 27
కవిత ... 30
మల్లె మనసు (కథ)... 31
కవిత ... 36
వెన్నెల మలుపులు - చీకటి వెలుగులు... 37
తెలుగు భాషా వికాసానికి విశాల దృష్టి... 40
ఫిబ్రవరి ప్రస్థానంలో కథలు - ఒక సమీక్ష... 42
ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు... 44
స్వీకారం ... 46
డైరీ ... 47

సంపాదకవర్గం
తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
వొరప్రసాద్
వల్లభాపురం జనార్దన
కె.లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్
ఆర్టీసి కళ్యాణమండపం దగ్గర,
హైదరాబాద్ - 500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

కవిత

# డ్రెస్‌కోడ్

- దారల విజయకుమారి
9177192275



తనకొంగులో నిను దాచుకుని.... పొదివిపట్టుకుని
ఆపై నోటికందించే ..... అమ్మ పాలిష్టం.....
ఆమె లాలిష్టం.... నిశ్చింతైన ఆ
చీరకుచ్చెళ్ళ ఊయలిష్టం.....
దిశానిర్దేశం చేసే.... ఆమె ఒడి.... మొదటిబడిష్టం
అంతరిక్షానికెళ్ళినా... అణుబాంబును చేసినా.......
అవనినంతా ఏలినా....
ఆ తల్లిపాల వారసత్వమే!
సృష్టినే తనలో నింపుకున్న... ఆమెలో బేల చూపులు...
అడ్డాలనుండీ .. గడ్డాలదాకా...అన్నీ తానే అయిన ఆమెపై
దాష్టీకాలు... దురాగతాలు... పళ్ళగాట్లు... గోళ్ళరక్కులు
ఆమె చెదిరిన బాల్యం.... చెల్లిస్తున్న భారీ ముల్యం
ఇదేం పురోగమనం?
సంప్రదాయ సవాళ్ళు.... వృత్తి వత్తిళ్ళు.....బంధాల లంపటాలు
కుటుంబ సర్దుబాట్లు... వేదం..... పురాణం.......సాంఘిక
సంకెళ్ళనింకా తెంచుకొనే లేదు
మూడు నిమిషాలకో నిర్భయ వేదన
చిట్టిపొట్టి చేతుల్తో కట్టుకున్న బొమ్మరిల్లులు
భవిష్యత్ ఆశారేఖలు... పాలబుగ్గల చిన్నారులు
చీరకట్టిన సమూహాలదాకా రక్కబడ్డ శరీరాలే
ఆమె వర్షించే కళ్ళకు తెరిపే లేదు
ఆవేదనకు అలుపేరాదు
చిన్న చిన్న స్వప్నాల కోసం
ఏ దేవుళ్ళను మ్రొక్కాలి.... ఎన్ని వెతలను భరించాలి
ఇనుపకౌగిళ్ళు... రక్షణలేని లోగిళ్ళలో...... ఎందరిపాపాల్నో
భరిస్తున్న.... బంగారు తల్లులకు డ్రెస్‌కోడా....?
భావ ప్రకటన... జీవివైవిధ్యం... వస్త్రధారణ...
సొగసైన దేహం... నెమ్మదైన బ్రతుకు... ఆమె హక్కు....
బాతుపొట్టకోసేసినట్టు.... మూసున్న పిడికిలి...బలంగా
విప్పేసినట్టు... ఆమె గొంతు నొక్కేస్తే... ఒరిగేదేమని..?
ఒరే... చిన్నా... నీకైనా తెలుసా ఆపై నీవు ఒంటరని!
నీ ఉనికిని చాటుకో...
అనురాగం... అనుగ్రహం.... ఆగ్రహం...
ఆమెకు ఏదిస్తే నీకదే....
యుగాల నాటి ఆ తడి గుండెను స్వాంతన పర్చే
ఆర్తిగీతం కావాలి.....
ఆమెలోని చీకట్లని పారద్రోలే దారి దీపం కావాలి
స్త్రీ జాతి కభయ మిచ్చే వీరుడు కావాలి
ధీరుడు కావాలి....
ఆ పూర్ణమానవుడు నువ్వే అవ్వాలి

## ఫిబ్రవరి నెల పురస్కారాలు



**బండరాయి**
కథకు: రూ.700/-
రచయిత : **విజయభాను కోటె**

**చూడు ! ఆ ఆత్మస్థైర్యం!!**
కవితకు : రూ .500/-
రచయిత : ఎస్. సుమిత్రాదేవి

సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి

వ్యాసం : **తెలుగు అధికార భాషా చట్టం - అమలు** , రచయిత : **డా॥ సి. సరళాదేవి**

ఈ రచయితకు 'కర్లపాలెం రుక్మిణమ్మ స్మారక పురస్కారం రూ.500 అందజేయబడుతుంది

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు.
సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని
ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.

- ఎడిటర్

కథ



# తప్పటడుగుల బాల్యం


- వి. శాంతి ప్రబోధ

9866703223


మొబైల్ మోగుతోంది. ఎప్పుడు ఏ వార్త వినాల్సి వస్తుందోనన్న భయం వెంటాడుతుండగా బ్యాగ్ లోంచి ఫోన్ తీసి చూశా. కొత్త నంబరు. చంద్ర ఆచూకీ తెలుపుతుందేమోనని ఆతృతతో కాల్ తీసుకున్నాను. “అమ్మ .. అమ్మా ..” స్త్రీ కంఠం. వాయిస్ బ్రేక్ అవుతోంది. హలో హలో అంటున్నా.. నా గొంతు వారికి వినిపించినట్లు లేదు. .. లైన్ కట్ అయింది. అదే నంబరుకి పదే పదే చేశాను. కాల్ వెళ్ళడం లేదు. మనసులో ఆందోళన, ఆదుర్దా అంతకంతకు పెరిగిపోతోంది. అసలు ఏమయ్యాడు చంద్ర? ఆ ప్రశ్న మదిలో మెలిపెడుతోంది. నిన్న సాయంత్రం నుండి కనిపించడం లేదు. వాడి గురించి తెలుసు కాబట్టి, ఎటు వెళ్ళినా చీకటి పడేసరికి వస్తాడులే అనుకున్నాం. ఉహు .. రాలేదు. ఊరంతా జల్లెడ వేసి గాలించాం. తలో దిక్కు బావులు, చెరువులు, పెద్ద కాల్వతో సహా వెతికాం. జాడే లేదు. ఉదయం పదకొండు గంటలవుతోంది. చివరికి పోలీసు కంప్లయింట్ ఇద్దామని బయలుదేరుతుండగా ఈ కాల్.

తండ్రిలేని పిల్లగాడని మా అత్తమామలు జర గార్వం చేసిన్రు .. గాలి గాలి అయితున్నరు. నేనా ఈ పొద్దో ఆ పొద్దో అన్నట్టుంటి .. నువ్వే ఈల్లకి బుద్ధి నేర్పాలే. దయుంచి మంచిగ చూసుకోరవ్వా... అంటూ అప్పగింతలు పెట్టిన ఆ తల్లి ప్రేమకి నేనేం జవాబు చెప్పను? పిల్లలని నా దగ్గర వదిలినప్పుడు వాళ్ళ అమ్మ, తాత ఇచ్చిన నంబరుకి కాల్ చేస్తే నంబరు సరి చూసుకోండి అంటూ వాయిస్ వస్తోంది. ఇప్పుడు వచ్చిన నంబరుకి ఎన్ని సార్లు చేసినా సిగ్నల్స్ అందడం లేదు. వాడి దయాగుణం, చీదర పడకుండా మానవత్వంతో స్పందించిన తీరు.. స్వచ్ఛమైన వెన్నెల్లా నవ్వుతూ తుళ్ళుతూ అమాయకంగా కనిపించే చంద్ర తెలిసో తెలియకో చేసి ఇబ్బంది పెట్టిన... ఆకతాయి పనులు ఒకదాని తర్వాత నన్ను వెంటాడుతున్నాయ్.. ఆ రోజు చంద్ర వాళ్ళు వచ్చిన రోజు నాకు బాగా గుర్తుంది.

** *

చంద్ర, వాడి తమ్ముడు చరణ్ లది కరీంనగర్ జిల్లా సిరిసిల్ల దగ్గరలోని ఓ మారుమూల పల్లె. “తండ్రి ల్యాకనే పాయె.. తల్లి ఉండి లేనట్టేనయే.. మాకు మాటినకచ్చిన్రు బిడ్డా .. ఆగమయితాన్రు.. గందుకే ఈడిదంక తోల్కచ్చిన .. జర పయిలం.” అంటూ అప్పగింతలు పెట్టి వెళ్ళాడు తాత. వెళ్తూ వెళ్తూ మనవల్లిద్దరి చేతిలో చెరో నలబై రూపాయలు పెట్టాడు. వద్దు, పిల్లలకి పైసలతో పని ఉండదు అని చెప్పినా వినలేదతని మనసు. సరేలే, సాయంత్రం తీసుకొని దాచిపెట్టవచ్చు అనుకున్నాం.

కాసేపైన తర్వాత చంద్ర కనిపించలేదు. అయ్యో .. ఏమైపోయాడు ? అసలే ఊరికి కొత్త . వాళ్ళ తాత, అమ్మ వెళ్ళేప్పుడు చిన్నవాడు చరణ్ కళ్ళనీళ్ళు పెట్టాడు కానీ చంద్ర నవ్వుతూనే సాగనంపాడు కదా .. అనుకుంటూ చరణ్ ని

అడిగితే,  "మా అన్న సబ్బు తేనీకి పోయిండు" అని చెప్పాడు. అంతలో రానే వచ్చాడు చంద్ర చేతిలో ఓ పాలితిన్ కవర్తో. పెయ్యి సబ్బు, బట్టల సబ్బు, కొబ్బరి నూనె అంటూ తీసి చూపాడు. ఈ  ఊరు నీకు తెలియదుగా అన్న ప్రశ్నకు .. "నేను బస్సు దిగి ఆటో ఎక్కి రాంగ దుక్నం జూసిన.  సీదా అదే తొవ్వ బట్టి పోయి తెచ్చిన "అని చెప్పి, తమ్ముడి కేసి చూస్తూ "పో .. పోయి తానం జేసిరా .. నీ ఎన్క నేన్జత్త" అన్నాడు పెద్దరికంగా . వాడి తీరు చాలా ముచ్చటేసింది.  అవన్నీ మేమే ఇస్తామని, మీరు మాకు చెప్పకుండా గేటు దాటి బయటికి వెళ్ళ కూడదని చెప్తే ఏంతో బుద్ధిమంతుడిలా సరేనన్నట్లుగా తలూపాడు.

అది ఆదివారం ఉదయం. పిల్లలంతా తమ పరిసరాలు శుభ్రం చేసుకునే పనిలో ..మా కాంపస్ పక్కనే మొక్కజన్న చేను. ఆ చేన్లోకి ఎప్పుడు వెళ్ళాడో నాలుగు మక్క కంకులు తెచ్చి తోటివాళ్లకిచ్చి తినమన్నాడట చంద్ర. వాళ్ళు మెచ్చుకుంటుంటే సంత్రా తోటలోకి వెళ్లి అవి తెంపుకొచ్చి ఇచ్చాడట.  ఇంతలో ఆ తోట యజమాని కర్ర పట్టుకొని యుద్దానికొచ్చాడు.



ఓ రోజు మధ్యాహ్నం మూడుగంటల సమయంలో వచ్చాడు. అది బడి పిల్లలు  వచ్చే సమయం కాదు.  ఇప్పుడొచ్చావే అనడిగితే పళ్లన్నీ బయటపెట్టి అహహా .. హ అంటూ పెద్దగా నవ్వేస్తూ చేతిలో ఉన్న నోట్ బుక్స్ అటూ ఇటూ తిప్పుతూ నించున్నాడు.  పుస్తకాల బాగ్ బడిలోనే ఉందనీ, లంచ్ బెల్ లో అంతా ఆడుకుంటుంటే తాను బస్టాండుకు పోయి అక్కడ మక్క కంకులు కాల్చి అమ్మేవాళ్ళకి అమ్మి పెట్టానని, వాళ్ళు 15 రూపాయలు ఇచ్చారని, 5 రూపాయలతో బజ్జీలు తిన్నానని, మిగిలిన 10 రూపాయలతో ఆ పుస్తకాలు  కొన్నానని చెప్పాడు. సంపాదించి ఖర్చుచేసిన తీరుకి, ఆ తెలివితేటలకి  ఆశ్చర్యపోతూ .. నీ దగ్గర పుస్తకాలున్నాయిగా  ఇవెందుకు అంటే మేడం డబ్బాల కాపీలు తెచ్చుకొమ్మంది.  నువ్వు పొద్దుగల విశాల అడిగితే ఇప్పుడు లేవు రేపు తెప్పిస్త అన్నవు గద ..! గందుకే నేనే కొని తెచ్చుకున్న అని చంద్ర జవాబు.  ఇంకెప్పుడూ అట్లా చేయొద్దంటే సరేనంటూ ఎప్పట్లానే బుద్ధిమంతుడిలా తలూపాడు.

ఆ రోజెందుకో బడి బంద్. పిల్లలొక్కొక్కరిని పిలిచి వాళ్ళ కేస్ స్టడీ రాసుకుంటున్నా . చంద్ర వంతు  వచ్చింది. అన్నదమ్ములిద్దరినీ  పిలిచా. కుటుంబ వివరాలు అయ్యాక వాళ్ళ గురించి చెప్పమన్నా .. చరణ్ నవ్వుతూ మెలికలు తిరుగుతూ అన్నకేసి చూస్తుంటే..   ఉళ్ళో ఉన్నప్పుడు వాళ్ళు  ఏమేమి చేసేవారో, ఏ ఆటలు ఆడేవారో ఏమి ఇష్టమో ఏమి ఇష్టం లేదో చెప్పమన్నా. చంద్ర ఒకసారి నా మొహంలోకి దీర్ఘంగా చూసి చెప్పడం మొదలు పెట్టాడు.  మా ఊర్లె ఉన్నప్పుడయితే నేను పత్తలాడుతుంటి. బీడీలు పద్తుంటి. సార పాకెట్లు , కల్లు సీసలు తాగుతుంటి.  దొర్కిన్నా .. మా తాత చింత బరిగేతోని జోపుడు జోపుతుండే .. నేను దోర్కుతనా .. ఆహాహా .. ఊరంత ఉర్కిపిస్తుంటి .. పాపం ముసలోడు దమ్ముకస్తుండే .. అని గర్వంగా చెబుతుంటే నేను తెల్లబోయా

"ఓరి  అయ్యా .. నీ కాల్మోక్కుతరా  .. తాత చెప్పినట్టు ఇనరా .. నీ బాంచెన్  అని మా అమ్మ గుండెబగుల ఏడుత్తుండే .. " చెప్పాడు చరణ్.

"మా బాపు పత్తలాడేటోడు, మా చిన్నబాపు బీ ఆడ్తడు. మాతాత, బాపు, చిన్నబాపు, అమ్మ, ఆయీ అందరు కుసుండి తాగుతరు. ఎన్నడన్న ఆల్లే మాకింతబోత్తరు గద..! నేను నా సోపతోల్లతోని తాగితే, పత్తలాడితే బరిగె బద్దరు .. నాకయితే ఏం సమజ్గాకొచ్చిన్ది" తలగోక్కుంటూ చంద్ర .

వాడి సంఘర్షణకి కారణం పెద్దల ద్వంద నీతి. టాపిక్ మారుస్తూ అవన్నీ కొనడానికి నీకు పైసలెక్కడివి?

"ఆ .. మా ఊర్లె ఎల్లారం చెరువున్నది గదా .. గా చెర్ల మత్తు చాపలున్నయ్ ..గవ్వి పైకి తేల్తుండే నా .. కర్రతోని జప్పన జోపుతుంటి . దెబ్బతగిలి అది కిన్దమీద అయితున్దెగదా .. దాన్ని పట్టి అమ్ముతుంటి .. గా నాగరాజుగాడు రెంద్రూపాలు ఒక్కొక్కపాలి ఐద్రూపాలు ఇచ్చి చ్యాప తీస్కపోతుండే. ఊర్ల ఎవ్వలైం జెప్పిన ఆ పని జేస్తున్టిగద! ఆల్లు బీ పైసలిత్తుండే .. నాకేది గావాల్నంటే గది కొనుక్కొంటుంటి" సంతోష సముద్రం ఉప్పెనై వస్తున్నట్టు తను చేసిన ఘన కార్యాల్ని ఏ సంకోచం లేకుండా స్వేచ్ఛగా హావభావాలతో చెప్పుకు పోతున్నాడు చంద్ర.

"సితారలు , సాగర్లు నేను సుత మత్తు బుక్కుతుంటి.." చెప్పాడు చరణ్. నిశ్చేష్టలా వింటున్నా ..నువ్వు కూడానా .. నా మతి పోతోంది .  ఈ పిల్లల వ్యవహారం తెలుస్తోంటే ..

"అవునక్కా .. అదు బీ బడికిపోకుండే .. మా తాత బడికి తోలేత్తే .. ఆ ఎన్కనే ఎల్లోస్తున్టిమి."

"ఎందుకు .? అన్నట్లుగా చూశా.." హు .. గా సారేం సదు నేర్పుతడు.. ? "ఎదురుప్రశ్న వేసి" అంబటాల కొత్తడు.  ఇటు పొద్దు మల్లంగనే అటు బోతడు. మా పోరగాల్లను  ఉత్తగనే అమ్మనా బూతులు తిడ్తడు ..ఈపులు సీర్త .. అన్కుంట కొడ్తడు .. తూ .. నీఅ .. గా బడికెవడు వోతడు .. ఈడు బీ నా తోకబట్టి తిర్గుతుండే .. "చంద్ర తమ్ముడి కేసి చూసి చెప్తుంటే అవునన్నట్టు పళ్ళికిలించాడు చరణ్.

ఇంకా ఏం చేసేవారు ..? ఏ ఆటలు ఆడేవారు.. ప్రశ్న నా నోటినుండి బయటికి రాకుండానే చెప్పడం మొదలెట్టాడు చంద్ర "గప్పుడయితే సిర్రగోనే, గోటిలు ఆడ్తున్టిమి గానీ పత్తలాట ఆడంగ

మత్తు మజా అస్తుండే.. గా నాగరాజుగాడున్నడు గద .. ఆడు బజ్జీలు తెత్తుండే .. ఆడు పటేల్ ఇంటి బర్లు గాస్తుండే గద .. .. మల్లిగాడు కాపోల్ల బర్లను మేపుతున్డే.. ఆడు అప్పుడప్పుడు బోయి బర్లను మల్లేస్తుండే .. కర్రెంకడు , నేను జబ్బ మీది తువ్వాలు పరుస్తున్టిమి. పత్తలేసి ఆడుతున్టిమి. నడుమ నడుమ బజ్జీలు తినుకుంట ఆడుతున్టిమి. ఒక్కోపారి చెర్లకుబోయి చ్యాపలు, ఎండ్రక్కాయలు పట్టుడు గమ్మతుంటుండే.. అయ్యిట్ని ఇన్ని పుల్లలుపోర్కల్తోని మంటేసి కాల్చుక తింటున్టిమి. గా కర్రెంకడయితే వాగొడ్డుకాడ కవుజు పిట్టల పడ్తున్డే .. అయ్ బీ కాల్చుక తింటున్టిమి. కమ్మగుంటుండే .. చేతిల పైసలుంటే కల్లు సీసాలు తెస్తున్టిమి.

"అక్కా .. ఊర్ల ఆడితే గా పోలీసోల్లు కొండవోయి టాణల ఎత్తాన్రు గద .. గందుకే గా పెద్దోల్లు గుట్టల మొకానబోయి ఆడ్తున్నరు. మేం సుత గట్లల్ల , చేన్లపొన్నబోయి ఆడ్తున్టిమి".

ఎంతో ఉత్సాహంగా తమ వీరోచిత కార్యాల్ని చెబుతున్న చంద్రాన్ని చూస్తూ పెద్దల ప్రభావం పిల్లలపై ఎలా పడుతుందో ఆలోచిస్తూ.. ఒక నిముషం ఆగి .. మీ నాన్న ఎట్లా చనిపోయాడు..

"ఏమో" ఆ చిన్ని కళ్ళు చికిలిస్తూ చరణ్

చంద్ర తలొంచుకుని అలోచించి "టి. బి .బీమారి అయిందట. మస్తు బయలువెట్టి సచ్చిన్డట."

"బతికున్నప్పుడు ఏం జేసేవాడు ?"

"ఏం జేత్తడు..? బిమారయింది గద .. చ్యాతనయితలేదని పనికి పోకుండే . పోద్దువోతలేదని పత్తాలాడుతుండె .. మా అమ్మ ఎంత మొత్తుకున్న ఇనకున్డె. సీసలు సీసలు మత్తు తాగుతుండే .. మా అమ్మ పైసలియ్యకుంటే దాన్ని పడేసి దంచుడు దంచుతున్డే .."

మరి మీకు అన్నం ..?

"మా అమ్మ బట్టలుతుకుతున్డే కద .. ఉత్కిన బట్టలు ఆల్లింట్ల యేసి రాంగ ఆల్లే జరంత అన్నం కూర ఏదుంటే అది ఇస్తుండే .. అదే తింటున్టివి .. మా అమ్మ ఉత్కిన బట్టలు ఆ ఇండ్లల్ల ఏసి రానికి నేను సుత పోతుంటి" అన్నాడు చరణ్

"ఒక్కోపారి మా అమ్మ చ్యాతనయితలేదు కొడ్కా .. పోయి ఇండ్లల్ల బట్టలేసి రా బేటా అని తోలుతుండే. పొతే పోతుంటి. లేకుంటే లేదు. సావుకారమ్మ ఇంటికయితే పోతుంటి. బట్టల మూట ఆడ బెట్టి అట్లనే చూస్కుంట ఉంటుంటి. ఆమె ఓ చంద్రిగా అదివ్వు .. ఇదివ్వు అని ఏదో పన్జెప్తుండే .. సావుకారమ్మ నడుత్తాన్న అంటుంటి .. ఓ పొల్లగా ఇగరా అని పిల్చి తినేటి గోలీలు ఇస్తుండే .."

'ఇంకా ఏదో చెప్తుండగా చరణ్ అందుకొని "అమ్మానాన్నలాట .." అంటుండగా "ఊ" అని తన లోతైన కళ్ళతో గదిమి చూసి వద్దన్నట్లుగా సైగ చేశాడు చంద్ర.

అప్పటినుండి అన్నే చెబుతున్నాడు నేను చెప్పొద్దా అనుకున్నాడేమో "ఊ .. గప్పుడు నువ్వు చెడ్డిలిప్పి అమ్మనాన్నలాట ఆడలే .." అన్నాడు చరణ్. అదిరిపడి చంద్రకేసి చూశా

గాలి తీసిన బుడగలాగా అయిన చంద్ర తమ్ముడి చెయ్యి గిల్లాడు చెప్పొద్దన్నట్లుగా .కెవ్వు మన్నాడు చరణ్ చెయ్యి రుద్దుకుంటూ

వీడితో చాలా జాగ్రత్తగా ఉండాలని అనుకుంటూ "నువ్వు ఆడలేదా .." అడిగా

"నేను బీ ఆడిన" మెలికలు తిరిగి సిగ్గు పడిపోతూ చరణ్

వెన్నులోంచి సన్నని వణుకు నా శరీరమంతా వ్యాపిస్తూ .. ఇలాంటి పిల్లల్ని దారికి తేవడం తన వల్ల అవుతుందా ..? ఏమాత్రం ఏమర పాటుతో ఉన్నా మిగతా పిల్లలతో తమ కార్యకలాపాలు మొదలెడితే ... ఆ ఆలోచనే భయకంపితురాల్ని చేసింది. జీవనసౌధానికి బలమైన పునాదులు వేయాల్సింది బాల్యంలోనే. ఆదిలోనే అపశ్రుతులా.. వీరి బతుకుబాటను మార్చగలమా ఆలోచిస్తున్న నాకు



ఎగుడు దిగుడు రోడ్డులోని గుంతలో పడి మా వాహనం ఇచ్చిన జర్క్ చంద్ర ఇచ్చిన కుదుపుకంటే చాలా చిన్నదిగా అనిపించింది. వెనక సీట్లో కూర్చున్న మాళవిక, ఉమా వాళ్ళు చంద్ర గురించే మాట్లాడుకుంటున్నారు.

నోరు లేని కోడి తను వెన్నంటే ఉండి పిల్లలకి లోకాన్ని పరిచయం చేస్తుంది. రెక్కల కింద దాచుకుని గద్దల్నించి కాపాడుకుంటుంది. కొమ్ము విసిరి తన చిన్నారి దూడని కాపాడుకుంటుంది ఆవు. మరి మనిషి ఏం చేస్తున్నాడు..? ఇలాంటి పిల్లలు వారి తల్లిదండ్రుల సమస్యా.. కుటుంబ సమస్యా .. లేక సమాజ సమస్యా .. తన దగ్గరున్న ప్రత్యేక పరిస్థితుల్లోని పిల్లలను సరైనదారికి మళ్ళించడం వ్యక్తుల వల్ల అవుతుందా .. ఇందులో ప్రభుత్వాల బాధ్యతలు ఏమిటి .. ? తలెత్తుతున్న ప్రశ్నలకి అడ్డుతగులుతూ ఫోన్ ఒక రింగ్ వచ్చి ఆగిపోయింది. మామూలే నెట్వర్క్ లేదు.

చంద్ర జ్ఞాపకాల్లోకి జారిపోతూ ... నేను

మరో రోజు మధ్యాహ్నం చేతిలో నలుపు రంగు పొలిథిన్ కవర్తో గబగబా చంద్ర వెళ్ళడం కన్పిస్తోంది. ఇప్పుడెందుకు వచ్చినట్లు .. చేతిలో ఏమిటో అనుకుంటూ ఆఫీసు రూం లోంచి బయటి కొచ్చా. వడివడిగా వాడి నివాసం కేసి వెళ్తున్నాడు. ఆ ఇళ్ళలో ఉండే అమ్మలు తోట పనిలోనో, వంట పనిలోనో ఉండే సమయం అది. గది మధ్యలో పెట్టాడు పాకెట్. మంచినీళ్ళ బిందె మీద గ్లాసు తీసుకొచ్చి కూర్చొన్నాడు. నేను గడపలోకి

రావడం చూశాడేమో తన చేతిలోని పాకెట్ పక్క బట్టల కిందకు తోశాడు. గ్లాసు మాత్రం అక్కడే ఉంది.

ఏంట్రా ఏం చేస్తున్నావ్ ..?

ఏం లేదక్కా.

ఆ గ్లాసు ఏంటి గది మధ్యలో ..

ఏమోనక్కా .. ఇక్కన్నే ఉన్నది.

ఓ అలాగా అంటూ వెళ్లి పరుపు కింద ఉన్న పాకెట్ తీయబోతుండగా , మెరుపు వేగంతో వెళ్లి అడ్డుగా నిల్చున్నాడు. అక్కడేదో కనిపిస్తోంది అంటూ పాకెట్ తీశా బయటికి . ఇక దాచలేను అనుకున్నాడేమో .. పళ్ళికిలిస్తూ నేనే తెచ్చిన అన్నాడు.

పైసలెక్కడివంటే ..

బడికెల్లి మేడం సూడకుంట తప్పిచ్చిన గద !. బస్టాండ్ల అడుక్కున్న . పది రుపాలొచ్చినయ్. రెండు పాకెట్లు కొన్న. ఇగో ఒక సితార అంటూ జేబులోంచి తీసి చూపాడు. అక్కడ ఒకటే కల్లు పాకెట్ కనిపిస్తోంది. ఆ విషయం అడిగితే దార్లో వచ్చేటప్పుడు సీమచింత చెట్టుకింద కూచొని తాగిన అని జంకు గొంకు లేకుండా జవాబు



నువ్వు చాలా మంచి వాడివి కదరా చంద్రా. మీ అమ్మను బాధ పెట్టకుండా బాగా చదువుకుంటావు అనుకుంటే ఇట్లా చేస్తున్నావేమిరా . ఇట్లా చెయొచ్చా కోపాన్ని అణుచుకుంటూ అన్నా. చేయకూడదన్నట్లుగా బుద్ధిమంతుడిలా తల ఊపాడు. క్షణమాగి .. ''నాకు తాగాలనిపిచ్చింది. పానమాగకచ్చిన్ది. మా ఊర్ల ఎప్పుడంటే అప్పుడు తాగుతుంటి. ఈడ మీరు పాలు పోస్తరు , అన్నం పెడ్తరు , పల్లి లడ్డులు , మొలకలు , గుడాలు , అరటి పండు అన్ని పెడ్తరు గానీ కల్లుపోయరు గద ! నాకేమో అది కావాల్నని పానం గుంజవట్టె . గందుకే పోయి తెచ్చుకున్న" మనసులో ఉన్నది నిర్భయంగా, స్వేచ్ఛగా వెలుబుచ్చాడు .

మరి మీ తమ్ముడిని, ఇక్కడున్న పిల్లలందరినీ నీలాగే చేయమందామా .. ?! రోజు పాలు పోయకుండా కల్లు తెప్పిద్దామా ... ?!

"ఊహు అద్దు అద్దు" అన్నాడు కంగారుగా

ఏం ఎందుకంటే .. "అద్దు మంచిదికాదట . మా అమ్మ ఎప్పటికి ఎడుత్తది. కొడ్కా తాగకురా అని. మా తమ్ముడు సుత తాగిండంటే మా అమ్మ గుండెవగిలిసత్తది." అమ్మపై తడి ఆరని ప్రేమ.

వాడి ఆలోచనల్లో ఉండగానే మా వాహనం పోలీస్ స్టేషన్ ముందాగడం నా ఫోన్ మోగడం ఒకేసారి జరిగింది. "అమ్మ.. నేను సాయమ్మను. చంద్రి గాడొచ్చిండు. చెప్పకుంట పారేల్లొచ్చిన్డట.. గద .. మీరు పరేశానయితరని అప్పటికెల్లి ఫోన్ జేత్తాన్న . గిప్పటికి కల్సింది.. చెప్తోందామె .. నానెత్తి మీద పెద్ద భారం దిగిన ఫీలింగ్. హమ్మయ్య అని గట్టిగా ఊపిరి పీల్చుకున్నా . నేను జీపులోనే కూర్చొని మిగతావాళ్ళకి ఆగమని సైగ చేశా. చంద్ర తల్లి చెప్పుకుపోతోంది వాడు ఎలా వచ్చిందీ .. చంద్ర పక్కనే ఉండి ఏదో చెబుతున్నాడు . వాడి గొంతు వింటుంటే కోపం తన్నుకొస్తోంది. నిన్నటి నుండి ఎంత బాధ పడ్డాం . ఎంత టెన్షన్ అనుభవించామో తలచుకొని ఒకసారి ఫోన్ వాడికివ్వమన్నా .. "ఎందుకిలా చేశావ్?" కోపంగా అడిగా

''మా అమ్మకి జరమొచ్చిందని కలవడ్డది. అమ్మని చూడబుద్దయింది. అచ్చిన"

"మరి చెప్పొచ్చుగా .."

"మొన్న సరిత వాల్ల పెద్దమ్మ కందూరుకు తోల్కపోనత్తే నువ్వు తోలలే గద .. పండుక్కు పంపుతనన్నావ్ గద." ఎదురు ప్రశ్న.

అవును , నిజమే .. మరో పది రోజుల్లో పండుగ సెలవులు అని పంపలేదు.

"మరి నువ్వు ఎట్లా వెళ్ళావ్ .. ? నీదగ్గర పైసలు లేవు గద .."

"అవ్ నా తాన చిల్ల పెంక లేదు. బస్ల ఎన్క సీటు కింద కూసున్న..టికెట్లాయన సూడకుంట. కామారెడ్డి కాడ దిగిన. సిరిసిల్ల బస్సెక్కిన. ఆడ దిగేవరకంటే రాత్రయింది. అట్లనే పన్న . పొద్దుగాల్ల తెలివికచ్చి చూద్దును గద బస్సుల ఉంటి. బస్ లకేల్లి అరిచిన. ఎవ్వరు రాలే. ఒక కిటికీకి అద్దం లేకుండే. దాంట్ల కెల్లి దుమ్కిన. ఆటోల కాడికి బోయిన . మా ఊరి ఆటో కనవడ్డది. అన్న ఆకలయితాందే అంటి. పూరి తినబెట్టిండు. ఇంటికాడ దిమ్పిండు". అని చెప్పి " అక్కా మా తమ్ముడు మంచి గున్నడా .. నాకోసం ఏడుత్తండా .. రేపత్తనని జెప్పక్కా .. రజినక్కకు జరం తగ్గిందా .. మా మేడం ఏమన్నది" అడుగుతున్నాడు.

తోటి విద్యార్థిని వాంతి చేసుకుంటుంటే దోసిట పట్టి అవతల పడేసిన చంద్ర.. మొక్క విరిగితే దానికి నాలుగు వైపులా రాళ్ళు పెట్టి కర్రపుల్ల ఆసరాతో ఆమొక్కని నిలబెట్టిన చంద్ర.. ఆ తెలివి తేటల్ని .. అమ్మ అంటే ఉన్న ప్రేమ, తమ్ముడంటే ఉన్న ఆప్యాయత, బాధ్యత ఇతరుల పట్ల ఉన్న సహానుభూతి, సహజంగా వికసిస్తున్న వ్యక్తిత్వం, స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే తత్వం అబ్బురపరుస్తూ .. ఆకాశంలో రంగుల్లా .. స్వచ్ఛమైన గాలిలా .. పారే సెలయేటిలా .. వెన్నెల వెలుగులా కనిపిస్తూ చంద్ర. వాడి చుట్టూ ఉన్న ముళ్ళు ఏరివేస్తూ, మంచితనాన్ని మసకబారించి తప్పుటడుగులు వేయించే స్వార్ధపరులను దాటుకుంటూ, ఏర్పడే తుఫానుల్ని తట్టుకుంటూ ముందుకు వెళ్ళగలడా? ప్రశ్నార్ధకంగా మారుతున్న తప్పటడుగుల బాలల భవిష్యత్ చిత్రాన్ని చిత్రించడం ఎలాగ అని ఆలోచిస్తూ.. సంఘర్షిస్తూ.. మా వాహనం వెనక్కి తిప్పాం ◆

**కవిత**

# ముసురులోనూ గుండె దివ్వెలు

డా॥ కత్తి పద్మారావు
9849741695



మనల్ని మనం దర్శించుకోవడమే
ఒక జీవన తత్వం
దృశ్యమాన ప్రపంచమంతా
సముజ్వలంగా భాసిస్తుంది
ఈ సముద్రం నిరంతరం
కల్లోలితం అవుతూవుంది
అలల సుడులు తిరుగుతున్నాయి
సముద్ర హోరుకు చెవులు గింగురుమంటున్నాయి
సముద్రం నడక నుంచి పరుగు నేర్చుకుంటుంది
ఇసుక గుంతల్లో నుండి
ఎండ్రకాయలు గుంపులు గుంపులుగా వస్తున్నాయి
బస్తీ వాడంతా బిక్కుబిక్కు మంటుంది
లాంతర్లు కూడా ఊగి ఊగి
వత్తి ఒడిగట్టి వుంది
ఏమిటో! ఈ ముసుర్లు
గుడిసెల్లో ముదసళ్ళు గజగజ వణుకుతున్నారు
దుప్పటంతా చిరుగులు బట్టి
సందుల్లో నుండి చలి కీళ్ళలోకి ప్రవహిస్తుంది
అవును!
భారతదేశాన్ని ఈ చలిలో కూడా
వీళ్ళు ఊడుస్తున్నారు
అంతా చెత్తతో నిండివుంది
వీళ్ళు ఏసి గదుల్లో పట్టిన బూజుకు
వీరి ఊపిరితిత్తుల్లోను మంచు జల్లెడా అల్లుకొంది
వీరు స్టార్ హోటళ్ళల్లో
తినగా పారేసిన వాటితోనే
పెనుముప్పు వచ్చింది
కొంతమంది తినేది తక్కువ పారేసేది ఎక్కువ
కొంతమందికి తిండేలేదు
అవును!
వీరు క్షణక్షణం భయంలోనే బతుకుతున్నారు
జాతీయ బ్యాంకుకు డబ్బు ఎగవేసినవాడు
అమాత్యుడయ్యాడు
మరి వీళ్ళు నల్ల డబ్బును
స్విస్ బ్యాంకు నుంచి ఎలా బయటకు తీస్తారు
ఆ పడతులు కార్తీక మాసానికి
లక్షల దీపాలు వెలిగిస్తున్నారు
గుండె దీపాలు మాత్రం ఆరిపోతున్నాయి
వీరు పూజామందిరాల్లో
దీపాలంటుకొని మరణించేవారి
సంఖ్య కూడా పెరుగుతోంది
ఆ సంచలన దర్శకుడు
ఆ సౌందర్యవతి పాదాక్రాంతమయ్యాడు
ఆయన అందాన్ని గౌరవిస్తాడంట!
బానిసలంతా ఈ అధీన సందేశాలే ఇస్తారు
అడవంతా నిశ్శబ్దంగా వుంది
పులి గాండ్రించడం మానివేసింది
ఇప్పుడు తోడేళ్ళదే రాజ్యం
ఆ జింకలు మాత్రం సమూహం ద్వారా
విజయ దుందుభిని మ్రోగిస్తున్నాయి
అవి భయాన్ని జయిస్తున్నాయి
మనిషి మాత్రమే భయం గుప్పెట్లోకి పోతున్నాడు
ఏదో స్వర విహ్వలానికి అతడు లొంగిపోయాడు
గుంపు నృత్యాలన్నీ ప్రకృతిలోని
ఐక్యతనే ప్రకటిస్తున్నాయి
ఆ నది మీద కట్టిన కర్రల వంతెన
ఎందరో బాటసార్లును
ఆవలి గట్టుకు చేర్చింది
అవును!
వీరి మెదడుల నిండా
బూజే పట్టి వుంది.
జ్ఞానం అసలు మెదడుల్లోకి జొరబడటం లేదు
మెదడులో వుండే అనేక దీపాలు
అసలు వెలగడమే లేదు
అన్ని స్పృహలను వీరు కోల్పోయి
రాళ్ళకు మోకరిల్లి మోకరిల్లి
శక్తినంతా పోగొట్టుకుంటున్నారు
అడవిలో కూసినంత స్వేచ్ఛగా
ఇక్కడ ఏ పక్షి కూయలేకపోతుంది
ఎదురుగా వున్న మనుషుల పట్ల
దృశ్యానుభూతి తగ్గుతోంది
సముద్రం మళ్ళీ ఎర్రగా వుంది
ఇది సూర్యుణ్ణి మింగేసింది
మనిషికి జ్ఞానం వచ్చేదాక
ప్రకృతి కాదు తనకు తానే అర్థం కాదు
అవును!
మానవుడు తననుతాను అర్థం చేసుకోవాలి
తనలో సముద్రంలా పొంగుతున్న
భావోద్వేగాలను అదుపు చేయాల్సిందే
వ్యక్తిత్వ నిర్మాణానికి
ఒక మహోన్నత శిల్పిలా ఆవిర్భించాల్సిందే
అతడో ప్రజ్వలన శక్తి
అందుకే
ముసురులోను గుండె దివ్వెలు




# సామాన్యుడి చేతిలో సామాజికాస్త్రం - సినీ సంభాషణం

డా॥ పరుచూరి గోపాలకృష్ణ
డా॥ సింగుపురం నారాయణరావ్

సంభాషణ అంటే మనిషికీ మనిషికీ మధ్య జరిగే సంవాదం.

*Dilogue must communicate in formation or true facts of your story to the audience. It must move the story forward. It must reveal character. Dialogue must reveal conflicts between and within characters, and emotionalstates and personality quirks of character; dialogue comes out of character.*

*-**Syd Field,** Screenplay - Page - 32*

*Dramatic dialogue is never real speech but it has to sound like real speech. It is compressed and heightened reality. In life, a onversation or a 'scene' doesn't necessarily reach a conclusion, but in a screenpaly your scenes must have drive and come to a conclusion.*

*- **Pat Silver** - Lasky - Screen Writing for the 21st Century - Page - 11*

*Dialogue has traditionally been the writer's forte. It's a primary method by which the screen writer developes theme, character, stratcture, and mise-en-scene. It's the form that express content through what's said and how it's said. Dialogue is never just voices talking. It's voices saying things very deliberately. They tell us what each character is thinking what they want and what they believe in.*

*- **Margaret Mehring** - The Screenplay - Page - 171*

*"సరి అయిన సంభాషణలు పాత్రను పోషించాలి, ప్రతిబింబించాలి సన్నివేశానికి, సందర్భానికి అనుగుణంగా ఉండాలి, కథనానికి కొంతలో కొంత తోడ్పడాలి."*

*__కొడవటిగంటి కుటుంబరావు__ – సినిమా వ్యాసాలు – రెండవ సంపుటం – పుట – 339.*

పై అభిప్రాయాలను పరిశీలిస్తే, పాత్రకు అనుగుణంగా, దానిని పోషించేట్లుగా, వ్యక్తిత్వాన్ని ప్రదర్శించేటట్లుగా, సందర్భోచితంగా, సన్నివేశానికి అనుగుణంగా, కథను ముందుకు నడపటానికి, తాను ఏం చెప్పదలచుకున్నాడో దానికి ముగింపు వచ్చేలా సంభాషణలు ఉండాలి.

ఇంతవరకే అయితే, తెలుగు సినిమాలలో, సంభాషణల గురించి రాయవలసిన అవసరం లేదు. వ్యక్తిత్వానికి అనుగుణంగా అన్న పదాన్ని ఆసరా చేసుకుని, ఆయా పాత్రల ముఖతా, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వేలెత్తి చూపించటానికి, కుళ్ళును కడిగెయ్యటానికి, స్ఫూర్తిని నింపటానికి, సామాజిక స్పృహను కలిగించటానికి, సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని, సామాజిక దృష్టితో రచించిన సంభాషణలు, సమాజంలోని కొందరు మనుషులకు కనువిప్పు కలిగిస్తాయి.

సినిమా డైలాగులంటే, 'అరిస్తే చరుస్తా, చరిస్తే కరుస్తా, కరిస్తే, నిష్క్రమిస్తా' అనో, 'జంబలకిడిపంబ భూలోక రంభ'

అనో, 'నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా?' అనో, 'తప్పు తప్పు రాణీ గారి తమ్ముణ్ణి' అనో 'బాక్సు బద్దలైపోయిద్ది' అనో, 'రఫ్ఫాడిస్తా' అనో, 'కొంచెం ఫేసు టర్నింగ్ ఇచ్చుకో' అనో మాస్ ప్రేక్షకుల్ని అలరించిన మేనరిజమ్స్ మాత్రమే కాదు.



సందర్భానుసారంగా. ఆయా పాత్రల పరిధిని దృష్టిలో పెట్టుకుని, ఔచిత్యం దెబ్బ తినకుండా, సినిమాలో పక్క పాత్రలకు చెబుతున్నట్లుగా ఉండాలి. ఉదాహరణ కోసం కొన్ని సంభాషణలను పరిశీలిద్దాం.

## 1. అరిచి గోలచేసే హక్కు - మరో మలుపు

'మరోమలుపు' చిత్రంలో ఆ ఊరి కామందు రాయుడు. ఆ ఊళ్ళో ఉన్న ఆలయానికి కూడా ధర్మకర్త ఆయనే. పళ్ళెంలో పడే కానుకలో, ఎప్పుడయినా ఎవరన్నా పిలిచి పూజ చేయించుకుని, స్వయంపాకం పెడితేనో, పూజారి కేశవశాస్త్రి కుటుంబం కడుపు నిండుతుంది.

ప్రతి దసరా పండుగకి కానుకలు బాగా వచ్చి, కనీసం ఆరు నెలల గ్రాసం, ఆ కుటుంబానికి లభిస్తూ ఉంటుంది. అయితే ఆ డబ్బు కూడా తానే మింగెయ్యాలన్న భావనతో, రాయుడు, గుడికి మరమ్మత్తులు చేయించాలన్న నెపంతో, బిందెను హుండీలా పెట్టి, కరణం మామగారైన పిచ్చయ్య శాస్త్రితో ఆ డబ్బును స్వాహా చేస్తాడు.

కేశవశాస్త్రి చిన్న కుమార్తె మంచాన పడి, అన్నం లేక జ్వరంతో బాధ పడుతుంటే, ఆమె అక్క గాయత్రి భరించలేక కామందు రాయుడుగారింటికి వస్తుంది. అక్కడ జరిగిన సంభాషణ.

కరణం: గుడిని బాగు చేయిస్తామన్నారు?

రాయుడు : బాగు చేయించి దారి చూపించామనుకో, అమ్మవారు తిన్నగా వచ్చి మన పీకే పట్టేసుకుంటుంది. (ఇద్దరూ నవ్వుకుంటూ ఉండగా గాయత్రి వచ్చింది)

రాయుడు : అరె గాయత్రా? ఏంటమ్మా ఇట్టావచ్చా?

గాయత్రి : దసరా పండుగ నాడు దేవికి వచ్చిన కానుకలు అవీ మాకు చెందాలిగా? అవి అడగటానికని వచ్చాను.

రాయుడు : ఆ సొమ్ములన్నీ ఆలయ మరమ్మత్తులకు కేటాయించామని మొన్నే చెప్పాం గదమ్మా..

గాయత్రి : ఆ డబ్బు మీ స్వార్థానికి ఉపయోగించు కుంటున్నారు. మీ దోపిడీ విధానం నాకు తెలియదనుకున్నారా?

రాయుడు : ఇదేంటిది? నీమ టపాకాయలా పేలిపోతున్నావేంటి? (నవ్వి) ఏంటమ్మా అది, దోపిడీనా? ఆ మాట మా గేమాలలో మేం ఎప్పుడూ వినలేదే! నీ పట్నం బళ్ళోగాని చెబుతున్నారా తల్లా?

కరణం: బళ్ళో కాదులెండి.. గుళ్ళో పూజారి చెబుతున్నాడు. తను అడగలేక ఇట్టా... ఇట్టా.. కూతురి చేత అడిగిస్తున్నాడు.

గాయత్రి : మర్యాదగా మాట్లాడండి. మా నాన్నగారు మమ్మల్ని పస్తులు పెట్టారే గానీ, ఏనాడూ ఎవరినీ యాచించలేదు.

కరణం: మరిదేంటో.. అడుక్కు తినడంలో కొత్త పద్ధతా?

గాయత్రి : నేనేం అడుక్కో టానికి రాలేదు.. మా చెల్లి జ్వరంతో ఒళ్ళు తెలియకుండా పడుంది..

రాయుడు :చ్చొచ్చొచ్చొ..

గాయత్రి : మీరేం జాలి పడక్కర్లేదు.. న్యాయంగా మాకు రావాల్సింది మాకిచ్చేయండి.

రాయుడు : చూడు తల్లీ.. నువ్వేమో నీ చెల్లెలి క్షేమం చూసుకుంటున్నావ్.. నేనేమో దేవత క్షేమం చూసుకుంటున్నాను. దేవత చల్లగా ఉంటేనే గదమ్మా ఊరు చల్లగా ఉండేది.

గాయత్రి : దేవత.. ఆ దేవతే సత్యంగలదయితే ఆమె పేరుతో ప్రజల సొమ్ము దోచుకుంటున్న మిమ్మల్ని నిలువునా దహించివేసేది. ఆమెనే నమ్ముకున్న మా కుటుంబానికి ఇంత నీడ చూపించేది.

కరణం: ఆ..ఆ.ఆ. దేవుడే నా ప్రాణం, ఆలయమే నా ఇల్లనే, పూజారి కూతురేనా ఇట్టా మాటాడేది.

గాయత్రి : అవును... ఆ పూజారి కూతురినే మాట్లాడుతున్నాను. జ్వరంతో మా చెల్లెలు కన్ను మూసినా, ఆకలితో ప్రాణాలు కొడిగొట్టినా, ఆ పాపం మీదే అవుతుంది. మా ఉసురు తగిలి మీ వంశం సర్వనాశనం అవుతుంది. గుర్తుంచుకోండి (అని వెళ్ళిపోయింది)

కరణం: ఆ అమ్మాయట్టా దులిపేస్తుంటే మాట్లాడరేం?

రాయుడు : అన్యాయానికి బలైపోయిన వాళ్ళకున్న ఒకే ఒక హక్కు అరిచి గోల చెయ్యడం.. దాన్ని కూడా మనం లాగేసుకుంటే ఎట్టా? ఉండనీ... ఉండనీయండి..

నిజానికి దసరా పండుగ సందర్భంగా వచ్చిన దక్షిణలు తమ కుటుంబానికి చెందాలి కాబట్టి అడగటానికి వచ్చింది. అది కూడా ఆకలితో ఇంట్లో వాళ్ళందరూ బాధ పడుతున్నప్పుడు రాలేదు. చెల్లెలు జ్వరంతో, దేవుడి పిలుపుకి దగ్గరైనప్పుడు వచ్చింది. వచ్చాక కూడా ముందు చాలా నెమ్మదిగా, పద్ధతిగా,

'దసరా పండుగనాడు వచ్చిన కానుకలు మాకు చెందాలిగా, అని అడగటానికి వచ్చాను' అంది.

'ఆ డబ్బు ఆలయ మరమ్మత్తుల కోసం అని అప్పుడే చెప్పాంగా' అంటే, 'ఇప్పుడు బయటపడింది. ఆ డబ్బు మీరు స్వార్ధానికి ఉపయోగించుకుంటున్నారు' అంది. అది కూడా నింద కాదు. నిజం! నిజమైన ఆరోపణ. కానీ ఆమె వాడిన 'దోపిడీ' అనే పదాన్ని పట్టుకుని, విషయాన్ని పక్క దోవ పట్టించాలని చూసాడు రాయుడు. 'దోపిడీనా.. అది మా గేమంలో ఎప్పుడూ వినలేదు. మీ బళ్ళోగాని చెబుతున్నారా 'అన్నాడు.

వెంటనే కరణం, అది కేశవశాస్త్రి మీదకు తోసేసి, ఇంకా సమస్యను పక్క దారి పట్టించటానికి, 'బళ్ళో కాదు గుళ్ళో పూజారి నేర్పా'డన్నాడు.




నిజం చెప్పక తప్పలేదు గాయత్రికి. చెల్లి చావు బతుకుల్లో ఉన్న నిజం చెప్పేసింది. ఇప్పుడయినా హృదయం ఉన్నవాడయితే రాయుడు ఎంతో కొంత సాయం చేసి పంపాలి, కాని 'చూడు తల్లీ నువ్వేమో నీ చెల్లెలి క్షేమం చూసుకుంటున్నావ్. నేనేమో దేవత క్షేమం చూసుకుంటున్నా' అని టాపిక్ దేవత మీదకు మళ్ళించాడు.

ఇప్పుడు బరష్టయ్యింది గాయత్రి. 'ఆ దేవతే సత్యంగలదయితే, మిమ్మల్ని నిలువునా దహించివేసేది, ఆమెను నమ్ముకున్న మా కుటుంబానికింత నీడ చూపించేది' అని, 'మా చెల్లెలు జ్వరంతో కన్ను మూసినా, ఆకలితో ప్రాణాలు వదిలినా మా ఉసురు తగిలి మీ వంశం సర్వ నాశనం అవుతుంది' అని శపించింది.

నిజానికి రాయుడు, ఆమెను గెంటించివేయాలి. కానీ మౌనంగా ఆ తిట్లు విని ఊరుకున్నాడు. కరణం 'ఆ పిల్ల అట్టా తిడతంటే ఊరుకున్నారేంటి?' అంటే 'అన్యాయానికి బలైపోయిన వాళ్ళకున్న ఒకే ఒక హక్కు అరిచి గోల చెయ్యడం. దాన్ని కూడా మనం లాగేసుకుంటే ఎట్టా? ఉండనీ.. ఉండనీ..' అన్నాడు.

ఈ మాట సూటిగా సామాజికుల హృదయాలలోకి వెళ్ళిపోతుంది. రసముయన్నిష్ఠము అంటే సామాజికనిష్ఠమే అన్నారు కదా! సామాజికుడికి ఒక్కసారిగా ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

తాను ఆవేశంతో మాట్లాడిన సంగతి గుర్తుకు వస్తుంది. అరిచి గోల చెయ్యడం హక్కు మాత్రమే. దానికి స్పందించి, అధికారులు, కామందులు సాయం చేసే బాధ్యతను స్వీకరించరు అని తెలుసుకుంటారు.

నేడు టి.వి.లో చూస్తునవాళ్ళు, రోడ్డు మీదకు హక్కుల కోసం వచ్చే, ఆయా కార్మికుల్ని, విద్యార్థుల్ని, ఉపాధ్యాయుల్ని చూస్తుంటే. ఒక్కసారి ఈ సంభాషణ గుర్తుకు వస్తే జాలి పడతారు. అరిచి గోల చేసిన తర్వాత ప్రభుత్వాలు స్పందించవు అనే సందేశాన్ని, ఆ అరుస్తున్నవాళ్ళకు చెప్పాలన్నంత, ఉద్వేగానికి గురవుతారు ప్రేక్షకులు. ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు అని రెండు తరగతులు నడిచినంత కాలం ఈ దోపిడీ ఇలా జరిగిపోతూనే ఉంటుందన్న సందేశం ఈ సంభాషణ అందించింది.

## 2. కులం పేరు - మరోమలుపు

క్రాంతి అభ్యుదయవాది. కళాశాలలో చేరతాడు. అతను అప్లికేషన్ ఫారమ్‌లో 'కులం' అన్న పేరు ఫిలప్ చెయ్యడు. యాజమాన్యం పిలిపిస్తుంది. అప్పుడు జరిగిన సంభాషణ.

కమిటీ ప్రెసిడెంట్ : ఎవరండీ ఆ కుర్రాడు..

ప్రిన్సిపాల్ : చూస్తారుగా.. (ఇప్పుడు క్రాంతి లోపలకు వస్తాడు)

క్రాంతి : గుడ్‌మార్నింగ్ సార్..

ప్రెసిడెంట్ : ఏ ఊరు నీది?

క్రాంతి : చైతన్యపురం...

ప్రెసిడెంట్ : అదెక్కడుంది..

క్రాంతి : క్రాంతి పట్టణానికి దగ్గరగా..

ప్రెసిడెంట్ : తల పొగరు చాలా ఉన్నట్టుంది. ఇందులో క్యాష్ట్ అన్న కాలం పూర్తి చేయనన్నావట?

క్రాంతి : అన్నాను..

ప్రెసిడెంట్ : అన్నావని తెలుసులేవోయ్.. ఎందుకు అన్నావని?

క్రాంతి : అవసరం లేదు గనుక..

ప్రెసిడెంట్ : మాకు పిచ్చిపట్టి ఈ కాలం పెట్టామనుకున్నావా అప్లికేషన్‌లో..

క్రాంతి : మీరెవరు?

ప్రెసిడెంట్ : ఈ కాలేజీ కమిటీ ప్రెసిడెంట్‌ని..

ప్రిన్సి : మిష్టర్ అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పు..

క్రాంతి : కులాన్ని బట్టి చదువులు చెప్పే రోజులు పోయాయి. పైగా కొంతమంది రాజకీయ నాయకులు, ఏ విద్యా సంస్థలో ఎంతమంది ఏ కులం వాళ్ళు చేరుతున్నారో తెలుసుకుని, వర్గ కలహాలను రెచ్చగొడుతున్నారు. అందుకే రాయను.

ప్రెసిడెంట్ : గెడ్డం పెంచడంలా కులం పేరు చెప్పుకోకపోవడం ఫ్యాషన్ అనుకుంటున్నావా?

క్రాంతి : నేను గెడ్డాన్ని ఫ్యాషన్ కోసం పెంచడం లేదు మహాశయా.. ముఖం షేపుల్ని బట్టి, ఎవడు ఏ కులంవాడో పసిగట్టేసే మహా మేధావులున్న దేశం మనది. అందుకే నా ముఖం నమూనా తెలియకుండా గెడ్డాన్ని అడ్డంగా పెంచుతున్నాను..

ప్రెసిడెంట్ : పిచ్చోడివా!

క్రాంతి : తెలివిగడలవాడికి ఈ సమాజం పెట్టిన పేరది..

ప్రెసిడెంట్ : అతివాదివా?

క్రాంతి : అన్యాయాన్ని ఎదిరించేవాడికి ఈ సంఘం ఇచ్చిన బిరుదది...

ప్రెసిడెంట్ : ఇదిగో రూల్స్ అతిక్రమిస్తున్నావ్..

క్రాంతి : శాసనోల్లంఘనం మహాత్ముడు నేర్పిన విద్య..

ప్రెసిడెంట్ : షటప్పు..

క్రాంతి : పెద్ద వయసులో ఆవేశపడితే బ్లడ్ ప్రెషర్ పెరుగుతుంది

ప్రెసిడెంట్ : ఇంతకీ ఈ కాలం పూర్తి చేస్తావా లేదా?

క్రాంతి : చెయ్యను..

ప్రెసిడెంట్ : చెయ్యకపోతే ఈ కాలేజిలో నీకు సీటు లేదు..

క్రాంతి : మంచిది.. ఎందుకివ్వరో నేనూ చూస్తాను (అని వెళ్ళిపోయాడు)

కళాశాలల్లో అడ్మిషన్లు జరిగేటప్పుడు, కొందరు రాజకీయ నాయకులు, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసులోకి వెళ్ళేవారు. కళాశాలలో ఉపన్యాసకుడిగా పని చేస్తున్న నాకు, వాళ్ళు ఎందుకు వెళుతున్నారు? ఎవరన్నా స్టూడెంట్‌ని జాయిన్ చెయ్యాలంటే ప్రిన్సిపాల్‌ని, గవర్నింగ్ బాడీ ప్రెసిడెంట్‌ని కలవాలి. కాని వాళ్ళకి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులో పనేంటి? అని అనుమానం వచ్చి, ఆఫీసు లోపల ఒక గుమస్తాను అడిగితే, అప్లికేషన్లో 'క్యాస్ట్' అన్న కాలం కోసం వస్తున్నారు అని చెప్పాడు. వాళ్ళకేం అవసరం అంటే రేపు స్టూడెంట్ ఎలక్షన్లొస్తాయి కదండీ, అప్పుడు ఆయా కులాల వాళ్ళను రెచ్చగొట్టి నిలబెట్టేస్తారు. వీళ్ళు ఒక కులం వాడిని నిలబెడితే, అవతలి లీడర్ ఇంకో కులం వాడిని నిలబెడతాడు అని చెప్పాడు.

ఈ నిజాన్ని ప్రత్యక్షంగా చూసాను. కుల పోరాటాలు కళాశాలలో జరగటం కూడా చూసాను. పై దృశ్యం ఈ నిజాన్ని ప్రతిబింబిస్తుంది. ఊరు చైతన్యపురం అంటాడు. అది క్రాంతి పట్టణానికి దగ్గరగా ఉంది అంటాడు. నిజానికి ఈ కుర్రాడిది ఏ కులమో, ఏ ఊరో సినిమాలో తెలియదు. చైతన్యవంతులై, క్రాంతి పట్టణ జీవులై కులానికి దూరంగా ఉండాలన్న సందేశం ఇస్తున్నాడు. దానికి కారణం కొందరు రాజకీయ నాయకులు విద్యార్థులను కులాలవారీగా రెచ్చగొట్టడమే అన్నాడు.

'కులం రాయకపోవడం, గెడ్డం పెంచడంలా ఫ్యాషన్ అనుకుంటున్నావా 'అంటే, 'ముఖ పోలికలను బట్టే కులం పేరు చెప్పే మేధావులున్న దేశం మనది. అందుకే నేను ముఖం నమూనా తెలియకుండా గెడ్డాన్ని అడ్డంగా పెంచాను' అన్నాడు.

ఈ వేషం వేసిన నటుడికి, విజయవాడలో అలంకార్ థియేటర్ దగ్గర, యువకులు బ్లేడ్‌తో బొటనవేళ్ళు కోసుకుని, రక్త తిలకం దిద్దడం స్వయంగా చూసాను. ఆ పాత్ర యువతలో ఎంతో స్ఫూర్తిమంతమైన ఆలోచనలు రేకెత్తించిందో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పటికీ కొంతమంది మీరు ఫలానా క్యాస్టా? అని అడుగుతారు. ఎలా అడిగారు అంటే ఆ క్యాస్ట్ వాళ్ళు ముఖాలు ఇలాగే ఉంటాయి అని అంటారు. మీరు గమనిస్తే తెలుగు రాష్ట్రాలలో కొన్ని కులాల వారిని పరిశీలిస్తే వాళ్ళు చెప్పకుండానే వాళ్ళు ఫలానా క్యాస్ట్ అని చాలామందికి అర్థం అవుతూ ఉంటుంది. దానికోసం రాసిన సంభాషణ అది.

'నిజం మాట్లాడితే పిచ్చోడంటారు. కానీ తెలివైన వాడికి సమాజం పెట్టిన పేరది' అన్నాడు. 'అతివాదివా' అంటే 'అన్యాయాన్ని ఎదిరించేవాడికి, ఈ సంఘం ఇచ్చిన బిరుదది' అన్నాడు.

ఈ విధంగా వందలాది చిత్రాలలో వేలాది సంభాషణలు సమాజానికి ఉపయోగపడటమే కాదు. వాళ్ళను చైతన్యవంతుల్ని చేస్తాయి.

'రోగిని ప్రేమించలేని డాక్టర్ కూడా ఒక రోగితో సమానం' అన్న శంకర్‌దాదా ఎం.బి.బి.ఎస్. చిత్రంలోని మాట సమస్త వైద్యులకు కనువిప్పు కలిగించదా? 'కనురెప్ప కిందికి దిగితే వినయం, పైకి లేస్తే విప్లవం. రెప్పపాటు దూరంలో దోపిడీ జరిగిపోతోంది' అన్న 'ఈ చరిత్ర ఏ సిరాతో' చిత్రంలో డైలాగు చాలదా అభ్యుదయవాదులను మేలుకొలపటానికి? ఒక్కొక్క మాట ఒక తూటాలాగా, సామాన్య మానవుడి చేతికి అందిన సామాజిక అస్త్రంలాగా పనిచేసి, సమాజచైతన్యం కోసం సినీ సంభాషణలు ఉపయోగపడ్డాయి, ఉపయోగపడుతున్నాయి, ఉపయోగపడబోతున్నాయి కూడా! ◆

## కవిత

# మృత్యు స్పర్శ

ఝాన్సీ.కె.వి.కుమారి
9010823014

నిరంతరం నిన్ను వెన్నంటే ఉంటుంది
బెదురుగా... బెరుకుగా
ముందూ వెనకా చూస్తూ
భయం భయంగా
నువ్వు సాగిపోవలసిందే
చంద్రుడైనా
సూర్యుడైనా
చినుకైనా
మెరుపైనా
ఏవీ నీకు తోడురావు
ఏ చెట్టుగన్నెక్కుపెడుతుందో
ఏ పుట్ట పగబడుతుందో
ఏ రోడ్డు బాంబవుతుందో



ఏ రాడ్డు పేలిపోతుందో
ఏ వాహనం మృత్యువాహక మౌతుందో
ఏ సాహసం ఎలా తెల్లవారుతుందో....

పెదవిని తాకిన మెతుకు
నేలరాలిపోవచ్చు
ఎదలో కదిలిన స్వప్నం
మాడి మసి బారవచ్చు
ఇదే ప్రజాస్వామ్యమిచ్చిన తీర్పు
స్వేచ్ఛా పతాకం సాక్షిగా
నిత్యం నిన్ను వెన్నంటి సాగే మృత్యుస్పర్శ

# అద్దం వెనుక...

సంగెవేని రవీంద్ర
099871 45310

అక్కడొక్కప్పుడు ఓ మిల్లుండేది....
దాని ఒంటినిండా అన్నముండేది
ఏం జరిగిందో ఏమో రాత్రికి రాత్రే
మిల్లు మాయమై
కరెన్సీ కట్టలు విస్తారంగా పరుచుకున్నాయి.....

చెమట దేహాల చెలిమలన్నీ ఎడారులయ్యాక
అక్కడ గుప్పుగుప్పుమనీ
ద్రోహభవనాలు మొలుచుకొచ్చాయి...

మనిషినుండి ఐటీ రోబోలుగా
రూపాంతరం ఇంద్రుడు
డాలర్ వేదికపై వలువలు జారేస్తున్నాయి...

అన్‌వాంటెడ్ ప్రొగ్రెస్ కండోమ్‌లో
టెక్నాలజీ ఇంద్రుడు
రాత్రింబవళ్ళు డ్రీమ్‌థీమ్‌ల్ని స్ఖలిస్తున్నాడు....

గ్లోబల్ నగ్నత్వానికి లోబడిన
కార్పోరేట్ సుందరి....
కుట్రల అక్టోపస్‌ల్ని కుప్పలు కుప్పలుగా
ప్రసవించాకా... అక్కడ
మార్కెట్ మాయాజాలం కోరలు విప్పింది...



దిక్కూ మొక్కు పోగొట్టుకున్న
ఉప్పు శరీరాలక్కడ....
దీనంగా, గోడకు కట్టిన పిడకల్లా...
అన్యాయమంత ఆశ్చర్యంతో....

వస్తుప్రదర్శనా శాలలో అవశేషమైన ఆ మిల్లు ముందు
పొద్దస్తమానం తిరుగుతుంటాను...
ఎప్పుడైనా ఏదో ఒక మనిషి మాట విన్పిస్తుందనే ఆశతో...
'ఆశకు హద్దుండాలి...' ఆకాశవాణి వెక్కిరించింది....!!!

(ముంబాయిలో మూతబడిన బట్టలు మిల్లు స్థలాల్లో
మొలుచుకొచ్చిన ఆధునిక భవన సముదాయాల
నేపథ్యంలో.....)



# దేశీయతకి పట్టం కట్టిన బాలచంద్ర నెమాడే

- డా॥ జి.వి. రత్నాకర్
9849303175

*ప్రముఖ మరాఠీ రచయితలు వి.యస్. ఖాండేకర్ (1974) వి.వా.శిరవాడకర్ (1987) విం.దా. కరందీవర్(2013)ల తర్వాత జ్ఞాన్‌పీఠ పురస్కారాన్ని పొందిన నాలుగవ మరాఠీ, రచయితగా ప్రొఫెసర్ బాలచంద్ర నెమాడేని పేర్కొనవచ్చు. ప్రొఫెసర్ బాలచంద్ర నెమాడేకి మరాఠీ సాహిత్యంలోని అన్ని పార్శ్వాల్ని, చరిత్రకందని చీకటి కోణాల్ని ఆవిష్కరించిన వ్యక్తిగా ప్రముఖ స్థానం ఉంది. నవల, కవిత, విమర్శల్లో ఆయన స్థానం అద్వితీయమైనది.*

మరాఠీ రచయిత, నవలాకారుడు, కవి విమర్శకుడు, విద్యావేత్త అయిన బాలచంద్ర నెమాడే 1938న మహారాష్ట్రలో జన్మించారు. 1963లో 24 సం॥ వయస్సులో ఆయన రచించిన "కోసలా" అనే నవలతో ఆయన జగద్విఖ్యాతి చెందారు. 1991లో రచించిన "టీకా స్వయంవర్" అనే గ్రంథానికి నెమాడేకి "సాహిత్య అకాడమీ" అవార్డు లభించింది. 2015లో ప్రకటించిన "జ్ఞానపీఠ పురస్కారం" నెమాడే రచించిన "కోసలా" నవలని వరించింది. ప్రసిద్ధి చెందిన నెమాడే రచనల్లో "కోసలా" "హిందూ" నవలలు ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి. బాలచంద్ర నెమాడే తన సాహిత్యంలో స్థానికతకి పెద్ద పీట వేసారు. 1960లో ఒక ఊపు ఊపిన చిన్న పత్రికల ఉద్యమంలో భాలచంద్ర నెమాడేకి ప్రముఖమైన పాత్ర ఉంది.

ప్రముఖ మరాఠీ రచయితలు వి.యస్. ఖాండేకర్ (1974) వి.వా.శిరవాడకర్ (1987) విం.దా. కరందీవర్(2013)ల తర్వాత జ్ఞాన్‌పీఠ పురస్కారాన్ని పొందిన నాలుగవ మరాఠీ, రచయితగా ప్రొఫెసర్ బాలచంద్ర నెమాడేని పేర్కొనవచ్చు. ప్రొఫెసర్ బాలచంద్ర నెమాడేకి మరాఠీ సాహిత్యంలోని అన్ని పార్శ్వాల్ని, చరిత్రకందని చీకటి కోణాల్ని ఆవిష్కరించిన వ్యక్తిగా ప్రముఖ స్థానం ఉంది. నవల, కవిత, విమర్శల్లో ఆయన స్థానం అద్వితీయమైనది. మరాఠీ సాహిత్య విమర్శలో స్థానికతకి చోటిచ్చిన ప్రవక్తగా నెమాడేని చెప్పవచ్చు.

భారతీయ సాహిత్యంలో స్థానికతకి పెద్ద పీటవేసిన నవలలుగా మళయాళంలో తగలి శివశంకరపిళ్లై రచించిన 'చెమ్మీన్', కన్నడంలో యు.ఆర్. ఆనంతమూర్తి రచించిన "సంస్కార" నవల, మరాఠీ రచయిత బాబూరావ్ బాగుల్ రచించిన "సూడ్" నవల, తమిళంలో బామ రచించిన 'కరకు' నవలలు స్థానికతకి, ప్రాంతీయ మాండలికానికి ప్రాముఖ్యతనిచ్చాయి. అదేవిధంగా తెలుగులో దాశరథి 'చిల్లర దేవుళ్ళు', వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజలమనిషి', జి. కళ్యాణరావు 'అంటరాని వసంతం', వేముల ఎల్లయ్య 'కక్క', భూతం ముత్యాలు 'సూర' నవలలు ఈ కోవలోనివే ఈయన రచించిన రెండో నవల "హిందూ" నాగరికత తెచ్చిన మలుపుల్ని, మార్పుల్ని ప్రస్తావిస్తుంది. కాలం తెచ్చిన మార్పుల్ని అవగాహనని ఈ రచన శాస్త్రీయదృష్టితో విశ్లేషిస్తుంది. గ్రామీణ ప్రాంతాల నుండి ఆధునాతనమైన పట్టణ ప్రాంతాల వరకు వ్యాపించిన సామాజిక అసమానతనల్ని, అన్యాయాల్ని నిశితంగా, లోతుగా అభివ్యక్తీకరించిన నెమాడేని మరాఠీ సాహిత్యంలోని మూడు తరాల్ని ప్రభావితం చేసిన లోకం మెచ్చిన రచయితగా చెప్పవచ్చు.

ప్రొఫెసర్ బాలచంద్ర నెమాడేకి 1990లో సాహిత్య అకాడమీ పురస్కారం సాహిత్య విమర్శ చేసిన పుస్తకం "టీక్కా స్వయంవర"కి లభించింది. 2011లో ఆయనకి పద్మశ్రీ పురస్కారం లభించింది. 2014లో భారత ప్రభుత్వం సాహిత్యానికి ఇచ్చే అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కారం లభించింది.




**నెమాడే రచనలు, నవలలు :** 1. కోసలా 2 హిందూ-జగన్యాచీ సమృద్ధ్ అడగల్ 3. బిథార్ 4. హూల్ 5. జరీలా 6. ఝూల్

**కావ్యాలు :** మెలడీ 2. దేఖణీ

**విమర్శాగ్రంథాలు :** 1. టీక్కా స్వయంవర్ , 2. సాహిత్యాభి భాషా 3. తుకారామ్ 4. The influence of English on marathi: A Sociolinguistic and stylistic study 5. Indo -Anglian writings : Two lectures 6. Nativism (దేశీయత)

భాలచంద్ర నెమాడే 1963లో 25 సం॥ల వయస్సులో తన మొదటి నవల "కోసలా" వ్రాసారు. కోసలా తర్వాత నెమాడే 5 నవలలు వ్రాసారు. అవన్నీ మరాఠీ సాహిత్య రంగంలో జనరంజకంగా ఖ్యాతిని పొందాయి.

నెమాడే కవిత్వంలో, సాహిత్య భాషలో, సాహిత్య విమర్శలో, మరాఠీ సాహిత్య రంగంపై తనదైన ముద్రవేసాడు.

భారతీయ జ్ఞానపీఠ్ పురస్కారం 1961లో టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూపు వారి ద్వారా నెలకొల్పబడింది. మొదటి జ్ఞానపీఠ పురస్కారం మలయాళ రచయిత శంకర్ కూరూప్‌కి ఇవ్వబడింది. హిందీలో ఈ పురస్కారం సుమిత్రానందన్ పంత్, రామ్‌ధారీ సింహ్ దినకర్ అజ్ఞేయ్, మహా దేవి వర్మ నరేష్‌మోహతా, నిర్మల్ వర్మ, కుంవర్ నారాయణ్, అమర్‌కాంత్, శ్రీలాల్‌శుక్లా, కేదార్‌నాథ్ సింహ్ (2013)లకి ఇవ్వబడింది. తెలుగులో మూడు జ్ఞానపీఠ్ పురస్కారాలు 1. విశ్వనాథ సత్యనారాయణ 2. సి. నారాయణరెడ్డి, 3. రావూరి భరద్వాజ (2012)లకి ఇవ్వబడ్డాయి.

## జ్ఞానపీఠ పురస్కార నవల కోసల

పాండురంగ సాంగ్వికర్ అనే గ్రామం నుండి వచ్చి పూణేలో నివాసం ఉంటున్న ఒక యువకుని జీవితం "కోసల" నవల. 1963లో ప్రచురించబడిన ఈ నవల మరాఠీ సాహిత్యంలో సరికొత్త కోణంలో సాగిన రచనగా ప్రఖ్యాతి గాంచింది. నవలలోని కథానాయకుడు 25 సం॥ల యువకుడే. ఈ నవలారచన 45 సం॥ల క్రితం జరిగినా నేటికీ దీని ప్రభావం సాహిత్యక్షేత్రంలో కొనసాగుతూనే ఉంది. యవ్వన కాలంలోని యువకుల ఆవేశం అసహనం, మానసిక క్షోభ, కోపం, ప్రపంచ పరిణామాల మీద కసి మదిలో మెదిలే సంఘర్షణలు అన్నీ దీనిలో కనిపిస్తాయి. ఏ పని చేయాలో ఎలా చేయాలో ఏది ముందు చేయాలో తెలుసుకోలేని, నిర్ణయం తీసుకోలేని అశక్తత, అస్తిత్వపోరాటం. మానసిక శారీరక అవసరాలు, ఆ సందిగ్ధతని మరాఠీ సాహిత్యంలో మొదటిసారిగా నెమాడే చిత్రీకరించాడు. తెలుగులో నవీన్ రచించిన "అంపశయ్య' నవలలో ఈ అంశాల్ని మనం చూడవచ్చు.

డిక్షనరీల అర్థంలో "కోసలా" అనే మరాఠీ శబ్దానికి అర్థం "కోశ్" అంటే, తెలుగులో కోశము అనగా సంగ్రహం అని చెప్పవచ్చు.

ఒకరి నుండి ఒకరికి సంబంధాలు లేకుండా, వేరుతనంతో అందరికీ దూరంగా సంబంధాలు తెగిపోయి ఒంటరితనంతో మిగిలి వేరువేరు దూరాలతో ఉన్నటువంటి క్లిష్టమైన అర్థంలో దీనిని నెమాడే వాడడం జరిగింది.

హిందీ సాహిత్యానికి చెందిన ప్రముఖ రచయిత ప్రొఫెసర్ నామ్‌వార్ సింహ్ అధ్యక్షతన పదిమందితో కూడిన కమిటీ బాలచంద్రని జ్ఞానపీఠ పురస్కారంతో 2014 సం॥నికి సన్మానించింది.

27 మే 1938న ఖానాదేశ్ గ్రామంలో జన్మించిన బాలచంద్ర పూణేలోని ప్రసిద్ధిచెందిన ఫెర్గ్యూసన్ కాలేజీలో డిగ్రీ చదివారు. ముంబయి విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ చేసారు. పి.హెచ్.డి. డి.లిట్ చేసిన తరువాత బాలచంద్ర అహ్మద్‌నగర్, ధులే, ఔరంగాబాదు యూనివర్శిటీలో మరాఠీ సాహిత్యం బోధించారు. తర్వాత ఆయన లండన్‌లోని ప్రసిద్ధిచెందిన స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్‌లో బోధించేందుకు వెళ్ళారు. ఆయన ముంబయి విశ్వ విద్యాలయంలో గురుదేవ్ ఠాగూర్ తులనాత్మక సాహిత్య పీఠానికి డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు.

అభ్యుదయ భావాలతో ఉండే నెమాడే సమాజంలోని అన్ని రకాల పీడిత వర్గాలకి దగ్గరగా ఉంటూ తన వైఖరిని స్పష్టంగా వెలువరించే వ్యక్తిగా ఉన్న కారణంగా ఆయన అనేక వివాదాల్లోకి కూడా లాగబడ్డారు. 1980లో ఆయన ప్రచురించిన "హూల్" నవల తర్వాత 30 సం॥ల వరకు నెమాడే రచించే రాబోయే రచనకోసం అత్యంత ఆతృతతో పాఠకులు ఎదురు చూశారు. తర్వాత 2010లో ఆయన ప్రముఖ నవల "హిందూ-జీనేకా సంపన్న కబాడ్"ని రచించారు.

హిందూ నవల 6 వందల పేజీలతో వెలువడింది. ఈ నవలలోని నాయకుడు ఖండేరావ్. ఖండేరావ్ మహారాష్ట్రలోని ఖాన్ దేశ్ ప్రాంతంలోని ఒక గ్రామంలో అత్యంత సాంప్రదాయక కుటుంబంలో జన్మించాడు. కథానాయకుడు తన వంశ పుట్టుకని పరిశీలిస్తూ వేల ఏళ్ళ క్రిందటి చరిత్రలోకి వెళతాడు. అతని యాత్ర మొహంజోదారో వరకు వెలుతుంది. ఖండేరావ్ పురావస్తు శాస్త్ర పరిశోధకుడు. ఆయన గత చరిత్ర నుండి మన నాగరికతని పరిశీలిస్తుంటాడు. గతం నుండి వర్తమానం వరకు ప్రయాణిస్తాడు. భవిష్యత్ కలలు కంటాడు. తన పునాదుల్ని తన వంశవృక్షాన్ని పరిశోధించే క్రమంలో ఆయన మొత్తం సమాజ స్వరూపాన్ని, పద్ధతుల్ని ఆచార వ్యవహారాల్ని, దురాచారాల్ని, సంబంధ బాంధవ్యాల్ని, సంస్కారాల్ని అన్ని వ్యవహారాల్ని అన్వేషిస్తాడు.




ఈ అన్వేషణలో నెమాడే గతకాలపు అన్ని అధ్యాయాల్ని యుగాల్ని ఆ కాలంలో నివసించిన భారతీయ సమాజంలో అన్ని పార్శ్వాల్ని తడుముతాడు. అందులో అనేక పల్లెలు, గ్రామాలు, స్త్రీలు, దళితులు, ఆదివాసీలు, కులాలు, ఆక్రమణలు, పరస్పర విద్వేషాలు కనిపిస్తాయి. అందులో అట్టడుగుకు నెట్టబడిన ఇతిహాసపు చీకటి కోణపు అనేక ఆశలు, నిరాశలు, కలలు, కన్నీళ్ళు కనిపిస్తాయి. విస్తృతమైన తన కాన్వాసులో నెమాడే చారిత్రిక, భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, పార్శ్వాల్లో భారతీయతని అన్వేషిస్తాడు. అనంత కాలచక్ర గమనంలో శతాబ్దాల చరిత్రని నెమాడే పరిశోధిస్తాడు. ఈ 600 పేజీల నవల తర్వాత ఇంకా దీని 3 భాగాలు రావాల్సి ఉన్నాయి. 2 భాగాలు చాలా వరకు పూర్తి అయ్యాయి.

నెమాడే రచించిన "హిందూ" నవల కేవలం హిందూ సమాజపు అనగా మొత్తం భారతీయ ఉపఖండపు (జంబూద్వీపం) మొత్తం నాగరికతని మనకి పట్టిస్తుంది. కానీ నెమాడే చెప్తున్న హిందూ అనే పదానికి అర్థం నేడు హిందుత్వ శక్తులు చెప్తున్న వ్యాఖ్యలకు వేలమైళ్ళ దూరం ఉంది. ఇది భారత ఉపఖండపు బహుళ సంస్కృతికి నాగరికతకి తార్కాణంగా నిలుస్తుంది. ఈ విమర్శ యొక్క మహిమాన్వితమైన అంశం దేశీయత (Nativism) హిందీ సాహిత్యంలో ఈ ఆలోచన భారతేందు, అంధేర్‌నగరీ నాటకం, ప్రేమ్‌చంద్ గోదాన్ నవల కఫన్ కథల్లో తెలుగులో పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం, వేమన పద్యాలు, కుసుమధర్మన్నల హరిజన శతకం, మాకొద్దీ నల్లదొరతనం కావ్యాల్లో దీన్ని చూడవచ్చు.

నెమాడే దేశీయతని తన రచనల్లో రొమాంటిసిజమ్‌కి వ్యతిరేకంగా దృఢంగా నిలబెట్టాడు. ఆ కారణంతో తరువాత తరాలకి, రచనలకి, రచయితలకి నెమాడే చూపిన దారి ఆసరాగా నిలిచింది. లేకుంటే తరువాత రచయితల ప్రస్థానం సక్రమంగా జరిగేది కాదు. 'హిందూ' నవలలో నెమాడేకి భాషపై ఉన్న పట్టు మనకు గోచరమవుతుంది. మనల్ని ఆశ్చర్య పరుస్తుంది. నెమాడే నవలకి జ్ఞానపీఠ పురస్కారం లభించడం మనందరికీ గర్వకారణం. అది మనకే కాదు, భారత ఉపఖండానికి, అనేక కాలపరీక్షలకి ఎదురు నిలబడిన హేతువాద తాత్వికతకి, అభ్యుదయ సాహిత్యానికి, సాంస్కృతిక ఏకతకి లభించిన గౌరవం ఇది. ◆

## జ్ఞానపీఠ పురస్కారం

1. భారతదేశంలో సాహిత్యానికి ఇచ్చే అత్యున్నత పురస్కారం ఇది.
2. ఈ పురస్కారం భారతీయ జ్ఞానపీఠ కమిటీ ద్వారా ప్రతి సంవత్సరం ఇవ్వబడుతుంది.
3. ఈ పురస్కారం భారత రాజ్యాంగంలో పొందు పరచబడిన 8వ అధికరణంలోని 22 భాషల్లో ఏదో ఒక భాషారచయితకి ఇవ్వబడుతుంది.
4. మొదటి జ్ఞానపీఠ పురస్కారం 1965లో మలయాళం రచయిత జి. శంకర్ కురూప్‌కి ఇవ్వబడింది.
5. 1965లో 1 లక్ష రూపాయలతో ఈ అవార్డు ప్రారంభించబడింది. 2005 నుండి 7 లక్షలుకు అవార్డుని పెంచారు.
6. 2011 సం॥ నుండి ఈ అవార్డు కింద 11 లక్షల రూపాయలు, శాలువతో రచయితలకి సన్మానం చేయబడుతుంది. అంతకుముందు (2005) 7 లక్షలు ఇచ్చేవారు.
7. 10 నవంబరు 2014న 49వ జ్ఞానపీఠ పురస్కారం హిందీలో 10వ జ్ఞానపీఠ పురస్కారగ్రహీత డా॥ కేదార్‌నాథ్‌సింగ్‌కి ఇవ్వబడింది.
8. 1982 వరకు ఏదో ఒక రచన ఆధారంగా ఇచ్చేవారు. కానీ తర్వాత రచయిత పూర్తిరచనలతో భారతీయ సాహిత్యానికి చేసిన సేవనిబట్టి ఇవ్వబడుతోంది.

## కవిత

# న్యాయ కిరీటం

- వల్లభాపురం జనార్దన
9440163687



**నా** గరిక నగరారణ్యంలో
విశృంఖల వివక్షాపిస్తోలు మానవత్వంపై
తూటాలనిప్పుల వాన కురిసింది
సమానత్వం మంటల్లో కాలిబూడిదయింది
అభిజాత్యం తెచ్చిపెట్టిన అహంకారంతో
అధికారం రుచి మరిగిన
ద్వేష ప్రాణవాయువు
మనిషితనం శ్వాసనాళాల్లో
బొగ్గుపులుసుగాలిని నింపింది
స్వేచ్ఛను ఉరితీసింది
ప్రపంచానికి శాంతిపాఠాలు
స్వేచ్ఛా పరిమళాలను
సమాన అవకాశాలను
నేర్పిస్తామని నేర్పిస్తున్నామని
పంచినామని - పంచిపెడుతున్నామని
కల్పించామని-కల్పిస్తూనే ఉన్నామని చెప్తున్న
అగ్రప్రజాస్వామ్య పాలనలో
రంగుపేరుతో మనిషిని వేటాడితే
వేటకాడు నిర్దోషని తీర్పుచెప్పిన
న్యాయ కిరీటానికి
రాజ్యం వత్తాసుపలుకుతుంటే
హతుణ్ణే హంతకుడని తీర్మానించినట్లుంది
స్వేచ్ఛా ప్రతిమను ఊరేగిస్తున్నచోట
న్యాయానికి న్యాయం చేయమన్న
అరణ్య రోదన వినిపిస్తుందా ?

*(నల్లజాతి యువకుడిని కాల్చి చంపిన శ్వేతజాతి పోలీసు నిర్దోషని తీర్పు చెప్పి నేరారోపణ చేయాల్సిన అవసరం లేదన్న గ్రాండ్ జ్యూరీ నిర్ణయానికి నిరసనగా)*

# కన్నీటి మేఘంలా

- ఆవుల వెంకటేశులు
9441665095



**త**రాలుగా తరలి వస్తున్న సమస్యల సంఘర్షణలో
బొమిక లిరిగిన జీవితం
అంతులేని బాధల సవ్వడుల
సమాహార నట్టువాంగం కాక మరేమవుతుంది

ఆకాశమంత దిగులు
కన్నీటి కడలిలా ఘోషిస్తుంటే
గమ్యం తెలియని బతుకు నావ నుంచి
జారిపడ్డ ఆశలు తెగబలిసిన తిమింగిలాల
నోటికి చిక్కిన చేపల్లా దుఃఖాన్ని దిగమింగుతున్నాయి.

పిడికెడు మెతుకులతో
కడుపు తడుపుకోవాలని
ఎదురు చూస్తున్న వీపుకంటిన ఉదరాన్ని చూచి
ధరలు రెక్కలు తొడుక్కున్న గ్లోబల్ -మార్కెట్టు
అందిన కాడికి ఆలువలా దోచుకుంటోంది.

పగిలిన గుండెల్లోంచి
ఎగిసి పడుతున్న దుఃఖపుకెరటాలు
గోచిపాత గూటిని పెళ్ళగిస్తే
రెక్కలు తెగిన పక్షిలా చెమట చిత్రం
వేదనల ఉరికంబమెక్కి తలరాతను తడుముకుంటోంది.

పద్మవ్యూహ నీతి పరివ్యాప్తమైన
మానవ మృగారణ్యంలో
నోరులేని నీతి ఉరిపోసుకుంటుంటే
కన్ను తుదల తడిలేని లోకనీతి సాక్షిగా
పచ్చిక పుండైన గుండెల్లో మానవీయ నవ్వుల మొలక
వికసనంకై కాలం అంచున కరుగుతున్న
కన్నీటి మేఘంలా!

పరిశీలన

# తెలుగు రచయిత్రి తొలి సాంఘిక నవల - లలిత




- డా॥ పొదిలి నాగరాజు
90520 38569

***నవల భారతదేశంలో 1865 లో బకించంద్ర ఛటర్జీతో మొదలైందని, విమర్శకుల అభిప్రాయం. దీనిని ఆదర్శంగా తీసుకొని తొలితరంలోనే (దేశ) నవలా రచయితలు పురుషులు, స్త్రీలు సమాజాన్ని చిత్రించే అద్భుతమైన నవలల్ని మనకు అందించారు. నవలా చరిత్రలో పురుషుల చరిత్ర రికార్డు అయినంతగా నవలా రచయిత్రుల చరిత్ర రికార్డు కాకపోవడం శోచనీయం. నవలా చరిత్ర రచనలు లోపం వల్ల తొలితరం నవలా రచయిత్రుల నవలలు సమాజానికి పరిచయం కాలేకపోయాయి.***

ఆచార్య కాత్యాయనీ విద్మహే నవనవలా వికాసం పేరుతో 22 ఆగష్టు 2014న ఆంధ్రజ్యోతి పత్రికలో ఒక వ్యాసం రాశారు. అందులో స్త్రీ రచయిత రచించిన తొలి తెలుగు సాంఘిక నవలగా 1940 నాటి కావేరిబాయి రాసిన 'పరిణామము' అనే నవలను గుర్తించినట్లు చెప్పుకొచ్చారు. విద్మహే గారికి ఆధారాలు లభించినంతవరకు వారి వాదన నిజమై ఉండవచ్చు. కానీ యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఉన్న పరిశోధకులు నవలపై ఎన్నో నూతన విషయాలను వెలుగులోనికి తీసుకొని వచ్చారు. అందులో భాగంగా స్త్రీ రచయిత్రి రచించిన తొలి సాంఘిక నవలగా 1908 నాటి 'లలిత' అనే నవలను గుర్తించారు. ఈ విషయాల పరంపరలో భాగమే ఈ వ్యాసం.

సమాజంలో మార్పు సహజం. మానవ జీవిత పరిణామ క్రమం అంతా సమాజంపైనే ఆధారపడి ఉంటుంది. రాతియుగం నుండి ఇప్పటి వరకూ మనిషి జీవన విధానంలో ఎన్నో అభివృద్ధికర పరిణామాలు సంభవించినట్లు చరిత్ర చెబుతుంది. ప్రాచీన నాగరికతా సంస్కృతుల గురించి చరిత్రే కాదు సాహిత్య గ్రంథాలు కూడా తెలియజేస్తాయి. అవికూడా మనిషి జీవన మనుగడను అంచనావేస్తాయని సాహిత్యకారుల అభిప్రాయం. ఆయా కాలాలలో జరిగిన అమూల్యమైన విషయాలు ఎన్నింటినో వివిధకోణాల నుండి తెలియజేయడానికి సాహిత్యం తనలో ఎన్నో ప్రక్రియల్ని సృష్టించుకొంటూ వస్తుంది. సామాజిక జీవనానికి పట్టుకొమ్మలా నిలబడి ఉంది. పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో భారతదేశంలో ఆధునిక సాహిత్యం మొదలైంది. నవల, కథానిక, విమర్శ, వ్యాసం లాంటి ఆధునిక సాహిత్య ప్రక్రియలు సమాజ స్థితిగతులు మారడానికి తనవంతు కర్తవ్యం నిర్వహిస్తున్నాయి. ఇది ప్రారంభంలో సమాజంలోని ఉన్నత వర్గాన్ని వదిలేసి మధ్యతరగతిని ఆ తర్వాత చిన్న తరగతుల వారిని ఆశ్రయించింది. వారి జీవన విధానాన్ని ప్రతిబింబించాయి. ఈ ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నింటిలో నవల ముఖ్యమైనది. నవల సమాజానికి సమగ్ర ప్రతిబింబం.

ఆధునిక వచన కావ్యంగా ప్రసిద్ధి చెందిన నవల ప్రపంచస్థాయి నుండి ప్రాంతీయ స్థాయివరకూ అనేక మంది రచయితల్ని ప్రేరేపించింది. నవల భారతదేశంలో 1865 లో బకించంద్ర ఛటర్జీతో మొదలైందని, విమర్శకుల అభిప్రాయం. దీనిని ఆదర్శంగా తీసుకొని తొలితరంలోనే (దేశ) నవలా రచయితలు పురుషులు, స్త్రీలు సమాజాన్ని చిత్రించే అద్భుతమైన

నవలల్ని మనకు అందించారు. నవలా చరిత్రలో పురుషుల చరిత్ర రికార్డు అయినంతగా నవలా రచయిత్రుల చరిత్ర రికార్డు కాకపోవడం శోచనీయం. నవలా చరిత్ర రచనలు లోపం వల్ల తొలితరం నవలా రచయిత్రుల నవలలు సమాజానికి పరిచయం కాలేకపోయాయి. వీటిపైన పరిశోధన కూడా పరిమితంగానే జరిగింది. కానీ ప్రపంచ నవలా సాహిత్యం ముందుగా రచయిత్రితోనే మొదలయిందనే విషయాన్ని గమనించాలి. క్రీ.శ. 11వ శతాబ్దంలో మొదటి భాగంలో 'మురాసా కిషకుచు' అనే జపాన్ రచయిత్రి 'గెంజిమోనో గోతారి' (గెంజిగాథ -973-1015)అనే నవలను రాసింది. ప్రపంచ నవలా సాహిత్యంలో ఈ నవల మొదటిది అని పాశ్చాత్య విమర్శకుల అభిప్రాయం. ఈ నవల 'గెంజిగాథ' అనే పేరుతో తెలుగులోకి అనువాదం అయింది. రచయిత్రితో మొదలైన నవలా సాహిత్యంలో రచయిత్రుల స్థానం పరిమితంగా కనిపించడం ఆశ్చర్య పడాల్సిన విషయం.




ఇదే పరిస్థితి భారతదేశంలో కూడా ఉంది. భారతదేశ తొలినవలా రచయిత్రి విషయం పెద్దగా చర్చకు రాలేదనిపిస్తుంది.


***దీనిని బట్టి ఈ రచయిత్రికి ముందు రాయలసీమలో రచయిత్రులు లేరని తెలుస్తూంది. కాబట్టి రాయలసీమ తొలి నవలా రచయిత్రి, తెలుగులో తొలి సాంఘిక నవలా రచయిత్రిగా దేవమణి సత్యానాథన్ ను గుర్తించవచ్చు.***


తెలుగులో తొలి నవలా రచయిత చర్చ కొనసాగుతూనే ఉంది. ఆ విషయాన్ని పక్కన బెడితే తెలుగులో తొలి నవలా రచయిత్రి 'జయంతి సూరమ్మ' అని సాహిత్యకారుల అభిప్రాయం.తెలుగులో మొదటి నవలా రచయిత్రి కోస్తా ప్రాంతానికి చెందిన 'జయంతి సూరమ్మ'. ఈమె రాసిన నవల 'సుదక్షిణా చరిత్రము' (1906). దీని తర్వాత మల్లవరపు సుబ్బమ్మ 'కళావతి చరిత్ర' (1914), ఎ.పి.పిరాట్టమ్మ 'శోభావతి' (1924), కనుపర్తి వరలక్ష్మమ్మ 'వసుపతి' (1924) మొదలైన నవలలు తొలితరంలో వచ్చినట్లు 'సమాలోచనం' అనే వ్యాస సంపుటిలో జి.లలిత 'నవల-మహిళ' అనే వ్యాసంలో పేర్కొన్నారు. జయంతి సూరమ్మ 'సుదక్షిణా చరిత్రము' (1906) తర్వాత దేవమణి సత్యనాథన్ రాసిన 'లలిత' (1908) నవల వచ్చింది. ఈ నవల గురించి ఎవ్వరూ ఎక్కడా చర్చించలేదు. పైగా దేవమణి సత్యనాథన్ రాసిన తొలితెలుగు సాంఘిక నవల 'లలిత' (1908) ను వదిలేసి 1924లో ఎ.పి.పిరాట్టమ్మ రాసిన 'శోభావతి' నవలను తొలితెలుగు సాంఘిక నవలగా గుర్తించారు సాహిత్య చరిత్రకారులు. కానీ లభించిన ఆధారాలను బట్టి తెలుగులో తొలి సాంఘిక నవల 'లలిత' అని చెప్పవచ్చు. ఈ నవలను రాసిన దేవమణి సత్యనాథన్ తెలుగులో రెండవ నవలా రచయిత్రి కూడా అవుతుంది. ఆవెుకు సంబంధించి మరోవిశేషం ఆమె తొలితెలుగు సాంఘిక నవలా రచయిత్రి కూడా. 'లలిత' నవల 1927 లో ద్వితీయ ముద్రణ జరిగింది. 1928వ సంవత్సరంలో 'లలిత' నవల యస్.యస్.యల్.సి.కి (11వ తరగతి) పాఠ్యగ్రంథంగా ఉండింది. నవలలోని అంతర్గత ఆధారాన్ని బట్టి ఈ నవల మొదటి ముద్రణ 1908 లో జరిగినట్లు తెలుస్తుంది. ఈ నవలలో 'లలిత' రాజమండ్రిలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ బళ్లారి జిల్లాలోని కమలాపురంలో ఉన్న తన బావ హరిదాసుకు 1908 జూలై 12న ఉత్తరం రాసినట్లు నవలలో ఉంది. దీనిని బట్టి ఈ నవల 1908లో వచ్చి ఉండవచ్చునని భావించవచ్చు. అప్పటి ప్రొద్దుటూరు తాలుక బోర్డు ప్రెసిడెంట్ కూరం నరసింహాచార్యులు 'లలిత' నవలకు ముందు మాటలు రాశాడు. ఇందులో ఆయన రచయిత్రి గురించి చెబుతూ "గ్రంథములు వ్రాయుటకిది ప్రథమ ప్రయత్నం అని గ్రంథకర్త్రియే చెప్పుచున్నది. యా వధూమణి మా మండలంలోని స్త్రీలకు మార్గదర్శినియై ఎందరి కృతజ్ఞతకు బాత్రురాలగు చున్నది" అని అన్నాడు. దేవమణి సత్యనాథన్ రచనా ప్రస్థానంలో 'లలిత' నవల తొలి ప్రయత్నం. ఈ రచయిత్రి దత్త మండలాలలోని రచయిత్రు లందరికీ మార్గదర్శకం అవుతుందని కూరం నరసింహాచార్యులు అభిప్రాయపడ్డారు. దీనిని బట్టి ఈ రచయిత్రికి ముందు రాయలసీమలో రచయిత్రులు లేరని తెలుస్తూంది. కాబట్టి రాయలసీమ తొలి నవలా రచయిత్రి, తెలుగులో తొలి సాంఘిక నవలా రచయిత్రిగా దేవమణి సత్యానాథన్ ను గుర్తించవచ్చు.

దేవమణి సత్యనాథన్ అనంతపురం జిల్లాలోని ధర్మవరం వాసి అని కూరం నరసింహాచార్యులు లలిత నవలకు రాసిన ముందుమాటలో చెప్పారు. తరువాత ఆమె మద్రాసులో స్థిరనివాసం ఏర్పర్చుకుంది. ఈమెను హన్నమ్మ, డేవిడ్ అనే దంపతులు దత్తతకు తీసుకొని పెంచి పెద్దచేశారు. పెంపుడు తల్లిదండ్రుల వల్ల ఈమె వ్యక్తిత్వం హిందూ, క్రైస్తవ సమన్వయాత్మకమైంది. రచయిత్రి జననమరణాల తేదీలు లభ్యంకాలేదు కానీ ఈమె 20వ శతాబ్దానికి పూర్వార్థంలో జీవించిన తొలి తరం రచయిత్రులల్లో ఒకరని తెలుగు సాహిత్య కోశం (1850 నుంచి 1950 వరకు) అనే గ్రంథం నుండి తెలుస్తుంది. రచయిత్రి ఈ నవలను తనను పెంచిన హన్నమ్మ డేవిడ్ అనే తల్లిదండ్రులకు అంకితం చేసింది.

1908లో దేవమణి సత్యనాథన్ రాసిన లలిత నవల స్త్రీవిద్యా ప్రభావాన్ని ఆవిష్కరిస్తూ స్త్రీ వ్యక్తిత్వాన్ని నిరూపిస్తూ ఉంది. అక్కను తల్లిని పోగొట్టుకున్న లలితకు తండ్రి కూడా పిచ్చివాడైపోగా అన్నదమ్ములు బిచ్చగాళ్లైపోగా తనను బలవంతం చేస్తున్న వసంతుని బారి నుండి తప్పించుకొని మేనమామ కొడుకు అయిన హరిదాసును అనేక సాహసాల తర్వాత వివాహం చేసుకుంటుంది. చదువు ఇచ్చిన సంస్కారం వల్ల సమస్యలను చూసి బెదిరిపోకుండా సమాజంలోని మంచివాళ్ల సహకారంతో సమస్యల నుండి గట్టెక్కిన స్త్రీకథ లలిత నవల. ఈ నవలలో హరిదాసుడు, లలిత ప్రధానపాత్రలు. సౌందర్యవతి అయిన లలిత హరిదాసుపై తనకున్న ప్రేమతో తనను పెళ్ళిచేసుకోవడానికి ఎన్నో బాధల్ని, కష్టాల్ని ఎదుర్కొంటుంది. చివరకు ధీర నాయికగా నిలుస్తుంది. లలిత తండ్రి సోమనాథుడు తాగుబోతు. ఈ పాత్ర ద్వారా తాగుడు వల్ల వచ్చే నష్టాలను, కష్టాలను రచయిత్రి అద్భుతంగా చిత్రించింది. సుశీల, హైమావతి, రత్నాకరుడు, రాజవాహనుడు, వసంతుడు, జయంతుడు, వామనుడు, ధనగుప్తుడు, రఘునాథుడు, శ్యామల, రమేశుడు మొదలైనవి నవలలో మిగిలిన పాత్రలు.




*లలిత నవల సంఘ సంస్కరణ నవల. ముఖ్యంగా సమాజంలోని మద్యపానం వల్ల వచ్చే నష్టాలు, స్త్రీవిద్యవల్ల కలిగే సుఖాలు ఈ నవలలో చిత్రింపబడ్డాయి. జూదం, చెడు సావాసాలు, చెడు ఆలోచనలు ప్రాణహానికి దారితీస్తాయని ఈ నవలలో రచయిత్రి సూచన ప్రాయంగా తెలియజేసింది. లలిత నవలలో సోమనాథుని పాత్ర మద్యపానం వల్ల కలిగే ఇబ్బందులను గూర్చి తెలియజేస్తుంది.*

లలిత సంఘ సంస్కరణ నవల. ముఖ్యంగా సమాజంలో మద్యపానం వల్ల వచ్చే నష్టాలు, స్త్రీవిద్యవల్ల కలిగే సుఖాలు ఈ నవలలో చిత్రింపబడ్డాయి. జూదం, చెడు సావాసాలు, చెడు ఆలోచనలు ప్రాణహానికి దారితీస్తాయని ఈ నవలలో రచయిత్రి సూచనప్రాయంగా తెలియజేసింది. లలిత నవలలో సోమనాథుని పాత్ర మద్యపానం వల్ల కలిగే ఇబ్బందులను గూర్చి తెలియజేస్తుంది. సోమనాథుడు విజయనగరంలో రక్షకభట ఉద్యోగి. అయితే మితిమీరిన తాగుబోతు. ప్రభుత్వం ఇచ్చే జీతం చాలక పేదలను లంచాలకోసం పీడించేవాడు. "ఇతడు మధుపానమత్తుడు. వేతనము కన్నా వెచ్చములధికముగా నుండుటం బట్టి యాతడు బీదల కొంపలగూల్చియు, ప్రజల బెదిరించియు, లంచములు గొనియు, వందల కొలది ద్రవ్యమును గ్రహించుచుండెడివాడు".

సోమనాథుడు పెట్టే బాధలకు ఓర్వలేక ఆటవీకులు సోమనాథునిమీద పగతో సోమనాథుని కూతురైన లలితను కాళికాదేవికి బలిచ్చి సోమనాథునిపై పగతీర్చుకోవాలనుకుంటారు. సోమనాథుడు తన తాగుడుకోసం ఆటవికులను వేధించడమే వీరి పగకు కారణం. సోమనాథుడి తాగుడు శృతిమించడంతో ప్రభుత్వం అతన్ని ఉద్యోగం నుండి తీసేస్తారు. తాగుబోతుల లక్షణాలను రచయిత్రి తెలియజేస్తూ "త్రాగుబోతుల నడవళ్ళు శోచనీయములు. అతడొక్కొకమారు మధువును గ్రోలుచు దానిమూలమున జన్మించిన మైకముచే దూగుచుండును. చిరపరిచ యులగు మధుపాన మిత్రులం గాంచిన దూలుచు వారి వెంట బికారివోలె దిరుగుచుండెను. మితిమించిన మత్తుచే గ్రిందబడి పొరలు చుండెను. దుర్భాషలాడు చుండెను. పోరాటమున కుంకించు చుండును. లజ్జలేక తిరుగు చుండును. అతిహేయ ములగు విషయములంజిక్కి యొక్కొకతఱి వెఱ్ఱివానివోలె వెడలు చుండును. వెఱ్ఱివేయి విధము లన్నట్లాతడి ట్లున్మత్తుడగుటచే చెడు నడతల కడలి రక్షకభట వర్గము నుండి ప్రభుత్వమువారీతని దొలగించిరి."

సోమనాథుడి తాగుడువల్ల కూతురు చనిపోగా, భార్యను పోగొట్టుకొని పిచ్చివాడై దేశదిమ్మరి అవుతాడు. రాజమండ్రిలో ఉంటున్న లలిత పిచ్చివాడైన తండ్రిని గుర్తుపట్టి వైద్యం చేయించి మామూలు మనిషిగా చేస్తుంది. సోమనాథుడు రాజమండ్రి న్యాయస్థానంలో ఉద్యోగం చేస్తూ కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాడు. లలితకు ఇష్టంలేని సబంధం చూసి పెళ్ళిచేసుకోవాలని బలవంతం చేస్తాడు. తన మాటలు వినని లలితపై కేసుకూడా పెడతాడు. ఓడిపోతాడు. మళ్ళీ తాగుబోతై దేశదిమ్మరి అవుతాడు. ఈ సోమనాథుడి పాత్రద్వారా సమాజంలో తాగుడుబోతుల పరిస్థితులు, తాగుడు వల్ల వచ్చే ఇబ్బందులు స్పష్టంగా తెలుస్తుంది.

దేవమణి సత్యనాథన్ 'లలిత' నవలలో మద్యపానంతో పాటు స్త్రీలు చదువుకోవాలనే ఆధునికమైన సందేశాన్నిచ్చింది. నిజానికి స్త్రీ చదువు సమాజానికి, కుటుంబానికి చాలా అవసరం. ఈ నవలలో లలిత చదువుకోవడం వల్ల ప్రతి విషయంలో సమయస్ఫూర్తిని పాటించింది. సమయానికి తగిన నిర్ణయాలను తీసుకొని ఆపదలనుండి గట్టెక్కింది. ఎవ్వరూలేక ఒంటరిగా మిగిలినా ధైర్యంగా సంఘంలో జీవించడానికి పూనుకుంది. రాజమండ్రిలో ఉపాధ్యాయురాలిగా చేరి తాను బతకడమే కాకుండా పిచ్చివాడైన తండ్రికి వైద్యం చేయించే స్థాయికి ఎదుగుతుంది. కమలాపురంలో అనారోగ్యంతో ఉన్న తన

## కవిత

# ఆదర్శ దాంపత్యం

వి. వసంత కుమారి
8977235401

*కొమ్మలన్నీ ఆకాశం వైపే చూస్తున్నాయి*
*గాలిలోని ఆక్సిజన్ అంతా*
*జుర్రుకుందామనే తాపత్రయం*
*రక్తం, మాంసం, నరాలూ*
*లేకపోతేనేం, జీవం వుండి*
*పిల్లలంతా మా నీడనే ఆడుకుంటున్నారు*
*పసుపూ, ఎరుపూ రంగునీళ్ళన్నీ మాకే*
*ఎర్రని దారాలూ మా కొమ్మలకే వేళ్ళాడుతూ,*
*ఎండపడి మెరుస్తున్నాయి*
*మెదళ్ళూ మొద్దుబారిపోలేదు, పుచ్చిపోనూలేదు*
*శరీరాలు పెనవేసుకు పోవడానికి*
*అసలు మెదళ్ళు వుండాలా?*



*ఆటలూ పాటలూ నవ్వులూ కేరింతలూ*
*ఒక్కరికీ నీళ్ళు పోద్దామన్న ధ్యాసే లేదు*
*గాల్లో కార్బన్ డైయాక్సైడ్ అంతా*
*మేమే వాడుకుంటాం*
*ఆక్సిజన్ మాత్రం మీకందిస్తాం*
*వేపచెట్టు యాంటిబయాటిక్ అంతా*
*మీ ఆరోగ్యం కోసమే*
*కాసిన్ని నీళ్ళు మాత్రం*
*మొదళ్ళ దగ్గర పొయ్యండి*
*అయ్యో! ఆ మాత్రం తీరిక లేదా*
*వృత్తాకారపు కాంక్రీట్ చప్టా*
*మమ్మల్ని కదలనిస్తేగా*

మేనమామకు సేవలు చేసి అతన్ని చావునుండి తప్పించి తన బాధ్యతను నెరవేర్చుకుంటుంది. పట్టుదలతో తాను ప్రేమించిన బావనే పెళ్ళిచేసుకొని భారత స్త్రీ వ్యక్తిత్వాన్ని నిరూపించుకుంటుంది. పుట్టినింటికి, మెట్టినింటికి పేరు ప్రతిష్టలు సంపాదించి పెడుతుంది. కష్టాలకు భయపడి పరిస్థితులకు జడిసి పిరికితనంతో ఆత్మహత్యలకు పాల్పడే ఎంతోమంది స్త్రీలకు దేవమణి సత్యనాథన్ సృష్టించిన లలిత పాత్ర ఆదర్శవంతమైంది. లలిత నవల ఈ కోణంలో అద్భుతమైన సంఘసంస్కర్త నవల.

దేవమణి సత్యనాథన్ లలిత విద్యాభ్యాసాన్ని గురించి అద్భుతంగా పేర్కొనింది. "హరిదాసుకి ఆప్తమిత్రు లలిత నొక బాలికా పాఠశాలయందు జీతమునకు గుదిర్చెను. ఆమె యొక ప్రాథమిక పాఠశాల యందు ప్రధానో పాధ్యాయయ్యెను. ఆమె తన సహాధ్యాయినులతో నైకమత్యమును కలిగి మెలగుచు మిక్కిలి పట్టుదలతో పాఠశాలా కృత్యములను జక్కబఱచు చుండెను. సంగీతము నందామె కఖండ పాండిత్యము గలదు. చిత్రలేఖనా వైఖరియందామె కడునిపుణురాలు. లోక విజ్ఞాన శాస్త్రమలవరించి బాలికలకు మించిన శక్తి నావహింప జేయుటయందామె యొక్కుడు నేర్పరి. ఇప్పటి పాఠశాలలందుపాధ్యాయలును, నుపాధ్యాయినులును, నామె వాచక పాఠములు బోధించుచుండినది చూచిన "ఈమె ఇంతటి శక్తి సంపన్నయా" అని యనుకొనకమానరు. మనోగణిత మనందేమి, గణితపాఠమునందేమి బాలిక లెక్కుడు జ్ఞానమంద వలయునన్న నామెయొద్దనే చదివితీరవలయును.ఇంతయేల ! ఆమె యున్న పాఠశాల యందు కావ్యరచనలకు ప్రోత్సాహ మొసగునది లలిత. వ్యాకరణ విషయములకు వన్నెబెట్టి నేర్పునది లలిత. దేశచరిత్రము లుపన్యసించుటయందు ధీరాగ్రగణ్యం లలిత. ఖగోళశాస్త్రమందు గణ్యతగాంచినది లలిత భూగోళ శాస్త్రమున బాజ్యత వహించినది లలిత. రకరకపు పూనలతో నతిరమ్యముగా దట్టలపై పుష్పముల మర్చుటయందతినిపుణత గాంచినది లలిత. కడు సొబగుగ హంసలు నృత్యము సేయునటుల నున్నిదారముచే వస్త్రములల్లుటయందు వన్నెకెక్కినది లలిత. బీదబాలికలకు వృత్తి విద్యయే జీవనాధారమని కుట్టుపనులు నూచించుట యందు బేరుగాంచినది లలిత. వేయేల ! మూఢమతులను విజ్ఞానవంతులుగా జేయన వతరించిన వాగ్దేవియే యామెమన జాలదా."

దేవమణి సత్యనాథన్ లలితనవలలో అటు విజయనగరానికి, ఇటు రాయలసీమ ప్రాంతానికి ప్రాముఖ్యత నిచ్చింది. లలిత ఉత్తర సర్కారులోని విజయనగరంలో పుట్టి అక్కడే చదువుకుంటుంది. విజయనగరంలో తల్లి,తండ్రి, అక్క, అన్నదమ్ములు అందరూ దూరమైన తరువాత దుర్మార్గుడైన వసంతుడు పెట్టే బాధలను భరించలేక ప్రాణ,మాన పరిరక్షణ కొరకై పురుషునిగా రూపాన్ని మార్చుకొని తన బావ హరిదాసుడు ఉంటున్న కమలాపురానికి బిచ్చగత్తెగా వస్తుంది. ఈ కమలాపురం బళ్ళారి జిల్లాలో ఉంది. లలిత బావ హరిదాసుడు లలితను మరిచిపోలేక తన తండ్రి వల్ల ఇంట్లో స్థానం ఇవ్వలేక స్నేహితుడి సహాయంలో లలితను రహస్యంగా కమలాపురం నుండి రాజమండ్రికి చేరుస్తాడు. లలిత రాజమండ్రిలో కష్టాలను ఎదురించి, గెలిచి చివరికి కమలాపురానికి చేరుకుంటుంది. అక్కడే బావను పెళ్ళిచేసుకుంటుంది. లలిత విజయ నగరంలో పుట్టినా, రాజమండ్రిలో కొంతకాలం నివసించినా మొత్తానికి కమలాపురమే ఆమె జీవితానికి ఆధారమైన ప్రాంతం. 1908లో దేవమణి సత్యనాథన్ రచించిన 'లలిత' నవల రచయిత్రులు రచించిన తొలి తెలుగు సాంఘికనవల. ◆

## నివాళి

# విశిష్ట నవలా కారుడు కేశవరెడ్డి



ప్రముఖ రచయిత డాక్టర్ కేశవరెడ్డి ఫిబ్రవరి 13న మృతి చెందారు. చిత్తూరు జిల్లా, పూతలపట్టు మండలం, తలపుల పల్లికి చెందిన కేశవరెడ్డి 1946లో జన్మించారు. ఉద్యోగరీత్యా నిజామాబాద్ జిల్లాలో స్థిర పడ్డారు. డిచ్‌పల్లిలోని విక్టోరియా మెమోరియల్ ఆస్పత్రిలో ఇరవై ఏళ్ల పాటు మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. మార్క్సిస్టు దృక్పథం కలిగిన సాహితీవేత్త. పీడిత జన పక్ష పాతిగా రచనలు చేశారు. దళితుల జీవితాలను విభిన్న శైలిలో తన నవలలో చిత్రించారు. ముఖ్యంగా రాయలసీమ గ్రామీణ జీవిత సంఘర్షణే ఇతి వృత్తంగా తన రచనా వ్యాసాంగాన్ని కొనసాగించారు. మూగవాని పిల్లనగ్రోవి, చివరి గుడిసె, బానిసలు, భగవానువాచ, శ్మశానం దున్నేరు వంటి నవలలు రాశారు. ఇన్‌క్రెడిబుల్ గాడెస్ నవల 1977లో మరాఠీలోకి అనువాదమయ్యింది. తన చివరి నవల 'మునెమ్మ'పై విమర్శలు చోటుచేసుకున్నాయి. "అతడు అడవిని జయించాడు"కు తెలుగు యూనివర్శిటీ ఉత్తమ నవల పురస్కారం అందుకున్నారు.

## కాలం క్యాన్వాస్ మీద......

- అనిశెట్టి రజిత
9849482462



యుగ యుగాలుగా  దృశ్యాలు పరుచుకుంటూ
ఆ దృశ్యాలతో చేరుతున్న మరిన్ని దృశ్యాలు
కాలం క్యాన్వాస్ మీద నిశ్చల సంతకాలు
రంగు రంగుల్లో నలుపుతెలుపుల్లోని సుడులు...

కాలం విస్తరిస్తూ ప్రవాహంలా
తడబడని ఉత్సాహంతో ఉరకలెత్తుతూ
క్యాన్వాస్ ఇంకా ఇంకా విశాలమవుతూ
ఎక్కడైనా నెనొక చుక్క గుర్తుపెట్టుకోవాలని...

హద్దులులేని అనంతకాశం కింద
నేల చాపమీద చేతులు చాచి
అభావంగా తలెత్తి నిలబడిపోయిన
ఒక నేను ఒంటరినైన అల్పజీవిగా....

మహా నిశ్శబ్ధాన్ని పెనవేసుకున్న చూపులు
విధి లోయల్లోకి అనాకృతమై జారిపోతూ
దిగంతాలను తొలుచుకునే పిచ్చి ఆటల్లో
కొలమానం లేని ప్రకోపాలను శిఖరాగ్రానికెక్కిస్తూ...

ప్రపంచాన్నీ... జీవితాన్నీ... నిర్వచనాలతో
రుచి చూస్తారూ..ప్చ్! అంతా ఉత్తదే
నన్ను నేను అజ్ఞాతంలో తడుముకుంటూ
నేను నన్ను చూసుకునే దేవులాటలో...

నేనిప్పుడొక నైమిశారణ్యంలో సేదతీరాలని
విశ్వయాత్రలో విస్మృతినై తప్పిపోవాలని
కాలం క్యాన్వాస్ మీద తుమ్మెదలా వాలి
ఒక చుంబన మకరందాన్ని ఆస్వాదించాలని...

ఒక సృష్టిని అధ్యయన మధనం చేస్తూ
కాలానికి ఊయలగట్టి రుతురాగమై ఊగాలని
పిల్లనగ్రోవి నుండి వీచే గాలి పాటనై
నిర్మోహంగా ఆత్మదీపాన్ని ఆలింగనం
చేసుకోవాలని...

దిక్కులు దిశలు దారులు తెలియకుండా
నాలోకి నేను ఇంకిపోయిన దిగంబరత్వం
రెక్కల ముద్రతో ముడుచుకున్న నిరాకారాన్ని
ఎగిరి పో ఇక  శూన్యంలోకని విసిరేయాలని....

# కథ



# సామర్థ్యం

-నెట్టిమి రమణారావు

9247474790

ఫోన్ రింగయ్యింది "ఎవరండీ... ఆ సతీష్‌నే చెప్పండి"

"మీ పాప శ్రావణి చదువుతున్న టేలెంట్ సెర్చ్ కాన్వెంటు నుంచి మాట్లాడుతున్నాను. శ్రావణి మెట్లపైనించి పడిపోయింది. రిమ్స్ హాస్పిటల్‌కు తీసుకువెళ్తున్నాము మీరక్కడికి వచ్చేయండి" ఫోన్ కట్ అయింది.

సతీష్ ఉన్నపళంగా బయల్దేరి వెళ్ళాడు. అప్పటికే శ్రావణిని చిన్న పిల్లల విభాగంలో ఉంచారు. కూతురిని చూచి అతనికి నోట మాట రావట్లేదు. దైన్యంగా దిక్కులు చూస్తున్నాడు.

మళ్ళీ డాక్టరొచ్చారు పరీక్షిస్తున్నారు.

"పాప పేరెంట్ ఎవరు?"

"నే... నేనే సార్"

"తల వెనుక భాగంలో గాయమైంది. టెన్ట్స్ అవుతున్నాయి, పాపకు పూర్తిగా మెలకువ వస్తేగానీ చెప్పలేము" ముక్తసరిగా చెప్పి వెళ్ళిపోయాడు.

సతీష్ ప్రక్కనే ఉన్న ఖాళీమంచంపై కూలబడ్డాడు. శ్రావణి దిగ్గున లేచి భళ్ళున రక్తం వాంతి చేసుకొంది. "అమ్మా శ్రావణీ" దగ్గరకెళ్ళాడు తండ్రిని అపరిచిత వ్యక్తిని చూచినట్లు చూచింది. అక్కడున్న సిబ్బంది రక్తాన్ని తుడిచి మళ్ళీ పడుకొబెట్టారు. సెలైన్ సరిచేసారు.

"బాబూ పాపకి తగ్గిపోతుందా" వార్డు బాయ్‌ని సతీష్ అడిగాడు. "తనకి పూర్తిగా మెలకువ వస్తేగానీ చెప్పలేము." సందేహంగా సతీష్ చూచాడు.

"లేచి కూర్చుంది గానీ ఆమెకు తెలియదు పాప బాగా షాక్‌కు గురైంది. మీరు అధైర్యపడకండి మీకు దేవుడన్యాయం చేయడు. ఒక్కసారి డాక్టరుగారినింటి దగ్గర కలవండి కలిసీ.... మాట్లాడండి తగ్గిపోతుంది"

భార్య ఉమకు ఫోన్ చేసాడు పది నిమిషాల్లో చేరుకొంది. భార్యనక్కడే ఉంచి డాక్టరుని కలవడానికెళ్ళాడు. ఉమ ప్రక్క రోగి బంధువులతో కూతురి గురించి చెప్తూ ఏడుస్తోంది.

డాక్టరుని కలవడానికెళ్ళిన సతీష్ రాత్రి పన్నెండు గంటలకొచ్చాడు. "ఎలా ఉంది" ఉమ మౌనంగా నిస్తేజంగా పాపవైపు చూచింది.

శ్రావణికి అక్కడున్న సిబ్బంది సెలైన్ మార్చి యూరిన్ బేగ్ అమర్చారు.

***

తెల్లవారి హాస్పిటల్‌లో సతీష్‌కు శ్రావణి స్నేహితురాలు నిషి ఆమె తండ్రి వినయ్ కన్పించాడు. నిషి మౌనంగా దిక్కులు చూస్తోంది. వినయ్ సతీష్‌తో

"నిన్న సాయంత్రం స్కూల్ నుంచి వచ్చినప్పట్నించి డల్ అయిపోయింది. ఎవ్వరితోనూ మాట్లాడ్డంలేదు. రాత్రి అస్సలు పలుకే లేదు".

సతీష్ శ్రావణి గూర్చి చెప్పాడు. ఇంతలో మానసికవైద్యుని కాంపౌడరు "నెం.. మూడు... నిషీ" పిలిచాడు.

వినయ్ నిషిని తీసుకొని డాక్టరు గదిలోని కెళ్ళాడు. సమస్యని చెప్పమన్నట్లు వినయ్ వైపు చూసారు. డాక్టరు వినయ్ మొత్తం వివరించాడు... కొద్ది రోజులాగి చూపిద్దామనుకొన్నాను కానీ రెండు నెలల్లో పరీక్షలొస్తున్నాయి."

"సరే మీరు బయట కూర్చోండి" వినయ్ వచ్చేస్తాడు.

"పేరు"

చాలాసేపు మౌనం తరువాత "నిషి"

"నేను నీ డాడి కాను... టీచర్‌నూ కాను. నా వైపు చూస్తూ మాట్లాడవచ్చు"

తలెత్తి ఒక్కసారి చూచి మళ్ళీ దించేసింది నిషి.

"నన్ను మీ తాతయ్య అనుకో మా ఇంట్లో కూడా నీలాంటి పాపే ఉంది తన పేరూ నీ పేరూ లాంటిదే.

"? ? " డాక్టరు వైపు చూస్తోంది.

"ఖుషీ"

"నా అంతే ఉంటుందా"

"కాదు కొంచం చిన్నది"

తన మనుమరాలు దినచర్యల్ని చెప్తూనే నిషి దినచర్యలు అలవాట్లు, అభిమానించేవాళ్ళు ద్వేషించేవాళ్ళు నచ్చిన సినిమాలు, నచ్చిన టి.వి. సీరియళ్ళు ఈ ప్రశ్నల మధ్యలోనే ఆమెకున్న ఒత్తిడులు తెలుసుకొన్నాడు.

నిషి సమాధానాల్లో అతనికి అర్థమయ్యింది. విద్య విషయంలోనే తల్లిదండ్రుల నుండి తీవ్రమయిన ఒత్తిడుందని.

నిషికి వైద్యునికి సాన్నిహిత్యం పెరిగింది. ఇద్దరి మధ్య సరదా సంభాషణ సాగుతోంది. వైద్యుడు చెప్తున్న హాస్యపుమాటలకి నిషి విరగబడి నవ్వుతోంది. నిషి భుజాల్ని పట్టుకొని కళ్ళలోకి చూస్తూ "నిన్నేం జరిగిందిరా"

టక్కున నవ్వాపేసింది. బెదురు చూపులు చూస్తోంది.

"భయపడకమ్మా నేనున్నాను. నీ తాతయ్యని నీకేమి కానివ్వను, చెప్పు"

మెల్లగా చెప్పడం ప్రారంభించింది. "నేను ఎంత చదివినా ఫస్టు ర్యాంకు రావడం లేదు. సెకెండ్ రావటమే కష్టమౌతోంది. తాతయ్యా, నాన్నగారేమో ఈసారి ఎగ్జామ్స్‌లో ఫస్టు రాకపోతే కొడతానన్నారు. దెబ్బలు తప్పించుకోవడానికి నాకున్న ఒకే ఒక్క మార్గం ఫస్టు వస్తున్న శ్రావణ్ణి పరీక్ష రాయకుండా ఆపడం అది ఎలా అని ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాను.

నిన్న స్కూల్ విడిచి పెట్టిన తరువాత శ్రావణ్ణి మాటల్లో పెట్టి ఉంచేసాను. కానీ ఎంతైనా తనని పరీక్షలు రాయవద్దని మాత్రం చెప్పలేకపోయాను.

ఎందుకంటే శ్రావణి నేను చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులం అది చాలా మంచిది నేనడిగితే కాదనదు.

"మరి అడిగెయ్యలేకపోయావా"

"కానీ వాళ్ళు పేదవాళ్ళు తాతయ్యా దాన్నన్యాయం చేయడాన్కి నా మనసొప్పలేదు. శ్రావణి బయల్దేరిపోయింది. బేగు వీపుకి తగిలించుకొని మెట్లు దిగుతోంది. నేను నా ప్రమేయం లేకుండానే పై మెట్టు దగ్గర ఆగిపోయాను. తను మూడు మెట్లు దిగి ఆగి రావే అంది నా వైపు తిరిగి

అంతే ఒక్కసారిగా నా కేదో అయ్యింది. నా వైపు తిరిగి ఉన్న శ్రావణ్ణి బలంగా ఒక్క తోపు తోసేసాను. మెట్లపై నుంచి క్రిందవరకూ దొర్లుకుంటూ పడిపోయింది. కాల్జారిపడిందని అనుకుంటున్నారు. నేను అలా చేయాలనుకోలేదు కానీ ఆ క్షణాన నా కేదో అయ్యింది. నేను చేసింది చాలా పెద్ద తప్పు" వెక్కి వెక్కి ఏడుస్తోంది. కళ్ళ వెంట ధారగా కన్నీళ్ళు.



డాక్టరు కూర్చున్న వాడు లేచి నిషి దగ్గరకు వెళ్ళాడు. కాసేపు ఏడవనిచ్చాడు. అప్పుడు తలపైకెత్తి చేత్తో కళ్ళు తుడిచాడు. నిషి "నాది ... నాది తప్పు తాతయ్యా" కావలించుకొంది.

"సరే..సరే.. ఊరుకో నేను మాట్లాడతానుగా" బెల్‌కొట్టి కాంపౌండర్‌ని పిలిచి నిషి వినకుండా అతని చెవిలో ఏదో చెప్పి పంపించాడు.

"వెళ్ళమ్మా నాన్నగార్ని రమ్మను"

నిషి బయటికెళ్ళి వినయ్‌ని పిలిచింది. "కూర్చోండి వినయ్‌గారు" వినయ్ కూర్చున్నాడు. నిషి గోడపై నున్న కేలండర్‌ను చూస్తోంది.

వినయ్‌కు మొత్తం వివరించారు. ఇప్పుడు నేనేం చెయ్యాలన్నట్లు చూచాడు డాక్టరువైపు.

కాంపౌండరొచ్చి డాక్టరుగారితో చెప్పాడు శ్రావణికి స్పృహ వచ్చింది. తలకు ఈ రోజు కుట్లు వేసి రెండురోజులలో పంపించేస్తారని.

"వినయ్‌గారూ నిన్న జరిగిన ఈ సంఘటన వెనుక తల్లిదండ్రులుగా మీ తప్పు ఎంత ఉందో తను పెరుగుతున్న ఈ సమాజం ప్రభావం అంతకన్నా ఎక్కువ ఉంది. మీ పాపకి ఇంట్లో నచ్చిన వ్యక్తులు నాన్నమ్మ తాతయ్యా అయితే వాళ్ళిప్పుడు మీ వద్ద లేరు. స్కూల్లో ఆయా, నచ్చిన సినిమాలు బ్లాక్ & వైట్ కానీ అవి చూడ్డానికి వీలు లేకుండా సీరియల్స్ వేస్తున్నారంట నిజమేనా !

## బతుకు జాడ

- పి.లక్ష్మణ్‌రావ్
9441215989



*ప్రజల భాషకు మూలపురుషుడు
గురజాడ నామం జపిస్తే
శ్వాస కోశాలు చైతన్యమై
ఉద్యమ కెరటాలౌతాయి
మూఢ విశ్వాసాలపై
గురజాడ మంత్రం పఠిస్తే
జ్ఞాన కిరణాలు ఉత్తేజమై
చీకటి పొరలు తొలగిస్తాయి*

*రాయిరప్పలకు సాగి మొక్కుతున్నప్పుడు
గురజాడ పేరు గుర్తొస్తే
నరాల్లో మానవత్వం ఉప్పొంగి
మనసు మనిషి వాదాన్ని నినదిస్తుంది
మగువలపై ఆధిపత్యం చేస్తున్నప్పుడు
మన గురజాడ యాది కొస్తే
స్నేహితులుగా మారిపోయి
అతివలకు ఆకాశంలో సగం చోటిస్తాం*

*ఆర్థిక ప్రణాళికలు రచిస్తున్నప్పుడు
గురజాడ దేశభక్తి గీతాన్ని అనుసరిస్తే
ప్రగతిరథ చక్రాలు చకచకా పరుగులెడతాయి*

*ఒట్టి మాటలు గట్టిగా చెబుతున్నప్పుడు
గురజాడను ఆవాహనం చేసుకుంటే
గిరీశం గుర్తొచ్చి
సిగ్గుతో చావాలనుకుంటాం*

*స్వంతలాభం కోసం దగా చేస్తున్నప్పుడు
గురజాడ పేరు జ్ఞాపకమొస్తే
లుబ్ధావదాన్లు గుర్తొచ్చి
ఒళ్ళంతా సిగ్గుతో చచ్చుబడిపోతుంది*

*గురజాడ కలం
అరుణ కిరణాలు నింపుకొని
దుష్టపాలకులపై నిప్పురవ్వలు
చెరుగుతుంది
గురజాడ అక్షరం
ప్రగతి దారులు చూపించి
నవ్య పథికులపై
వెలుగు రవ్వలు కురిపిస్తుంది
గురజాడ నామం
గురజాడ కలం
గురజాడ అక్షరం
మనకు గురువుజాడ, వెలుగు జాడ
బతుకుజాడ!*

*(మహాకవి గురజాడ శత వర్ధంతి
సంవత్సరం)*

---

వినయ్ అవునన్నట్లు తల ఊపాడు.

"ఇకపోతే ఆమెకి నచ్చని మనస్తాయికి మించిన మార్కులు తెచ్చుకోవాలన్న మీ కోరిక సరే దీనంతటికి మూలకారణం విపరీతంగా పెరిగిన చానల్స్ వాటిని మనం ఆపలేం. పెట్టుబడిదారుకి లాభం ఉంటుంది. అంటే దేన్నయినా ప్రజల మీదికి వదుల్తారు. కానీ దాన్ని మీ ఇంట్లో నించి తరిమే శక్తి ఇంకా మీ చేతిలోనే ఉంది. ఈ తరాన్ని తప్పుదారి పట్టిస్తున్నవి ప్రభుత్వాల నిర్ణయాలు. కాపాడుతున్నవి పాత తరం అనుబంధాలు.

అర్థంకానట్లు చూచాడు వినయ్

"పిల్లలకు విద్యార్థి దశలో స్పర్ధలుండాలి. వైరాలు పెరగడం వలన జరిగే అనర్ధాన్ని చూచాము. మీకు అర్థమయిందనుకొంటాను.

మందులేమైనా వాడాలా అన్నట్లు చూచాడు వినయ్.

"ఏ మందూ అవసరం లేదు. తనకవసరమైన మందు తనే వేసుకొంది.

ఈ దశలో పిల్లలకు వారి భావాలను, బాధలను పంచుకొనే భాగస్వాములు తల్లిదండ్రులలో కన్పడాలి. అప్పుడే సమస్యలే ఉండవు. గదిలో సాధన చేసి బరువులెత్తడంలో బంగారు పథకం సాధించిన ఆటగాడూ, సిర్తగట్టుపై చేను కావడి పట్టుకొని నడిచే కర్షకుడు. ఎవరు గొప్ప. ఎవ్వరిలోని సామర్థ్యం సమాజానికి, కుటుంబానికి పనికి వస్తుందో ఆలోచించండి.

ఇకనుంచి మీరు నిషికి ఏమీ నిర్దేశించకండి తనకి అన్నీ తెలుసు. నిర్దేశించి పెంచేవి క్రోటాన్ మొక్కలు స్వతంత్రంగా పెరిగేవి ఫల వృక్షాలు. మీరు ధైర్యంగా వెళ్ళండి.

"పదమ్మా ఇంటికెళ్తాం"

"నేను ముందు శ్రావణీని చూడాలి దాన్తో చాలా మాట్లాడాలి"

"నిర్ణయం నీదమ్మా ఏం వినయ్‌గారూ" ఏం ఫర్వాలేదు తీసుకువెళ్ళండంటూ తల పంకించాడు.

వినయ్ నిషి వెళ్తున్నారు శ్రావణి ఉన్న వార్డు వైపు.

విష సంస్కృతులెన్ని దాడి చేసినా తిరిగి లేచి తలెత్తే క్రొత్త తరం కన్పిస్తోంది నిషిలో వైద్యునికి. ◆

# కాలువ మల్లయ్య కథలు - సామాజిక చిత్రణ



*కవిగా, కథకునిగా, నవలాకారునిగా, విమర్శకునిగా, వ్యాసకర్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన ప్రతిభను ప్రదర్శిస్తూ పాఠకుల హృదయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న వీరి సాహితీ ప్రస్థానంలో 200 కవితలు, 875 కథలు, 16 నవలలు, 600 వ్యాసాలు రాసారు.*

**- బుట్టి సునీత**
**9963077641**

కాలువ మల్లయ్య తెలంగాణా రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా జూలపల్లి మండలంలోని తెలుకుంట గ్రామం యాదవ సామాజిక వర్గంలో కాలువ ఓదేలు-శ్రీమతి పోచమ్మ దంపతులకు 12-1-1952 సం॥లో జన్మించారు. వీరికి బాల్యం నుండే సాహిత్యాభిలాష ఏర్పడడానికి వాళ్ళ నాన్న ప్రేరణ, ప్రోత్సాహకాలే కారణం.

కవిగా, కథకునిగా, నవలాకారునిగా, విమర్శకునిగా, వ్యాసకర్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన ప్రతిభను ప్రదర్శిస్తూ పాఠకుల హృదయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న వీరి సాహితీ ప్రస్థానంలో 200 కవితలు, 875 కథలు, 16 నవలలు, 600 వ్యాసాలు రాసారు.

"కాలువ మల్లయ్య కథలన్నింటికి సమకాలీన సామాజిక స్పృహ కేంద్రకం. వారి ఇతివృత్తాలన్నీ మనిషికి, సమాజానికీ మధ్యనున్న సంఘర్షణ ఆధారంగా సాగేవే. " సమాజ పరిణామ క్రమాన్ని అక్షరీకరించుకుంటూ వచ్చేది సాహిత్యం. అందువలన సమాజానికి సాహిత్యానికి అవినాభావ సంబంధం ఉంటుంది. స్పష్టమైన సామాజిక అవగాహన, దృక్పథం ఉన్న రచయితలు తమ బాధ్యతను గుర్తించి వారి రచనల్లో వాస్తవికతను చిత్రిస్తారు. కాలువ మల్లయ్య కూడా ప్రతి సామాజిక మార్పుకు స్పందిస్తూ, తాను కనీ, వినీ ఎరిగిన విషయాలకు ఒక రూపమిచ్చి కథలుగా మలిచారు. వీరి కథల్లో మన చుట్టూ ఉన్న అనేక సామాజిక సమస్యలు కనిపిస్తాయి. తెలంగాణ ప్రాంత సంస్కృతి, సంక్షోభం, సంఘర్షణ, పోరాటం, పరిష్కారం, దళిత బహుజన జీవితం, రైతాంగ జీవితంలోని కడగండ్లు, గని కార్మిక జీవితం, వ్యవసాయ అసంఘటిత కూలీల బ్రతుకు, వలసలు, కట్న సమస్యలు, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం, రక్తసంబంధీకుల్ని, తల్లిదండ్రుల్ని నిరాదరిస్తున్న అమానవీయత, మానవ సంబంధాలు డబ్బు సంబంధాలుగా స్థిరపడిన వైనం, పరాయీకరణకు గురిచేస్తున్న చదువులు, ఇంగ్లీషు మీడియం, కంప్యూటర్ విద్య, అమెరికాపై మోజు వంటి పరిణామాలు, మధ్యతరగతిలో పెరుగుతున్న ఆశలు, అశాంతి తదితర సమస్యలు, తెలంగాణ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలు మొదలైన సామాజిక సంఘటనలు వీరి కథల్లో ప్రతిఫలిస్తాయి. వీరు ప్రధానంగా శిష్ట వ్యవహారిక, తెలంగాణ మాండలికాన్ని తన కథల్లో ఉపయోగిస్తారు.

"పల్లెపట్టులోని సామాన్య జన జీవితాన్ని వస్తువుగా తీసుకొని కాలువ మల్లయ్య ఎన్నో కథలు వ్రాశారు. చుట్టూ ఉన్న పరిసరాలను సూక్ష్మంగా పరిశీలించే సునిశిత దృష్టి ఈ రచయితకు బాగా అలవడింది." అని డా॥సి.నారాయణరెడ్డి గారన్నట్లు కాలువ మల్లయ్య పుట్టి పెరిగిన పల్లె వాతావరణం, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సామాజిక జీవనం, ఉద్యోగం చేసిన రామగుండం పారిశ్రామిక ప్రాంతం, విప్లవ ఉద్యమాలు, కార్మిక ఉద్యమాలు అన్నీ వీరి రచనలపై ప్రభావాన్ని చూపాయి.

కాలువ మల్లయ్య తెలంగాణ రైతు జీవనాన్ని, రైతు జీవనంతో ముడిపడివున్న అనేక సమస్యలను వివిధ కథల్లో చిత్రించారు. గ్రామాల్లో వ్యవసాయమే జీవనాధారం. రైతేరాజు

అని ఆత్మవిశ్వాసంతో బతికినా రోజురోజుకు రైతు పరిస్థితి అధ్వాన్నమవుతున్నది. "నేలతల్లి", జెనుల నోల్లల్ల భారతం, భస్మాసురహస్తం, సంఘర్షణ మొదలైన కథల ద్వారా ఈ విషయాన్ని నిరూపించారు.




"జెనుల నోల్లల్ల భారతం" అనే కథలో భారతంలో ఉన్నది సమాజంలో లేకుండా పోదు అన్నట్లుగా కర్ణుడి చావుకు ఎన్ని కారణాలున్నాయో, అలాగే రైతు పేదరికంలో కూరుకుపోవడానికి అన్ని కారణా లుంటాయని ఎర్రెడ్డి పాత్ర ద్వారా నిరూపించారు. ప్రకృతిదేవత సమయానికి ఆదుకోక పోవడం, పెట్టుబడు లకు డబ్బులేక పోవడం, అప్పులకు ఎక్కువ వడ్డీలు, సర్కారు బాకీలు, విత్తనాలకు యూరియాలకు ఎక్కువ ధరలు, మధ్యవర్తుల దగా, ఆఫీసులలో మోసాలు ఇలాంటి అన్ని కారణాల వల్ల రైతులు పేదరికంలో మ్రగ్గుతున్న విషయాన్ని వెల్లడించారు రచయిత.

గ్రామాల్లో అభివృద్ధి పేరిట జరుగుతున్న మార్పుల వలన గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయి. మానవ సంబంధాలు క్రమంగా విచ్ఛిన్నమై స్వార్థపూరిత భావజాలం పెరిగిపోతున్నది. మానవతా విలువలను డబ్బు దూరం చేస్తుందని, మనిషిలోని స్వార్థమే మానవ సంబంధాల విఘాతానికి మూలమవుతున్న క్రమం ''రూపాయి-రూపాయి'', ''అమ్మమ్మ'', ''కాలుష్యం'', 'కరువు", "నాయనమ్మ కోరిక", "ఆ వృద్ధుడు మరణిస్తే", "అమ్మమీది సొమ్ములు", "పేగు బంధం", "ఇల్లు" మొదలైన కథల్లో చిత్రించారు.

**డబ్బు మనుష్యుల్లోని సెంటిమెంట్లను, ఆత్మీయతాను రాగాలను దూరం చేస్తున్న క్రమాన్ని హృదయం ద్రవించేలా చిత్రించారు కాలువ మల్లయ్య.**

"ఇల్లు" కథలో ఉద్యోగరీత్యా పట్నంలో ఇల్లు కట్టుకొని స్థిర నివాసం ఏర్పరచుకున్న కిశోర్‌కు పల్లెలో స్వంత ఇల్లు ఉంటుంది. పండగలకి పల్లెకు వెళ్ళే కిశోర్ ఆ ఇంటిని వాళ్ళ అమ్మ స్మృతిచిహ్నంగా కాపాడుకుంటూ వస్తాడు. నిరుప యోగంగా ఉన్న ఆ ఇల్లును అమ్మివేస్తే మంచిదంటుంది కిశోర్ భార్య కమల. తాను పుట్టి పెరిగిన ఇల్లును, తన పూర్వీకుల చిహ్నమైన ఆ ఇంటిని అమ్మడానికి కిశోర్ ఇష్టపడడు. ఇంటి నిర్మాణంలో తన తల్లిదండ్రుల చెమట ఉక్కలు ఉండడం, ఆ ఇంటిని దక్కించుకోవడానికి తన తల్లి ప్రాణాల్ని ఫణంగా పెట్టడం, ఊళ్ళో తన కంటూ ఓ చిరునామా ఉండడం, అది తన సెంటిమెంట్ ఇల్లు కావడంతో, ఆ ఇల్లును వదులనంటాడు కిశోర్. కిశోర్‌తో నమ్మబలుకుతూనే వాళ్ళ పాలివాళ్ళకు ఇల్లు అమ్మి డబ్బు తీసుకుంటుంది అతని భార్య. కొన్నాళ్ళ తర్వాత విషయం చెప్పి సంతకం చేయిస్తానంటుంది. ఏడాది గడవక ముందే ఇల్లు మీద బెంగతో కిశోర్ ప్రాణాలు వదులుతాడు.

ఈ కథలో డబ్బు మనుష్యుల్లోని సెంటిమెంట్లను, ఆత్మీయతాను రాగాలను దూరం చేస్తున్న క్రమాన్ని హృదయం ద్రవించేలా చిత్రించారు కాలువ మల్లయ్య.

"మౌనహింస" అనే కథలో ప్రభుత్వ ఉద్యోగి దశరథం భార్య రాజవ్వ. ఈమె మొదటి నుండి తన భర్తతో కొంతడబ్బు ఇంటి అవసరాలకు తన వద్ద ఉంచమంటుంది. కాని దశరథం డబ్బు అధికారాలన్నీ పిల్లలకే అప్పగించుతాడు. ఉన్నదంతా పిల్లలకే పెడితే మనకెట్లా అంటుంది రాజవ్వ. దశరథం వృద్ధాప్యంలో మంచం మీద ఉన్నప్పుడు కొడుకులు, కోడండ్లు డబ్బు పంపకాల గూర్చి వేధిస్తుంటే తీవ్ర మానసిక వ్యధను అనుభవిస్తుంది. భర్త చివరి క్షణాల్లో ఉన్నప్పుడు కూడా సంతానం మాటలకు ప్రత్యక్ష నరకం చవిచూస్తుంది. దశరథం మరణించాక మనవరాలు ఓదార్పుతో కొంత స్థిమిత పడుతుంది. చివరకు సంతానం మీద విసుగుతో తన మరణానంతరం తన ఆస్తి అంతా వృద్ధాశ్రమానికి చెందేలా వీలునామా రాస్తుంది. ఈ కథలో రాజవ్వ నిరంతరం మౌనహింసను భరిస్తున్న మౌనజ్ఞానిగా మనకు కనిపిస్తుంది.

సామాజిక అభివృద్ధిలో భాగంగా అన్ని వర్గాల ప్రజలు ఎదుగుతున్నారంటే దానికి ఆధునిక విద్యయే దోహదం చేసింది. విద్యా వ్యవస్థలో వచ్చిన పరిణామ క్రమం ద్వారా పిల్లలను నిర్బంధంగా చదివిస్తున్న విధానం వల్ల ఎదురయ్యే ఫలితాలు కొన్ని కథల్లో చిత్రించారు.

పిల్లల అభిరుచులకు విలువ నివ్వకుండా, వారి సామర్థ్యాన్ని పరిశీలించ కుండా, ఇంగ్లీషు మీడియం పట్ల మోజుతో డాక్టర్, ఇంజనీర్ కావాలన్న ఒత్తిడి పెంచుతూ తల్లిదండ్రులు చదివిస్తున్న వైనం "టాకింగ్ డాల్" కథలో కన్పిస్తుంది. తన అభిరుచికి, ఆలోచనకు ప్రాధాన్యం ఇవ్వకుండా, తల్లిదండ్రులు ఎంసెట్‌లో ర్యాంక్ సాధనే లక్ష్యంగా ఒత్తిడి పెంచినందుకు ఆ మానసిక క్షోభను అనుభవించలేక మృత్యుంజయ్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం ఈ కథలో చిత్రితమయింది.

కాలువ మల్లయ్య కథారచనకు ఇతివృత్త ఎంపికలో భాగంగా తన ఊరి వ్యక్తులను పాత్రలుగా మలిచారని చెప్పడానికి ఈ కథ ఒక తార్కాణం. ఇందులోని ఇతివృత్తం వారు డిగ్రీ చదివే రోజుల్లో జరిగింది.

ఇందులో ఐదేళ్ళ హరిజన బాలుడు సిలుకయ్య పాసిపోయిన గడుక, పులిసిపోయిన అంబలి కలుపుకొని త్రాగుతుంటే వాళ్ళమ్మ పండుగనాడు మెతుకుల బువ్వ, కూర వండి కడుపునిండా తినిపిస్త బిడ్డ అని చెబుతుంది. అది విన్న రచయిత హృదయం ద్రవించి పోతుంది. ఈ వాస్తవ కథలో రాత్రింబవళ్ళు కష్టించి పనిచేసినా కడుపునిండా తినలేని పేదవారి దీనావస్థని చిత్రించడం జరిగింది.

రాజుకోడి (ఆధునిక బేతాళ కథలు) అనే కథా సంపుటిలోని కథ "లంచాల దేవుడు". ఇందులో దేవుడు కూడా సత్యం

ఎవరివైపు ఉందో వారివైపు ఉండకుండా ఎవరు ఎక్కువ ముడుపులు చెల్లిస్తే వారి కోరికలే తీర్చాడు. ఈ కథ ద్వారా పేదరైతుకు మానవుల వల్ల జరిగే అన్యాయమే కాకుండా దేవుడి వల్ల కూడా అన్యాయం జరిగే విధానాన్ని చిత్రించారు. మరియు రామ్మోహన్ అనే పాత్ర ద్వారా, ప్రతిభ ఉన్నా లౌక్యం లేకపోవడం వల్ల ఉద్యోగం సంపాదించలేక కష్టాల పాలయిన విధానం విశ్లేషించారు.




"మూడు తరాలు" అనే కథలో సమాజంలోని వ్యక్తులు ఎంత ఎక్కువ శారీరక శ్రమ చేస్తే అంత ఆరోగ్యంగా, చురుకుగా ఉండవచ్చని, సోమరితనం పనికిరాదని, కష్టించేతత్వం ఉన్నవారే ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని మూడు తరాల్లోని మూడు స్త్రీ పాత్రల ద్వారా తెలియజేశారు.

"తోలుబొమ్మలు" అనే కథలో అద్భుతమైన జానపద కళారూపాలు మరుగునపడి కళాకారులకు బ్రతుకుదెరువు లేకుండా పోతే వారు అనుభవించే మానసిక క్షోభను కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు. అందరూ విదేశీ సంస్కృతి మాయలోపడి సినిమాలకు, టీవీలకు, కంప్యూటర్లకు అలవాటుపడి, జానపద కళారూపాలను చిన్నచూపు చూస్తున్నారని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు.

భూస్వాములు దురహంకారముతో వ్యవహరించిన తీరును 'పంజరం', చిందొర్సాని, దొరసాని చీర, దొరగారి గడి మొదలైన కథల్లో చిత్రించారు.

తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని తేవడానికి, దొరల పెత్తనాన్ని, దోపిడీని ఎదుర్కొనేందుకు విప్లవ ఉద్యమాలు కొంతవరకు ప్రభావాన్ని చూపాయని 'వెలి', ధిక్కారం, వెంటాడేపాట, అంబోతు, సాయుధం మొదలైన కథల ద్వారా తెలుస్తుంది.

వ్యవసాయంతో భుక్తి గడవక, జీవితంలో ఎదుగుదలను ఆశించి రైతులు, కూలీలు సింగరేణి బొగ్గు గనుల్ని ప్రత్యామ్నాయ జీవనాధారంగా భావించి పారిశ్రామికీ కరణలో భాగస్వాము లైనప్పటికి వారి బ్రతుకు దుర్భరమే అవుతుందని తెలిపే కథలు "అన్న", ప్రస్థానం, సమ్మె, మాల్లీ తల్లి ఒడిలోకి, ఉరితాడు, యంత్ర భూతములు, అడ్డ, పొలాల్లోకి.

సమాజంలోని భూస్వామ్యవర్గ స్త్రీల, శ్రామికవర్గ స్త్రీల సమస్యలను, సంస్కృతిని జీవితాల్ని చిత్రిస్తూ కాలువ మల్లయ్య అనేక కథలు రాసారు. స్త్రీవాద దృక్పథంతో చూసినపుడు తరతరాలుగా స్త్రీ జీవితం పరాధీనమై, స్వంత వ్యక్తిత్వం లేకుండా గడిచి పోతుందని, ఇకనైనా స్త్రీలు మేల్కొని తమ బ్రతుకుల్ని సరిదిద్దు కోవాల్సిన అవసరం ఉందని వీరి కథలు చదివితే అవగత మవుతుంది.

"గలుమ" అనే కథలో మల్లీశ్వరి అనే స్త్రీ జీవితాన్ని పరాధీనురాలిగా గడిపిన వైనం స్పష్టమవుతుంది. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు సంరక్షణలోనే గడపాలని ధర్మశాస్త్రాలు బోధించినట్లుగానే మల్లీశ్వరి జీవితం సాగిపోతుందని ఈ కథ నిరూపిస్తుంది.

తెలంగాణ గ్రామీణ సమాజంలో అనాదిగా దళితులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. తరతరాల అణిచివేత, భూస్వామ్య వ్యవస్థలోని వెట్టిచాకిరి వీరిని సామాజిక జీవనంలో అట్టడుగు వర్గానికి చేర్చింది.

"సంస్కారం" అనే కథలో సమాజంలో దళితులు ఉన్నత వర్గీయుల వల్ల ఏ విధంగా వంచింపబడుతున్నారో 'మేరి' చదువు, సంస్కారం, ఆదర్శభావాలు ఉన్న ఒక దళిత యువతి. ఈమె భీంరావ్ అనే ఉన్నత వర్గానికి చెందిన, చదువుకున్న, కుత్సిత మనస్సు కల్గిన సంస్కారహీనుడి చేతిలో మోసపోయి చివరికి వారి కుటుంబానికి ఎలా బుద్ధి చెప్పింది అనే విషయం ఈ కథలో చిత్రించబడింది. ఇందులో ఆనాటి పెద్దలు తమ తీర్పుల ద్వారా ఎంత మందికి మానసిక క్షోభను కల్గించారో అర్థమౌతుంది. క్రింది జాతులపట్ల, స్త్రీలపట్ల ఉన్న వివక్ష కనబడుతుంది. దళిత యువకుల మధ్యగల ఐకమత్యం రాబోయే రోజుల్లో మంచి మార్పును స్ఫురింపజేస్తుంది.

*తెలంగాణా మాండలికానికి ఊపిరిపోస్తూ కాలువ మల్లయ్యగారు రాసిన శీర్షిక కథల్లో "అవ్వతోడు గిది తెలంగాణా'' అనే కథాసంపుటి ఆణిముత్యం వంటిది. ఈ సంపుటిలోని ఆర్ద్రత నింపే వాస్తవ కథ. "పండుగనాడే మెతుకు బువ్వ".*

ఈ సమాజంలో పనివాళ్ళు ఎక్కడపడితే అక్కడ పనిచేసుకుంటూ కనబడుతూనే ఉన్నారు. అలాంటి పసివాడి గురించి 'పాలబుగ్గల పిల్లవాడా, పసులగాసే చిన్నవాడా" అనే వాస్తవ కథలో కొండుమల్లయ్య అనే బాలుడి పాత్ర ద్వారా పసివాళ్ళు పని రాక్షసికి బలవుతున్న విధానం తెలియచేశారు.

ఇలా అలుపెరుగని యోధునిలా విస్మృతమైన కథాసాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అందిస్తున్న కాలువ మల్లయ్య విశిష్టమైన ఏటీఏ పురస్కారంతో పాటు మరెన్నో పురస్కారాలు పొందారు.

సామాజిక జీవనాన్ని అన్ని కోణాల్లోంచి చిత్రిస్తూ వస్తురీత్యా తెలంగాణా ప్రాంత ప్రత్యేకతను చాటుతున్న వీరి కథలు భావితరాలకు స్ఫూర్తినిచ్చేవిగా ఉంటాయి. తన అనుభవ పరిధిలోని దేశకాల వాతావరణాల్ని చక్కగా ప్రతిఫలింపజేసి కథకు విశ్వసనీయత కలిగిస్తారు కాలువ మల్లయ్య.

ఉత్తమ సాహిత్య సృజన జీవిత లక్ష్యంగా భావించి, సమకాలీన రచయితల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకొని రచయితగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు కాలువ మల్లయ్య. ◆

## కవిత

# వడగాలులు

కె. ఆంజనేయ కుమార్
9494053019

కాంక్రీటు కల్పవృక్షాలు వరుసగా నుంచుంటే
భస్మాసుర హస్తంతో
అగ్నిపేడ కలిపి అలికిన ఆ పై కప్పు
చుట్టూ గోడల మరుగులేకపోయినా
'చేట' అంత నోరుతో ముళ్ళ కుక్కలా మొరుగుతోంది
అగ్ని తుపాను వెలిసాక
మినుకు మినుకు మంటూ అక్కడక్కడా పడివున్న
కొడిగట్టిన దీపాల వత్తుల్లో వున్న నల్లటి కాండాలపై
ఆరిపోయిన ఆకుపచ్చని కాంతి మరకల్లా తాటాకులు
తట్టాబుట్ట సర్దుకొని పోతున్న వలస కూలీల్లా వున్నాయి,
దీర్ఘకాలంగా వికృత భయంకర వ్యాధితో బాధపడుతున్న
చంటిపిల్లాడికి ఇక తప్పని వైద్యంగా
ఒ భీతావహ కన్న తల్లి
ఎర్ర నీళ్ళు దిష్టితీసి రోడ్డు మీద పారపోసినట్టు ఇటుకరాళ్ళ
ముసలి భూమి మొగుడితో తాపం చల్లారక
ఫసిఫిక్ సముద్ర వేడికవ్వ విసిరిన
ఎల్‌నినో రాళ్ళలా కంకర్రాళ్ళు
ఊరంతా భయం బండిలో పంపిన గారెలు, వడలు
కరకరా నములుతున్న బకాసురుడి దవడల్లా
దడదడలు పుట్టిస్తున్నాయి
పాలకుల వికృత నిర్మాణపు అసంపూర్తి భవనం ముందు
ఇవన్నీ
పాల సముద్రంలోంచి వచ్చిన విషంలా బుసకొడుతున్నాయి.
అంతే కాదు... పక్కన కుప్పగా పోసి ఉన్న ఇసుక
పాతకాలపు రైలింజన్‌లోని బొగ్గు కణాల్లా మండుతుంటే...
వడగాల్పుల రైలు
రాతి పరుపు మీద రతిచేస్తున్నా వికృత దుర్మార్గుడి
మోకాళ్ళలా
రక్తం దోడుతోంది!
ఆగస్టు పదిహేనో
జనవరి ఇరవై ఆరో అయిపోయాక
మిగిలిపోయిన జాతీయ జెండా లెబుళ్ళ కాగితాలన్నిటినీ
ప్లాస్టిక్ రబ్బరుబ్యాండు వేసి
కట్టకట్టి మూలన గుట్టగా చిత్తుగా పడేసినట్టు
ఆమ్యమ్యామంత్రులంతా పదవుల సంక్రాంతి అయ్యాక
ప్రజల్నంతా అడవిదుంగల్లా కట్టకట్టి భోగిమంటల్లోకి తోసేసి



కామంతో మాత్రం కనుము పం పండుగ మాంసం
కుమ్ముకొని తినడానికి
అధికార జింకల్ని ఎంచక్కా సిద్ధం చేసుకున్నాయి!
"మేం పవర్ లోకి వచ్చాం కదా
మీకు అన్ని ఇకనుంచి కట్టే" అని
సంకేతాలు పరంపరగా ఇస్తున్న ప్రభుత్వాలు
ప్రజలకు పవర్ కట్ ఉక్క ప్రభుత్వాలు
ప్రజలకు పవర్ కట్ ఉక్క పుట్టించి
మీరు మమ్మల్ని గెలిపించిన దేవుళ్ళు కాబట్టి
అగ్ని దేవుడ్ని, వాయుదేవుడ్ని కలిపి కుట్టి
మీ శవాలపై దండలుగా వేస్తామంటున్నాయి
కోతలకు నిరసనగా ప్రజలు కొవ్వొత్తులతో ధర్నా చేస్తుంటే...
నేతలు మురిపెంగా కార్పొరేట్ కాసులు వజ్రాల కాంతులతో
సేద తీరుతున్నారు!
కొండలు రగిల్చే వడగాలులు
జనం గుండె పువ్వుల్ని కటికనేలపై రాలుస్తుంటే
పర్యావరణ ప్రమాదాలపై కమిటీ వేసి
కన్నీరు తుడిచే నష్టపరిహారం ప్రకటనలతో
చేతులు దులుపుకుంటూ
కన్నీటికి కారణమైన కార్పొరేట్ వెన్నులకు వెన్నపూసరాస్తూ
సంపద సాయం చేస్తున్నారు
ఎన్నికల సాయం చేస్తున్నారు.
ఎన్నికల వడగాలులప్పుడు
మద్యం, బిర్యాని పాకెట్లు డబ్బులతో ప్రజాస్వామ్య హత్య చేసే వారు
పిట్టల్లా రాలే వడగాలులు ఎప్పుడు పుడతాయో!

కథ

# మల్లె మనసు

- చైతన్య ప్రసాద్
9849651451



'సార్!'

కుర్రాడికేక విని బయటికి వచ్చాను.

'మా వోనర్‌గారు దీన్ని మీకిచ్చి రమ్మన్నారు.'

బ్రౌన్ పేపర్ పేకెట్ అందుకుని తెరచి చూసాను. 'మల్లె మనసు' - చిరు కవితల చిరుపుస్తకం. 1/2 డమ్మీ సైజులో, బ్లాక్ గెటప్-మధ్యలో తెల్లని మల్లెపూవు-కాడ, రెండాకుల చిత్రంతో - ఫిల్మ్‌ప్రోసెస్‌తో, 40 పేజీల చిన్ని పుస్తకం-చూడగానే ఆకట్టుకుంది. వెనక్కి త్రిప్పి చూసాను. వెంకట్రామయ్యగారు, ఆయన సతీమణి హాఫ్ ఫొటో-ఫ్రేము కట్టి, క్రింద చిన్నగా వారి బయోడేటా-సింపుల్‌గా ఉందని పించింది - ప్రింటర్ రమేష్ పంపిన పుస్తకం.

"బాగుందయ్యా! ఇంకేమన్నా చెప్పమన్నారా!'

'లేదండి.'

'నేను వచ్చి కలుస్తానని చెప్పు. థాంక్స్!'

'ఉంటానండి' - కుర్రాడు వెళ్ళిపోయాడు.

రూంలోకి వచ్చి కూర్చొని, పుస్తకంలో పేజీలు తిరగేశాను. పాలమీగడలాంటి క్రీమ్ పేపరు మీద ముచ్చటైన భావతరంగాల అక్షర మాలికలు! 'బాపు'ఫాంట్‌లో వేయిద్దామనుకున్నా. మాస్టారికి ఇష్టం ఉంటుందో లేదోనని, 20 సైజు మామూలు ఫాంట్‌లోనే - కళ్ళజోడు లేకపోయినా చదివేందుకు వీలుగా-ప్రింట్ చెయ్యమని చెప్పాను. అనుకున్నట్టుగానే వచ్చింది. కొన్ని కవితలు నాల్గు లైన్లుంటే, మరికొన్ని ఆరు, ఎనిమిది లైన్లు పెద్ద కవితలు పది, పన్నెండు లైన్లకు మించలేదు. అన్నీ ఫ్రేముల్లో బిగించినట్లుండి, రేఖా చిత్రాలు వాటర్ మార్క్‌తో కొత్త అందాన్నిచ్చాయి. మొత్తంమీద పుస్తకం సంతృప్తికరంగానే వచ్చింది. పేజీలు తిరగేస్తూనే-మనసు మెల్లగా గతంలోకి జారుకుంది.

***

చాలా కాలమైంది గదా, చూసొద్దామని సాయంత్రం అలా వెంకట్రామయ్య మాస్టారింటికి బయలుదేరాను. మేం చదువుకునే రోజుల్లో ఆయన మా తెలుగు మాస్టారు. ఆయనకి- ఇన్ సర్వీసు కంటే, రిటైర్‌మెంట్ సర్వీసే ఎక్కువలాగుంది. రిటైరయ్యాక, సొంత

ఊళ్ళోనే-ఆయన పాతింట్లోనే పిల్లాపాపలతో గడుపుతున్నారు. వెళ్ళగానే, అక్కడ జరుగుతున్న సన్నివేశం నాకు కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది.

'ఒరేయ్ బద్దాకన్నా! ఒక్కసారి రానాన్నా! వెంటనే వెళ్ళిపోదువుగాని. రెండులైన్లే-" మాస్టారి వేడికోలు.

'అబ్బా-ఉండు తాతయ్యా!నేను హో వర్క్ చేసుకోవాలి!'

వినబడలేదు కాబోలు - మళ్ళీ పిలిచారు మాస్టారు.

'నేనూ-హో వర్క్ చేసుకోవాలీ' - మాటలు విరిచి, అరుస్తూ చెప్పిన కొంచెం చిరాకు సమాధానం.

'వాడికి-హోంవర్క్ ఉందట. వాణ్ణి వదిలేయండి!' చెవిలో వెంకట్రామయ్య గారి భార్య వివరణిచ్చి వెళ్ళిపోయింది.

'హు!' ఒక పెద్ద నిట్టూర్పుతో, పక్కనే ఉన్న పాతడైరీని చేతితలోకి తీసుకుని, కుర్చీలో వెనక్కి జారగిలబడి, కళ్ళజోడు తీసి, దాన్ని పైనున్న కండువాతో తుడుచుకుంటున్న మాస్టారు.



నాకేం అర్థం కాలేదు. కొన్ని క్షణాలు ఆగి, అడుగులు ముందుకేసాను. అక్కడున్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ - 'నమస్కారం మాస్టారు!' అన్నాను.

ఆయన పట్టించుకోలేదు. రెండు నిమిషాలు కళ్ళజోడు రుద్దకుని, మళ్ళీ పెట్టుకున్న మాస్టారు, ముఖ చిట్లించి చూస్తూ 'ఎవరూ?'

'నేను-వరప్రసాదునండి!'

'నువ్వటయ్యా! దా-కూర్చో' - గుర్తుపట్టి, ఆప్యాయంగా అక్కడున్న మరో కుర్చీ చూపించారు. కాస్సేపాగి, తెచ్చుకున్న చిరునవ్వుతో 'ఏమిటి విశేషం?'

'ఏమీ లేదండి - మిమ్మల్ని కలిసి చాలా రోజులైందిగా - ఒకసారి చూసిపోదామని..' నా అభినయ వాక్కుల్ని అర్థం చేసుకున్నట్టున్నారు.

'మంచిది నాయునా!' మళ్ళీ మౌనం. ఆయున అన్యమనస్కంగా ఉన్నట్టనిపించింది.

'మీ ఆరోగ్యం ఎలా ఉందండి?' సాధారణ పలకరింపు ఆయనకు వినిపించినట్టు లేదు. స్వరం పెంచి, కొంచెం అభినయిస్తూ మళ్ళీ అడిగాను.

'బాగానే ఉంది. ఇదుగో - ఈ కుర్చీలోంచి లేవలేను - లేస్తే కూర్చోలేను. అదే ఇబ్బంది' అంటూండగానే కొంచెం దగ్గుతెర వచ్చింది. ఆయన వయసు సుమారు 96 సం॥రాలు అని ఈ మధ్యనే చెప్పినట్టు గుర్తు.

ఇంతలో మాస్టారుగారి భార్య వచ్చి అందిస్తున్న మజ్జిగ గ్లాసు అందుకుంటూ కళ్ళతోనే కృతజ్ఞతలు చెబుతూ అడిగా - 'ఎలా ఉన్నారమ్మా' అని.

'బాగానే ఉన్నాం నాయనా. ఈయనకే - ఛాదస్తం మరీ ఎక్కువైపోతోంది.'

'ఏం చేశారేవిటి?'ఖాళీ గ్లాసు తిరిగి అందిస్తూ, చిరునవ్వుతో అడిగాను.

'ఆయన కేదో గుర్తొచ్చినప్పుడల్లా - అదుగో - ఆ పుస్తకం, పెన్ను ఇచ్చి రాయమంటారు. పోనీ రాసిపెడదామా అనుకుంటే - అరగంట కొక అక్షరం చెబుతుంటారు. మధ్యలో మర్చిపోయానంటారు. పనులన్నీ మానుకుని, ఈయనగారు కవిత్వం చెబుతుంటే... నేను రాస్తూ కూర్చోవాలట - ఎలా వీలౌతుంది చెప్పు. ఈ మధ్య ఆ చిన్న పిల్లల్ని కూడా ఏడిపిస్తున్నారు. పాపం వాళ్ళు-ఈయనగారికి దొరక్కుండా పారిపోతున్నారనుకో!'

ఆవిడ ఫిర్యాదుకి ఏం చెప్పాలో తెలియని నాకు, చిరునవ్వే సమాధానమయింది. అంతవరకూ మా ఇద్దరిమధ్య సంభాషణను గమనిస్తున్న మాస్టారు-విషయం అర్థం చేసుకున్నట్టున్నారు-

'ఇదిగో - ఈ పుస్తకంలో రెండు లైన్లు రాసిపెట్టమంటే... ఈవిడకు తీరుబడి ఉండదు - ఆ బద్దూ వెధవ నా మాట వినిపించుకోడు - నాకు రాసే ఓపికా లేదు. చేతులు ఒణుకుతున్నాయ్, పెన్ను జారిపోతోంది - మా కళ్యాణి స్కూలు నుండి వస్తే, కాస్త సాయం చేస్తుంది...' ఆగి ఆగి ఆయాస పడుతూనే పూర్తిచేశారు.

ఇప్పుడు విషయం నాకు పూర్తిగా అర్థం అయింది. వెంటనే జేబులోంచి పెన్ను తీసి, 'నేను రాస్తాను-చెప్పండి। అంటూ పుస్తకం కోసం చేయి చాచాను. మాస్టారి భార్య లోపలికి వెళ్ళిపోయారు.

మాస్టారి పాతడైరీ అందుకున్నాను. అది 1981 లేదా 1987 నాటిదో! అట్టమీద ప్రింటులో చివరి అంకె చెరిగిపోయింది. లోపలికి తొంగిచూస్తే - కేలండర్‌ని బట్టి 1987 సం॥రానిదనిపించింది. పేజీలు తిరగేయబోతే కొన్ని కాగితాలు చేతిలోకి ఊడివస్తున్నాయ్. మళ్ళీ జాగ్రత్తగా వాటిని సర్ది పేజీలు జారిపోకుండా పరిశీలించాను. ప్రతీ పేజీలోనూ మాస్టారి చిరు కవితలు, వాటితోపాటు రేఖా చిత్రాలు లాంటి పిచ్చి బొమ్మలు, పిచ్చిగీతలు, రకరకాల ఆకృతులు. నాకు చిన్న నవ్వొచ్చింది. తలపైకెత్తి దూరంనుంచి నన్ను గమనిస్తున్న బద్దూని చూశాను. తాను చేసిన ఘనకార్యం, నాకు తెలిసిపోయిందను కున్నాడేమో-నన్ను చూసి కొంటెగా వెక్కిరించాడు. నాకూ నవ్వొచ్చింది.

చివరి పేజీలు త్రిప్పాను. అక్కడక్కడ వ్రాయడానికి మాస్టారు పడ్డపాట్లు- స్థిరత్వంలేని అక్షరాల్లో అగుపించాయి. మరికొన్ని

చోట్ల మంచి దస్తూరీ-బహుశా వాళ్ళ కళ్యాణీది కాబోలు.

'చెప్పండి మాస్టారు' నన్ను తన పుస్తకాన్ని మార్చి మార్చి గమనిస్తున్న మాస్టారితో అన్నాను. ఆయన అర్థం కానట్టు చూశారు.

'మీరు చెప్పండి-నేను రాసిపెడతా' గట్టిగానే అన్నాను.

'ఏవిటీ?'

'ఏదో రాయాలన్నారుగా-చెప్పండి!'

ఆయన కాస్సేపు బుర్ర గోక్కున్నారు. చివరకు మన్నించమన్నట్టు ముఖంపెట్టి 'గుర్తుకు రావడంలా- మర్చిపోయాను' అని చప్పరించబోతే మళ్ళీ దగ్గు, ఆ వెనక ఆయాసం!

అణగారిపోయిన మాస్టారి అక్షరవేదన - నా మనస్సు చివుక్కుమంది. ఇక ఆయన్ని ఇబ్బంది పెట్టడం మంచిది కాదని, డైరీ మూసేసి, పెన్ను జేబులో పెట్టేసుకున్నాను. ఇంతలో మాస్టారుగారి భార్య ఒక మాత్ర తీసుకువచ్చి, ఆయన నోట్లోవేసి, కాసిని మంచినీళ్ళు పట్టించి వెళ్ళిపోయింది.



'మాస్టారూ! ఈ పుస్తకం నాకోసారి ఇస్తారా-చూసిస్తాను। - ఆయనకి అర్థం అయ్యేలానే చెప్పాననుకుంటా 'ఎందుకూ?' ఆయన ప్రశ్న.

'మీ కభ్యంతరం లేకపోతే ... ఒకసారి తీసుకెళ్తా!'

'అలాగే-తీసుకెళ్ళు! ఇంకా నేను చెప్పేదీ లేదు-రాసే వాళ్ళూ లేరు' మూగవేదన.

ఇక ఆయనకు విశ్రాంతి నిస్తే బాగుంటుందని - వీడ్కోలు తీసుకొని, ఆ పాత డైరీతో వచ్చేస్తుంటే... 'పుస్తకం జాగ్రత్త!' మాస్టారి ఆరోప్రాణం గురించి హెచ్చరిక!

మళ్ళీ ఒకరోజు ఆ డైరీతీసి చూశా! మొదట్లో బాగున్నా, పోనుపోను పుస్తకంలో అక్షరాలు పేర్చుకొని చదివితేనేగాని అర్థం అయ్యేలా లేవు. ఒక్కోచోట అక్షరాలు రాని పిల్లలు పెన్నుతో సున్నాలు, గీతలు, గుడ్లు పెట్టినట్టుంది మరోచోట. ఇంకొన్ని పేజీల్లో అయితే - పెన్ను రాస్తుందో- లేదోనన్న ప్రయోగం కోసం గీసిన పిచ్చిగీతలు. ఏమైనా డైరీనిండా వెంకట్రామయ్య మాస్టారి అనుభూతులు, భావనలతోపాటు బద్దూగాడి ప్రయోగాలూ చాలా ఉన్నాయ్.

సుమారు ఒక నెలరోజులు - నాతీరిక సమయాల్లో - కుస్తీపడితేనేగాని, మాస్టారి డైరీలోని కొన్ని అక్షరసుమాల్ని కవితా మాలల్లోకి కూర్చలేకపోయాను. అర్థంకాక, కొన్ని అసంపూర్తిగా ఉండటంవల్ల, తీసేసినా, మొత్తం మీద ఒక నలభై వరకూ ఫెయిర్ చెయ్యగలిగాను. అన్నీ ఛందస్సులో లేకపోయినా, మంచినడకతో, కొన్ని పాడుకోవడానికి వీలుగానున్న భావతరంగాలు, వాస్తవ చిత్రణలు అక్కడక్కడా కొన్ని ఛాందసాలూ లేకపోలేదు.

వాటిని చూపించి, మా సాహితీ మిత్రులతో సంప్రదించా-చిన్న కవితాసంకలనంగా తీసుకొద్దామని. వాళ్ళంతా సంతోషంతో ఒప్పుకోవడమేకాదు - పూర్తి బాధ్యత నాకే అప్పగించారు. ఇక కొంచెం తీరుబడి చేసుకుని మాస్టారి పుస్తకం మీద దృష్టి పెట్టవలసి వచ్చింది.

బద్దూగాడి గీతలు, బొమ్మలూ చూశాక, ప్రతీ కవితకూ వీలైనంత వరకూ ఒక రేఖాచిత్రం తీసుకువస్తే బాగుంటుందేమోననే ప్రేరణ కలిగింది. నాకు చేతనైనంత వరకూ అలానే గీశాను. కవర్ పేజీ గెటప్, పుస్తకం పేరు కోసం కొంచెం తీవ్రంగానే ఆలోచించాను.

మాస్టారికి మల్లెపూవు అంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు క్లాసు కెడుతూ రోజూ మా దొడ్లో మల్లెపూవొకటి - అది పూచినన్నాళ్ళూ - తీసుకెళ్ళి మాస్టారి కిచ్చేవాడిని. దాంతో నన్నాయన సరదాగా 'మల్లెపూవు ప్రసాదం। అని పిలుస్తుండేవారు. నేనిచ్చిన మల్లెపూవుని రెండువ్రేళ్ళ మధ్య పెట్టుకుని మధ్యమధ్యలో వాసన ఆఘ్రాణిస్తూ, పాఠం చెప్పేవారు పుస్తకానికి ఆ పేరే పెడితే బాగుంటుందని అనిపించింది మా అందరికీ.

మాస్టారి ఫోటో కోసం మళ్ళీ ఒకసారి వాళ్ళింటికి వెళ్ళాను. ఆయన నిద్రపోతున్నారు. పాపం-మాస్టారిగారి భార్యే వెతికి, వారి పెన్షన్ ప్రపోజల్స్ కోసం ఇద్దరూ కలిసి దిగిన పాత ఫోటో-బ్లాక్ అండ్ వైట్ బస్ట్‌ఫోటో - ఒకటిచ్చారు. దాన్నే పుస్తకం వెనుక అట్టమీద, నేను కలెక్ట్ చేసిన చిన్న బయోడేటాతో ముద్రించాలనుకున్నాం. ప్రింటింగ్ ప్రెస్ యజమాని రమేష్ పరిచయస్తుడవడంతో, పని సులువుగానే పూర్తయింది. ప్రూఫ్ రీడింగ్ వంటి ఇతర పనులకు మా మిత్రులు సహకరించారు. చివరికి పుస్తకం అనుకున్నట్టుగా, అందంగా, ఆకర్షణీయంగా రావడం సంతోషాన్నిచ్చింది.

- - -

భార్యామణి 'టీ' పిలుపుతో వర్తమానంలోకి వచ్చాను. టీ సిప్ చేస్తూ కొత్త పుస్తకాన్ని మరోమారు తిరగేశాను. షర్టు వేసుకుని పుస్తకం తీసుకుని మిత్రుల దగ్గర కెళ్ళాను. పుస్తకాన్ని చూసి అందరూ ఆనందించి, తృప్తిపడ్డారు. మేమంతా కలిసి అప్పుడే ఒక ప్లాన్ వేసుకున్నాం.

ఓ ఆదివారం సాయంత్రం - మా సాహితీ మిత్రులం - ఓ అరడజను మంది కలిసి మాస్టారింటికెళ్ళాం.

మాస్టారు అప్పుడే తలస్నానం చేసినట్టున్నారు. టవాలుతో తలబాగా తుడిచి, ఫ్యానుకింద ఆరబెడుతోంది మాస్టారు గారి

భార్య. మమ్మల్నందరినీ చూడగానే కొంచెం కంగారు పడినట్టుంది. లోపలికి వెళ్ళి చెప్పింది. మాస్టారు అబ్బాయి, మనమడు, పిల్లలు గలగలా హాల్లోకి వచ్చారు. విషయం చెప్పి, అందర్నీ హాల్లోకి రమ్మన్నాం.

మాస్టారు తెల్లపంచె చొక్కా, పైన కండువాతో మల్లెపూవులా ఉన్నారు.

'అమ్మా! మీ ఇద్దర్నీ కలిపి ఫొటో తీసుకుందామనుకుంటున్నాం. మీరు కూడా కొంచెం ముఖం కడుక్కుని రండి' అన్నాను. ఆవిడ కొంచెం కంగారుగానే లోనికి వెళ్ళారు.

ఈలోపు మాస్టారుగారి అబ్బాయి. మనవడితో మేం కబుర్లలో పడ్డాం. నేను బడ్డూని పిలిచాను. వాడువచ్చి, రెండు మూడు మాటలు చెప్పి పారిపోయాడు.

వెంకట్రామయ్యగారికి ఒకబ్బాయి, ఇద్దరమ్మాయిలు. రిటైరవ్వకముందే, అయినంతలో ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేసి పంపించేశారు. ఇప్పుడు వాళ్ళకి పెళ్ళీడు కొచ్చిన పిల్లలు, ఇక అబ్బాయి కూడా టీచరు చేసి రిటైరయ్యారు. ప్రస్తుతం షాపుల్లో అకౌంట్లు రాస్తూ కాలక్షేపం చేస్తున్నారు. వారికీ ఒక అబ్బాయి – వెంకట్రామయ్య గారి మనవడు – వెంకటరమణ. ఏదో ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాట. ఆదివారం కావడంతో ఇల్లంతా పిల్లలతో సందడిగా ఉంది.



మా అందరికీ పంచదార కలిపిన నిమ్మరసం నీళ్ళు అందించారు. మా మిత్రుడు కెమేరా సరిచేసుకుని సిద్ధంగా ఉన్నాడు. మాస్టారుగారి భార్య స్నానం చేసి, పట్టుచీర కట్టుకుని రావడంతో – మనవరాళ్ళ వేళాకోళం చేస్తూ నవ్విస్తున్నారు. ఆవిడ వెనకగా వస్తూ. అందరూ హాల్లో కొచ్చారు. మాస్టారు గారి ప్రక్కనే ఆయన భార్యకు కూడా కుర్చీవేసి కూర్చోమన్నాం. ఈ హడావిడికి వెంకట్రామయ్యగారు కొంత విస్తుబోయి చూస్తున్నారు.

'మాస్టారూ! ఈరోజు మా కోసం–మీరొక పుస్తకాన్ని ఆవిష్కరించాలి' అంటూ ఎర్రటి గౌజింగ్ పేపరులో చుట్టి ఉన్న పేకెట్ని మాస్టారికి అందించాను.

'ఇప్పుడు నాకెందుకయ్యా ఇవన్నీ ... అసలే షుగరు. తీపి తినకూడదంటున్నారు–' అంటూ మొహమాటపడుతూనే పేకెట్ అందుకున్నారు.

అంతా ఘొల్లున నవ్వారు.

'తాతయ్యా! అది స్వీట్లు కాదు – పుస్తకాల కట్ట' –నవ్వుతున్న పిల్లల వేళాకోళం – ఆయన కంతా గందరగోళం!

వెంటనే మా మిత్రుడు తన చేతిలో ఉన్న స్వీట్స్ పేకెట్ ఆయన భార్య కందించాడు.

'అదుగో–మీరనుకున్న స్వీట్ పేకెట్ కూడా వచ్చేసింది తాతయ్యా!'బడ్డూగాడి కేక–పిల్లల కేరింతలు–పెద్దవాళ్ళ మందలింపులు. ఆవిడ ఆ స్వీట్ పేకెట్ని కోడలికిచ్చింది.

మిగిలిన మా మిత్రులు దంపతులిద్దరికీ కలిపి ఒక పెద్ద పూలదండ వేసి, శాలువా కప్పి సత్కరించారు – అందరూ తప్పట్లు! కెమేరా మిత్రుడు క్లోజప్‌లు, లాంగ్ షాట్‌లు అంటూ ఆ దంపతులిద్దరి ప్రక్కనా అందర్నీ అటూ ఇటూ నిలబెడుతూ హడావిడి చేస్తూ ఫొటోలు తీశాడు – తన డిజిటల్ కెమేరాలో. పాపం మాస్టారు మాత్రం – ఇంత హడావిడి జరుగుతున్నా – మేం చెప్పినట్టల్లా యాంత్రికంగా చేస్తూ, మధ్యమధ్యలో ఫొటోలు అయిపోయినా, చిరునవ్వులు చిందిస్తూనే ఉన్నారు.

ఇక ఆయనకు చిన్న కత్తెర అందించి, పుస్తకాల పేకెట్ పైనున్న రిబ్బను కత్తిరింపజేసి, ఓపెన్‌చేసి, పై పుస్తకం తీసి ఆయన కిచ్చాను. ఆయన కళ్ళజోడు సరిజేసుకుని, పుస్తకం ముందు, వెనుక త్రిప్పిచూసి 'ఏవిటీ?' అన్నట్టు ముఖం పెట్టారు.

ఈలోపున అక్కడున్న పెద్దవాళ్ళందరికీ పుస్తకం కాపీలు అందించారు మా మిత్రులు. అందరి ముఖాల్లో ఆనందం! 'తాతయ్య పుస్తకం' – పిల్లల ఆశ్చర్యం! 'తాతయ్య–నానమ్మ ఫొటో' – మనవరాళ్ళ కేరింతలు. ఒక రకమైన పండుగ సందడి అక్కడ హోరెత్తింది.

'మీరు రాసిన కవితలు – మా సాహితీ మిత్రులంతా అనుకుని పుస్తకం వేయించాం!' అంటూ మా సాహితీ మిత్రులు ఒక్కొక్కర్నీ వెంకట్రామయ్య మాస్టారికి పరిచయం చేశాను.

మాస్టారు అందర్నీ పరికించి చూశారు. మాస్టారి భార్య సిగ్గుపడుతూనే అలా ఒదిగి కూర్చున్నారు. అందరి పరిచయాలయ్యాక, కళ్ళజోడు సవరించుకున్న మాస్టారు పుస్తకంపై దృష్టి పెట్టారు. తల పైకెత్తి మావంక చూసి చిరునవ్వు నవ్వారు. మళ్ళీ పుస్తకంలో పేజీలు తిరగేస్తుండిపోయారు. కుటుంబ సభ్యులంతా వాళ్ళకిచ్చిన పుస్తకాల్లో పేజీలు తిరగేస్తూ గుసగుసలాడుకుంటున్నారు.

'పుస్తకం ఎలా ఉంది మాస్టారు?' మా మిత్రుడడిగాడు.

ఆయన మళ్ళీ తలపైకెత్తి చూసారు. కళ్ళజోడు వెనుకగా కళ్ళల్లో నీళ్ళు ఉబికి వస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. పెదిమలు ఒణుకుతున్నాయి. ముఖం ఆనందంతో విప్పారడానికి ప్రయత్నిస్తున్నా, ముడతల వల్ల సాధ్యం కావడం లేదు. అంతా గంభీరమైన వాతావరణంలో నిశ్శబ్దమై పోయింది. అలా కొన్ని క్షణాలు గడిచాయి. అకస్మాత్తుగా ప్రక్కనే ఉన్న నన్ను పట్టుకుని కౌగిలించుకున్నారు. అప్రయత్నంగా నా చేతులు కూడా ఆయన్ని

చుట్టుముట్టాయి. నా కుడి ముంజేతిమీద బొటబొటా రెండు వెచ్చని కన్నీటిబొట్లు రాలాయి. నా మనసు ద్రవిస్తుందా అనిపించింది. అందరికీ అర్థమయింది. హాలు తప్పట్లతో మళ్ళీ మారుమ్రోగింది. నా కౌగిలి సడలింది.

కాస్సేపయ్యాక, మాస్టారు కళ్లజోడు తీసి, కండువాతో కళ్ళు తుడుచుకుంటుంటే – భార్య కూడా సహకరిస్తోంది. మళ్లీ నిశ్శబ్దం! మేం కూడా ప్రేక్షకులమైపోయాం! చివరికి మాస్టారే మౌనాన్ని ఛేదించారు.

'చిన్నప్పుడు నిన్ను 'మల్లెపూవు ప్రసాదం' అని సరదాగా పిలుస్తుండేవాడిని గుర్తుందా?

అవునన్నట్టు నవ్వుతూ చిన్నగా తలూపాను.

'ఇప్పుడు నిజంగానే 'మల్లెమనసు' ప్రసాదంగా తీసుకొచ్చావన్నమాట!' నా ముఖంలోకి సూటిగా చూస్తూ అన్నారు. గొంతు కొంచెం బొంగురుపోతోంది.



'మీ మల్లెమనసు మాకు ప్రసాదం పెడతారని వచ్చాం!' నా గుండెల్లోంచి అప్రయత్నంగా కొన్ని మాటలు బయటి కొచ్చాయి. వాటివెంటే కొన్ని చిరుతప్పట్లు.

'మంచిపని చేశావయ్యా! నేను కలలో కూడా ఊహించలేదు... నాకు అనిపించినపుడల్లా... ఏవో కొన్ని పిచ్చిమాటలు... రాయమని వీళ్ళందర్నీ ఏడిపించేవాడిని ... వాళ్ళు రాయకపోతే బాధపడేవాణ్ణి! ... వీలుపడితే ... నేనే రాసుకోవడానికి ... ప్రయత్నించేవాణ్ణి.' ఆగి ఆగి ఆయాస పడుతూ, బొంగురు పోతున్న గొంతుకతో శబ్దం అప్పుడప్పుడు ఆవిరైపోతూ, సైగలతో ఆయన చెబుతుంటే – మా అందరికీ కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

మళ్ళీ కళ్ళు తుడుచుకుని భావోద్వేగాన్ని అదుపు చేసుకుంటూ 'అసలు ఇందులో పనికొచ్చేవి ఏమన్నా ఉన్నాయా?' అంటూ కొత్త పుస్తకాన్ని పైకెత్తి చూపించారు. వాతావరణం తేలిక చేయడం కోసం ఆయన మాట మార్చారని గ్రహించాం.

'భలేవారే మాస్టారు! మీ అనుభవాల్ని, అనుభూతుల్ని జోడించి మా కందించారు. మీ కవితలు చదువుతుంటే ... మనసు హాయిగా గాల్లో తేలినట్టనిపిస్తోంది. టెన్షన్ నుండి రిలాక్స్ అవుతున్నాం!' మా సెక్రటరీ గారు తన అభిప్రాయం చెబుతూ, అంతవరకూ ఆయన భద్రంగా పట్టుకున్న పాత డైరీని కూడా తిరిగి మాస్టారికి అందించారు. ఆయన తల ఆడిస్తూ, పాత డైరీని అందుకుని ఆప్యాయంగా చేతితో నిమురుకున్నారు.

'ఆయనలో ఉన్న ఆవేదనని, ప్రతిభనీ మేం ఎవరం గుర్తించలేకపోయాం! మీరైనా గుర్తించినందుకు ధన్యవాదాలు' – మాస్టారబ్బాయి కృతజ్ఞతలు.

'మీరెవరూ గుర్తించలేకపోయినా, మీ బుడ్డూ గుర్తించాడు. ఒకసారి ఆ డైరీ చూడండి' అన్నాను నవ్వుతూ – ప్రక్కనే ఉన్న బుడ్డూ భుజాలమీద రెండు చేతులూ వేసి దగ్గరకు లాక్కుంటూ. బుడ్డూకు ఎక్కడలేని ఆత్మవిశ్వాసం వచ్చినట్లుంది. 'ఇకనుంచి తాతయ్య చెప్పేవన్నీ నేనే రాస్తా!' తన జన్మహక్కని తెలియజేశాడు. 'కాదు – నేనే రాస్తా' – వెనక నుండి కళ్యాణి కవ్వింపు. అంతా రిలాక్స్ అయ్యారు. అందరికీ స్వీట్లు అందించారు. మాస్టారి బోసినోటికి కూడా కొద్దిగా పెట్టారు.

'మాస్టారూ! మీ చేతుల మీదుగా – మీ 'మల్లెమనసు' మా కందరికీ పంచాలి!' అంటూ ఆయన చేతుల మీదుగా ఒక్కక్కరూ పుస్తకాలు అందుకునే కార్యక్రమం – ఫొటోలతో సహా పూర్తయింది.

'మిమ్మల్ని ఇబ్బంది పెట్టాం! వెళ్ళొస్తాం మాస్టారు!' బయల్దేరబోయాం.

'ఆగండి!అవన్నీ ఇటివ్వండి!' బొంగురుగొంతులో గంభీరమైన ధ్వని ఆదేశించింది.

అంతా అవాక్కయ్యాం! మాకిచ్చిన పుస్తకాలన్నీ తిరిగి ఇచ్చేయమంటూ ఆయన సైగలు. ఎందుకో తెలియకపోయినా, అందరూ ఆయన మాట కాదనలేక – తిరిగి ఇచ్చేశాం! అందరూ ముఖ ముఖాలు చూసుకున్నాం.

కుర్చీలోనే సరిచేసుకు కూర్చున్న ఆయన – కళ్ళజోడు మళ్ళీ సరిజేసుకుని, నా జేబులో పెన్ను తీసుకున్నారు. పైనున్న పుస్తకం అట్ట తెరిచారు. మొదటి పేజీపై కార్నర్‌లో – అక్షరాలు కూర్చుకుని నెమ్మదిగా సంతకం పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అప్పుడు మాకర్థమయింది. అందరం ఆనందంతో కేరింతలు కొట్టాం – అభిమానుల ఆటోగ్రాఫ్ కోసం ఎగబడుతున్న చిన్నపిల్లలయ్యాం.

అందరూ ఆయన చుట్టూమూగి, ఓపికగా నిరీక్షించాం. మాకిచ్చే అరడజను పుస్తకాల మీద సంతకాలు చెయ్యడానికి ఆయనకు సుమారు అరగంటపైనే పట్టింది. మళ్లీ ఒక్కొక్కరికే ఆయన పుస్తకాలు అందించి, భుజం తట్టి మరీ పంపించారు. ఏదో 'నిధి' దొరికినంతగా అందరూ సంబరపడ్డాం. కార్యక్రమం ముగించుకుని బయలుదేరాం!

సుమారు రెండు నెలలు గడిచాయేమో – ఒకరోజు ప్రొద్దున్నే దుర్వార్త 'రాత్రి వెంకట్రామయ్య మాస్టారు చనిపోయారట!' మిత్రుడి నుండి ఫోన్ కాల్.

కళ్ళు తుడుచుకొని, బట్టలేసుకుని బయల్దేరాను తడబడుతున్న అడుగులతో! ◆

## కవిత

# జరదేఖో

- సిరిసిల్లా గఫూర్‌శిక్షక్
9849062038



అడుగుల జాతర
బయట కదిలినప్పుడల్లా
అదే పిలుపు
మీనార్ నుండి వచ్చే
శబ్దంలా...
ఆర్తిని రంగరించుకొని
మేరా షౌహర్ నహీహై
బచ్చా బీమార్ హై సాబ్
కుచ్ మదద్ కరో
అడుగుపెట్టినప్పటి నుండి
నఖాబ్ గోడలను దాటుకుంటూ
దయార్ద్ర చూపులను
ప్రతి మనిషి ముఖంపై
అతికిస్తుందామె
ఆందోళనలన్నింటినీ
గుండెల్లో దాచి ఆమె
మసీదు ముందు
ఆశలు చావని నమ్మకంతో
విధవ ఒంటరి బతుకుకు
సాక్ష్యాన్నిస్తూ
చేతిలో ఆధారమై మెరిసే
యాచక బతుకును
తెలియజేస్తుంది
బతుకును ఇవ్వలేని కాగితం
రాజపత్రంలా మెరుస్తూ ఉంటే
కన్నీరు కాల్వలవుతుంటాయి.

చూసే ప్రతి అడుగూ ఆగేదే
ప్రతి చూపూ దయార్ద్రస్థితిని
దర్శించేదే.
మెరవని జీవితం ముందు
మెరుస్తున్న ఆ పల్లెంలో
రూపాయి బిళ్ళలెన్నో
కార్చిన కన్నీటి
బిందువులెన్నో....
ఆకాశమైన పల్లెంలో
పగటి వేళ
నక్షత్రాలు మెరుస్తాయి
వేడుకోలు లోనే ఆమె
ఆశల వేకువలు
అడుగులతో దూరమవుతుంటే
"బాబూ, జరదేఖో" అంటూ

బిగ్గర స్వరాన్ని దుఃఖంలో ముంచి
పలికే తీగలు తెగిపోతుంటే
కదలని భూమి నెత్తిపై
నింగి గిర్రున తిరుగుతూ
ఆమె నల్లటి శిలా శిల్పమవుతుంది.
ఎన్ని అడుగుల ఆగమనాలకు
స్వాగత వర్షమై కురిసింది
అస్సలాములతో
ఎన్ని హృదయాలను మేల్కొల్పింది
ఆశల వాకిల్లలో కమ్మిన
దయార్ద్ర మేఘాలను
ఎన్నింటిని కమ్ముకుంది
మీనార్ వైపుకు నడిచిన
ప్రాయం నుండి
దైవ భక్తికి సిద్ధమైనా
దీన శక్తి ముందు ఎపుడూ
ఓడిపోతూ...
పగిలిన మనసుల్లోని
గాయపడిన అక్షరాలు
కార్చిన ప్రతి కన్నీటి బిందువుకు
ప్రతిరోజూ అర్చన చేస్తూనే ఉన్నాయి
తలవంచి మౌనంగా....

ప్రస్థానం వెబ్‌సైట్: www. prasthanam.com

**'ప్రస్థానం' కు చందా కట్టండి !**
**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి !!**

అయిదేళ్లకు : రు. 500 /-
పదేళ్లకు : రు. 1000/-
సంవత్సర చందా (వ్యక్తులకు) : రు. 120/-
సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-
విడి ప్రతి : రు. 10/-

5,10 సం॥ల చందా కట్టిన వారికి విలువైన పాత ప్రస్థానం పుస్తకాలు ఉచితం.
- ట్రాన్స్‌పోర్టు చార్జీలు అదనం

ఒక మంచి పత్రికకు చందా కట్టండి! - తెలుగు సాహిత్య కృషిని ప్రోత్సహించండి !!

ప్రస్థానం

ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, ఆజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20
వివరాలకు: 040॥27660013, సెల్ : 9490099059 ఇ-మెయిల్ : ssprasthanam_@gmail.com ; www. prasthanam.com



## నచ్చిన రచన




# వెన్నెల మలుపులు - చీకటి వెలుగులు

- జి. గోపాల కృష్ణ
9290146187

ఈ కథా సంపుటి రచయిత మాల్యశ్రీ గత అనేక సంవత్సరాలుగా సాహితీరంగంలో వుండటమే కాకుండా సాహితీ స్రవంతి భద్రాచలం శాఖలో చాలాకాలంగా నాయకత్వంలో కొనసాగుతున్నారు. ఈ ప్రాంతంలోని అనేక సాహితీ కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. దృశ్యమాధ్యమం ఎక్కువగా బలపడిన ఈ రోజుల్లో ఇది చాలా కష్టసాధ్యమైన పని. ఏడు పదులవయస్సులో కూడా సాహితీ సేవను వదులుకోకపోవడం సాహిత్యం పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం. విద్యావకాశాలు లేని మన్యం ప్రాంతం చర్ల వీరి జన్మస్థలం, సాహితీస్పర్శలేని రైతుకుటుంబంలో వీరి జననం. అయినా వీరికున్న సాహిత్యాభిమానం, సారస్వత దీక్ష అపారం.

''వెన్నెల మలుపులు - చీకటి వెలుగులు'' కథాసంపుటిని పరిశీలిస్తే మానవ జీవితంలోని అన్ని అనుభూతులను వొడిసి పట్టగల వీరినైశిత్యానికి అబ్బురం కలుగుతుంది. గతంలో వీరు రచించిన అన్ని ప్రక్రియల్లోనూ, రామదాసువంటి భక్తి రస ప్రధానమైన కథను పద్యకావ్యంగా మలిచినా వీరు అభ్యుదయ పంథాను వీడక పోవడం వీరి ప్రత్యేకత. ఇది ఈ కథా సంపుటి మరోసారి ధృవీకరిస్తుంది.

ఈ కథాసంపుటిలో మొత్తం 12 కథలున్నాయి. ఇవి 1985 నుండీ 2002 వరకూ వీటి రచనాకాలంగా వున్నది. అంటే భారతదేశం ఆర్థిక విధానాలలో మార్పువైపు అడుగులు వేస్తున్న దశనుండీ నూతన ఆర్థిక విధానాల పర్యవసానాలను అనుభవిస్తున్న ఈనాటి వరకూ అన్నమాట. ఈ 12 కథల్నీ సౌలభ్యంకోసం విషయాన్ని బట్టి ఆరు విభాగాలుగా వర్గీకరించడం జరిగింది. 1) అభ్యుదయ కథలు -వెన్నెల మలుపులు, నెత్తుటి పిడికిలి, కూటికోసం కోటి విద్యలు, జోగుపడుచు అనే నాలుగు కథలు ఈ విభాగంలోకి వస్తాయి. 2) స్వార్థం మోసం కథలు - పవిత్ర సంకల్పం, పర్యవసానం అనే రెండు కథలూ ఈ విభాగంలోకి ఒదుగుతాయి. 3) ప్రేమకథ - గుండెలు గునపాలు, 4) అమలినశృంగారం కథ - ఓ సీత కథ రకానికి ఒకటిగా వస్తాయి. 5) అరుదైన కథలు- వస్తువురీత్యా ప్రత్యేకంగా వున్న వర్ణ చిత్రం, కుక్కపిల్ల కథలను చేరుతాయి. 6) నేటికథలు - ఈ వర్గంలో చీకటి వెలుగులు, సజీవ శిల్పాలు కథలను చేర్చవచ్చు.

'వెన్నెల మలుపులు కథ నాటుదారివెంట ఒంకలొంకలు తిరుగుతూ ఎడ్ల బండి ముందుకు సాగడంతో మొదలవుతుంది. ఎడ్లబండి ప్రయాణ అనుభవాన్ని, అందునా రాత్రిపూట వెన్నెల్లో ప్రయాణాన్ని కళ్ళకు కడుతూ చిత్రమైన అనుభూతిని కలిగించే ఈ కథ చక్కని ముగింపుతో హాయిగొలుపుతుంది

క్లుప్తంగా శ్యామల అనే అమ్మాయి వివాహిత. కానీ కట్నం సమస్యతో కాపురానికి భర్త తీసుకెళ్ళడు. తరువాత వేరే అమ్మాయితో అతని పెళ్ళి జరగడం దుబాయ్ వెళ్ళడం, అక్కడే చనిపోవడం జరుగుతుంది. మంగళసూత్రం తీయాలో వద్దో తెలియని స్థితిలో అలాగే వుంచుకుంటుంది. కానీ ఉత్తముడైన శౌరిని ఇష్టపడుతుంది. అదే ఆమె జీవితంలోని వెన్నెల మలుపు. ఊరెళ్ళిన తరువాత ఉత్తరం వ్రాస్తుంది. ఉత్తరం చదివిన శౌరి వెంటనే ఆమెను పెండ్లి చేసుకునే నిర్ణయం తీసుకుంటాడు.



ఈ కథలో శిల్పం అద్భుతంగా పండింది. “నాటుదారివెంట ఒంకలొంకలు తిరుగుతూ ఎడ్ల బండి ముందుకు సాగిపోతుంది, యవ్వనవతి గుండెలోని నిగూఢమైన కోర్కెలా”, “మోడువారిన చెట్లు వెన్నెల ప్రియుని కౌగిలింతలో పరవశించి పోతున్నాయి”, “స్త్రీ హృదయ మార్దవంలా రెపరెపలాడుతున్న చల్లనిగాలి”, “బండి కుదుపులతో అల్లడితల్లడవుతోంది మనసులు కలవని దంపతుల్లా”, “బండిలో సగం వెన్నెల సగం చీకటి – ఇలా ఎన్నో వర్ణనలు శ్యామల, శౌరిల మనోభావాలు చెప్పకనే చెబుతూ కథకు సంబంధించిన మూడ్‌లోకి తీసుకెల్తాయి. ఈ కథలోని రెండు ప్రయోగాలు ‘ఒంకఒంకలు తిరుగుతూ’ సగం వెన్నెల సగం తడికచీకటి’ తెలంగాణా ముఖ్యంగా భద్రాచలం డివిజన్‌లోని చర్ల, వెంకటాపురం, వాజేడు ప్రాంతాల్లో సామాన్యజనం ఎక్కువగా ఉపయోగించే పదాలు. ఇతర ప్రాంతాల్లో ఎక్కువగా వినపడవు.

‘నెత్తుటి పిడికిలి’ రచయిత తొలికథ. 1985 లో వ్రాసారు. చాలా సరళమైన అన్యాయంపై తిరగబడే కథ. చిన్ని గిరిజనుడు. తండ్రి చావుబతుకుల మధ్య వుంటాడు. పెద్దకొడుకు లింగడిని చూడాలనుకుంటాడు. అన్న భూస్వామి వద్ద మిర్చి గ్రేడింగ్ చేస్తుంటాడు. అన్నను తీసుకురావడానికి చిన్ని పరిగెడతాడు. భూస్వామి తన పనికే ప్రాధాన్యత ఇచ్చి అన్నను పంపకపోగా గిరిజన యువకుని పేదరికాన్ని ఆ వర్గానికి ఉన్న సహజ అహంకారంతో “చస్తే పీడా వదులుతుంది. మిమ్మల్ని మీరు పోషించుకోలేరు త్రాగడానికి గంజుండదు గానీ తెగ నీల్గుడు” .అని ఎద్దేవా చేస్తాడు. కామందును కొట్టి అన్నను తీసుకుపోతాడు చిన్ని. ఈ కథలో రచయిత దాదాపుగా కూలీలు మాట్లాడే భాషనే వాడారు. నిజానికి గిరిజనులు తెలుగు మాట్లాడటం ప్రత్యేమైన యాసలో వుంటుంది. అది గనక వ్రాస్తే పాఠకులకు అర్థం కాదనుకున్నారేమో అందుకే తనకు ఆ భాషతో పరిచయమున్నా వ్రాయలేదు. మరొకటేమిటంటే గిరిజన బాలురుగానీ బాలికలుగానీ గిరిజనేతరులతో ఎక్కువ మాట్లాడరు భాషతో కలిగే ఇబ్బంది వలన. కానీ చేయాలనుకున్నది మౌనంగా చేసేస్తారు. చిన్నితో అన్ని మాటలు మాట్లాడించడం కాస్త ఔచిత్య భంగంగా అనిపిస్తుంది. భూస్వామిని ఎదిరించడం వల్ల కలిగే ఇబ్బందులను ఊహించలేని అమాయకత్వం వయసు, పరిస్థితుల ఒత్తిడి వల్ల చిన్ని భూస్వామిని కొట్టినా సహజంగానే అనిపిస్తుంది ఈ కథలో.

ఈ కోవలోని తరువాతి కథ ‘కూటికోసం కోటివిద్యలు’ తెలంగాణా మాండలీకంలో వ్రాసిన కథ ఇది. మూఢనమ్మకాల వల్ల ఉండే రెండు రకాల నష్టాలను రచయిత అత్యంత ప్రతిభావంతంగా చెబుతారు. ఆంధ్రప్రదేశ్ లోని అనేక ప్రాంతాల్లో సంవత్సరానికి ఒకసారైనా పునరావృతం అయ్యే ఈ కథ ప్రజల్లోని అవిద్య, మూఢనమ్మకాలు పోయి, శాస్త్రీయ దృక్పథం ఏర్పడేదాకా కాలదోషం పట్టని కథ ‘కూటికోసం కోటి విద్యలు’.

‘జోగుపడుచు’ – జోగిని సైదమ్మ తనకూతురు పుష్పను జోగినిగా మార్చకుండా పెండ్లి చేయాలనుకుంటున్నందుకు ఊరిదొర ఉపేంద్రయ్య ఉగ్రరూపం ప్రదర్శించడంతో కథ మొదలవుతుంది. ఈ కథలో కొన్ని తెలంగాణా జిల్లాల్లోని జోగినీ లేదా దేవదాసీ వ్యవస్థ తాలూకూ విషస్వరూపాన్ని పాఠకులకు స్పష్టం చేస్తారు రచయిత. యుక్తియుక్తంగా ఔచిత్యం దెబ్బతినకుండా జోగినీ వ్యవస్థకు సంబంధించిన సమాచారాన్ని మెత్తంగా రచయిత పాఠకులకు తెలియజేస్తారు. జోగినీ వ్యవస్థకు బలయ్యేది ఎక్కువభాగం బడుగు, నిమ్న జాతి వారనే సత్యాన్ని కళ్ళకు కడతారు. శంకర్ అనే యువకుడు ఊరందరి ముందు బహిరంగంగా పుష్పను పరిణయ మాడటంతో కథ సుఖాంతం అవుతుంది. పరిణతి చెందిన తిరుగుబాటు ప్రకటితమవుతుంది కథలో.

‘పవిత్ర సంకల్పం’, ‘పర్యవసానం’ – ఈ రెండు కథల్లోనూ కుహానా ఉద్యమకారులు, కుహానా రాజకీయనాయకులు తమ స్వార్థం కోసం ఎలాంటి నాటకాలు ఆడతారో ప్రజల్ని ఎలా నమ్మించి తప్పుదోవ పట్టిస్తారో తెలియజెప్పే కథలివి.

‘గుండెలు గునపాలు’ ఈ సంపుటిలో గల విషాదాంతపు ప్రేమకథ. బంజారా తండా నాయకుని కూతురు బిజిలీ, వీధిభాగవతుల బృందంలోని కుర్రాడు రాందాసుకీ మధ్య నడచిన ప్రేమకథ. అభిమాన నటుడు రాందాసు ఇచ్చే అన్ని ప్రదర్శనలకూ హాజరవుతుంది బిజిలీ. రాను రానూ రాందాసుకు ప్రేక్షకుల ప్రశంసలకన్నా బిజిలీ ఆరాధనా పూర్వక

దృక్కులే ముఖ్యమైనాయి. పెండ్లి చేద్దామని నిర్ణయిస్తారు. గుడివద్దకు వెళ్ళిన వాళ్ళిద్దరినీ బిజిలీపై ఆశపడ్డ వాళ్ళు గునపాలతో పొడిచి చంపేస్తారు.

ఈ కథలో తొలిప్రేమలో ఉండే ఆకర్షణ అత్యంత సహజంగానూ బలంగానూ వ్యక్తం చేస్తాడు రచయిత. రాందాసు బిజిలీగురించి ఆలోచిస్తున్నప్పుడే బిజిలీ అతనికి తారసపడటం, వారిద్దరి మధ్య జరిగే అత్యంత సహజమైన సంభాషణలు ఎవరికైనా తొలివలపుల్ని స్ఫురణకు తెస్తాయి. రాందాసు ఇక నేను వెళ్ళాలి అన్నప్పుడు "అప్పుడే వెళ్ళిపోవాల్నా" అన్న బిజిలీ పలుకు గుండెను తాకుతుంది. ఇద్దరినీ చంపేసినప్పుడు 'తెల్లని వెన్నెల ఆ పడుచు జంట పవిత్ర రక్తంతో జేవిరించి పోయిందని వర్ణిస్తాడు రచయిత.



'ఓ సీత కథ'– శారీరకమైన కలయిక గానీ అటువంటి భావంగానీ లేకుండా స్త్రీపురుషుల మధ్య స్నేహానికి మించిన సాన్నిహిత్యాన్ని అమలిన శృంగారం అనవచ్చు. ముఖ్యంగా ఒకే చోట పనిచేస్తున్న స్త్రీపురుషుల మధ్య ఇటువంటి భావం ఏర్పడే అవకాశం వున్నది. అటువంటి అరుదైన కథావస్తువును ఎంచుకోవడం మాల్యశ్రీగారి వైవిధ్యభరితమైన జ్ఞానసముపార్జనకు నిదర్శనం.

"లతగారు మిమ్మల్ని అడగమని చెప్పమన్నారు" అన్నాడు గోపి అనడంతో కథ మొదలవుతుంది. మాల్యశ్రీ గారు చిన్నకథ లేక కథానిక వ్రాయడంలోని మెలుకువలు గురజాడ నుంచి గ్రహించారనేది స్పష్టం అవుతుంది. ఈ సంపుటి లోని అన్ని కథలూ చిన్న సంఘటనతోనో, సంభాషణతోనో మొదలవుతాయి.

ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సీతాలతతో అతను తరచూ తారసపడటం, అభిమానం పెంచుకోవడం జరుగుతుంది. కొన్నాళ్ళకు ఎవరిదారిన వారు విడిపోయారు. అయితే ఈ కథలో ఒకరికొకరు సహాయం చేసుకోగలిగిన ఒక బలమైన సంఘటన వుంటే కథ మరింత రక్తి కట్టేది. అయినా ఈ బంధాన్ని ఇతరులు అర్థం చేసుకోవడమూ కష్టమే అపార్థం చేసుకోకుండా వుండటమూ కష్టమే. అందుకే గోపి "అంతేనంటారా" ఇంకేం లేదా అనే భావంతో అడుగుతాడు. ఇటువంటి సందర్భాలు ఎక్కువమంది స్త్రీపురుషులు పనిచేసే ప్రతీ కార్యాలయంలోనూ ఉంటాయి. దీన్ని ప్రత్యేకంగా కార్పొరేట్ భాషలో ఆఫీస్ స్పౌస్ అనే పదంకూడా పుట్టడం విశేషం. ఏది ఏమైనా మహాత్ముని జీవితంలో కూడా ఇటువంటి సందర్భం వచ్చిందంటే అమలిన శృంగారం యొక్క తీవ్రతను మనం అర్థం చేసుకోవచ్చు.

'వర్ణచిత్రం'– ఇది అరుదైన కథావస్తువు. వర్ణచిత్రం రచయిత మహేంద్రకు ఎడిటర్ నుండి మీ కథ విక్రాంత్ కథ వెన్నెల నృత్యం కథకు కాపీకథ అంటూ సంజాయిషీ కోరుతూ ఒక లేఖ వస్తుంది. దీనికి పాఠకుని ఉత్తరం కూడా జతచేయబడటం అతనికి తీవ్ర విచారాన్ని కలుగు జేస్తుంది. ఏజెన్సీ ప్రాంత స్వగ్రామానికి సెలవులకు వచ్చిన అశ్విని అనే అమ్మాయిని, ఆమె చలాకీ తనాన్ని మరచిపోలేక ఒక కథను వర్ణచిత్రం పేరుతో వ్రాస్తాడు మహేంద్ర. ఇది కాపీ కథెలా అవుతుందో అతనికి అర్థం కాదు. మరొక రచయిత విక్రాంత్ వ్రాసిన ఉత్తరంతో సస్పెన్స్ విడిపోతుంది. విక్రాంత్ కూడా మహేంద్ర నివశించిన ప్రదేశంలోనే ఉండాల్సిరావడం, అదే అమ్మాయిని చూడ తటస్తించడంతో వర్ణనలు పేర్లు ఆమె కుటుంబ నేపథ్యం ఒకేలా ఉండటం జరిగిందని తెలియజేస్తారు. రచయిత విక్రాంత్ అన్నట్లు గా ఇదొక ఆసక్తికరమైన, అరుదైన సంఘటన, అద్భుతమైన కల్పన. ఇటువంటి వస్తువులు సాహితీ ప్రపంచంలో అరుదుగానే తొంగిచూస్తాయి.

సజీవశిల్పాల్లోని వస్తువు కొత్తది. శ్రీశైలంలో రాళ్ళమీద పేర్లుచెక్కే వృత్తిలో వున్నవారిని పరిచయం చేస్తాడు రచయిత మాల్యశ్రీ. భవిష్యత్తు మీద ఆశతో పెద్దచదువులు చదువుతూ సరైన వుద్యోగం దొరకక రాళ్ళమీద పేరుచెక్కే వృత్తిని స్వీకరించడం తద్వారా తమ జీవన శిల్పాన్ని తామే చెక్కుకోబూనడం ఈ నాటి ప్రపంచంలో వున్న తీవ్ర అసమానతలను మరోసారి గుర్తుచేస్తుంది. ప్రపంచంలో కొంత మంది అంతులేని సంపదలతో తులతూగడం, సాటివారిని దోపిడీ చేయడం మరికొందరు అమాయకత్వానికి నీతి, నిజాయితీ అనే పేర్లు పెట్టుకొని దయనీయ దోపిడీకి గురికావడం ఈ రెండు కథల్లో సున్నితంగా చెబుతారు రచయిత.

తన పన్నెండు కథల్లో కూడా సూటిగా ఏంచేయాలో చెప్పింది తన తొలికథ నెత్తుటి పిడికిలి లోనే. మిగతా అన్ని చోట్ల రచయితగా తన బాధ్యత ఎంతవరకో అంత వరకే చొరవతీసుకుంటారు. విషయాన్ని మాత్రం ప్రభావవంతంగా వెల్లడి చేస్తారు. నిర్ణయం పాఠకునికే వదిలి వేస్తారు.

ప్రస్తుత సమయం మరిన్ని వైవిధ్య భరితమైన కథావస్తువులకు మానవీయ సౌరభాన్ని జోడించి కథావ్యాసంగాన్ని కొనసాగించాలని మరిన్ని వెన్నెల మలుపుల అనుభవాలను పాఠకులకు అందించాలని కోరుకోవడం లో అత్యాశ ఏమీ లేదు. ◆



# తెలుగుభాషా వికాసానికి విశాల దృష్టి

- తెలకపల్లి రవి

*ఇన్ని కోట్ల మంది మాట్లాడే భాషకు ఎన్నటికీ ప్రమాదం వుండదని మరికొందరి వాదన. ఇంగ్లీషు మీడియం వల్లనే అభివృద్ధి చెందుతామని కొందరు బలంగా వాదిస్తుంటే పద్యాలు శ్లోకాలతో సహా ప్రాచీన వారసత్వాన్ని ముందుకు తీసుకురావడం పరిష్కారమని మరికొందరి భావన. ఇందులో ఏదీ సమగ్రమైంది కాదు. సాంకేతికంగా యునెస్కో నివేదిక ఎలా వున్నా తెలుగు భాష అసలు వుండకుండా పోవడమనే సమస్య ఉత్పన్నం కాకపోవచ్చు. కాని దాని సంపూర్ణ వికాసం సాధించాలంటే మాత్రం ప్రత్యేక కృషి అవసరం.*

ప్రపంచ తెలుగు రచయితల మూడవ మహాసభలు విజయవాడలో జరిగాయి. రెండు రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాత పెద్ద ఎత్తున జరిగిన సభలు గనక ఆ నేపథ్యం కొంత ప్రత్యేకత తెచ్చి పెట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి విస్తృతం గానూ దేశంలోని ఇతర రాష్ట్రాలే గాక అమెరికా బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్ వంటి చోట్ల నుంచి కూడా కొంతమంది ప్రతినిధులు తరలి వచ్చారు. ప్రారంభ సమావేశాల్లోనూ వివిధ చర్చాగోష్టుల్లోనూ ముందుకొచ్చిన విషయాలన్నీ తెలుగు భాషావికాసం ఎలా జరగాలి, పాలనా రంగంలోనూ విద్యా రంగంలోనూ ఇంకా ఇతరేతరంగా కూడా తెలుగును అభివృద్ధి చేసుకోవడంతో పాటు దైనందిన జీవితంలో అనవసరంగా ఇంగ్లీషు వ్యామోహానికి గురయ్యే పరిస్థితిని ఎలా నివారించాలన్నది ప్రధానాంశంగా వచ్చింది.

ఈ సభలలోనే గాక ఇతరత్రా కూడా తెలుగు భాషా పరిరక్షణ అన్నది చర్చనీయాంశంగా వుంటూనే వుంది. మమ్మీ డాడీ పిలుపులు ఇంగ్లీషు మీడియం చదువుల వల్ల తెలుగు దెబ్బతినిపోతుందనేది ఒక బలమైన అభిప్రాయం. యునెస్కో నివేదిక ప్రకారం తెలుగు కూడా ప్రమాద భాషల్లో ఒకటిగా వుందనేది మరో అభిప్రాయం . ఇన్ని కోట్ల మంది మాట్లాడే భాషకు ఎన్నటికీ ప్రమాదం వుండదని మరికొందరి వాదన. ఇంగ్లీషు మీడియం వల్లనే అభివృద్ధి చెందుతామని కొందరు బలంగా వాదిస్తుంటే పద్యాలు శ్లోకాలతో సహా ప్రాచీన వారసత్వాన్ని ముందుకు తీసుకురావడం పరిష్కారమని మరికొందరి భావన. ఇందులో ఏదీ సమగ్రమైంది కాదు. సాంకేతికంగా యునెస్కో నివేదిక ఎలా వున్నా తెలుగు భాష అసలు వుండకుండా పోవడమనే సమస్య ఉత్పన్నం కాకపోవచ్చు. కాని దాని సంపూర్ణ వికాసం సాధించాలంటే మాత్రం ప్రత్యేక కృషి అవసరం. దేశానికి స్వాతంత్రం వచ్చిన ఇన్నేళ్ల తర్వాత-భాషా ప్రయుక్త రాష్ట్రాన్ని సాధించుకుని ఆ పైన రెండుగా విడిపోయిన తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సమస్య వుందంటే పాలకులు అనుసరించిన లోపభూయిష్ట విధానాలే కారణం. అధికార భాషా సంఘాలు, తెలుగు అకాడమీలు, భాష కోసమే విశ్వ విద్యాలయం, ఇతర విద్యాసంస్థలూ ఏటా ఎన్నెన్నో పిహెచ్‌డి పరిశోధనలూ ఇన్ని తతంగాలున్నా తెలుగు భాషా వికాసం అసంతృప్తికరంగా వుందంటే అందుకు కారణాలు అనేకం. కాని అన్నిటిలోకి ప్రధానమైంది పాలకుల నిర్లక్ష్యమే.

తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వులు వెలువరించాలనీ పాలనా భాషగా అన్ని స్థాయిల్లోనూ తెలుగునే అమలు చేయాలని డజన్ల సార్లు నిర్ణయాలు ప్రకటించినా ఇంత వరకూ అమలులోకి తీసుకురాలేదు. ఆ విధంగా ఇంగ్లీషు రాని ప్రజలకు సమాచార లోపం పెను శాపంగా తయారై దళారీలను పెంచింది. స్వార్థపర వర్గాలు చట్టాలతో ఆడుకునే అవకాశం దక్కింది. కోర్టుల విచారణ, సాక్ష్యాలు నమోదు, తీర్పులు అన్నీ

ఇంగ్లీషులోనే వుండటం వల్ల సామాన్యులకు న్యాయ పోరాటం సుదూరంగానే వుండిపోయింది. బోర్డులు, సూచికలు చాలా చోట్ల ఇంగ్లీషులో తప్ప తెలుగులో వుండవు గనక సగానికి పైగా జనాభా ఇతరుల పైన ఆధారపడవలసిన స్థితి. ఇదంతా ప్రజలకు పాలనను దగ్గర చేయాలన్న సంకల్పం లేని ఫలితమే. తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలు ఈ విషయంలో మనకన్నా మెరుగ్గా వుంటాయి గాని మౌలికంగా ఇంగ్లీషు ప్రాబల్యంలో పెద్ద తేడా వుండదు.

అయిదారేళ్ల కిందట తెలుగుకు ప్రాచీన హోదా విషయమై పెద్ద ఉద్యమం నడిచింది. ఆ సమయంలో తమిళు ల భాషాభిమానం మనకు లేదని కొన్ని వర్గాలు అదేపనిగా ప్రచారం చేశాయి. అంతేగాక పాతకాలపు రాజులనూ రాజరికాలను ముందుకు తెచ్చి ఆ వైభవాన్ని పునరుద్ధరించాలనే రీతిలో మాట్లాడారు. (ఇప్పుడు విజయవాడలో సభా ప్రాంగణానికి కూడా విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టారు.) తమిళుల నుంచి భాషాభిమానం నేర్చుకోవచ్చు గాని విచక్షణా రహితమైన దురభిమానం ఎవరి నుంచి నేర్చుకోనవసరం లేదు. ఏ భాష గొప్పతనం దానిది. అయితే మన చాందసులు చాలా కాలం తెలుగులో రాయడం మాట్లాడ్డం నామోషీగా భావించేవారని శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వంటి వారు రాశారు. తెలుగును ప్రజల భాషగా చేయడానికి గిడుగు గురజాడ వంటి వారు పెద్ద వ్యవహారిక భాషోద్యమం నడపాల్సి వచ్చింది. ఆ పైన కమ్యూనిస్టుల నేతృత్వంలో అభ్యుదయ రచయితలు ప్రజా నాట్యమండలి వంటివి తెలుగు భాషను ప్రజల భాషగా మలచడంలో గొప్ప పాత్ర పోషించాయి.. మరీ ముఖ్యంగా విద్యా బోధనలోనూ పత్రికా రంగంలోనూ గ్రాంధిక ధోరణులను తోసిపుచ్చకపోతే తెలుగు జీవద్భాషగా పెరిగేది కాదు. కనుక తెలుగు భాషా వికాసం ప్రజాస్వామిక పురోగామి దృక్పథంతో తప్ప వెనకచూపుతో పాత భావాల పదాల పునరుద్ధరణతో జరిగేది కాదు.

ఇంగ్లీషు ఆధిపత్యం విద్యలోనూ నిత్య వ్యవహారా లలోనూ ఏ మేరకు అనుమతించాలంటే అవసరమైన మేరకు మాత్రమే,. ప్రాథమిక విద్య మాతృభాషలోనే వుండాలన్నది ఆదర్శప్రాయసూత్రమైనా ఇప్పుడు ప్రైవేటు కార్పొరేటు స్కూళ్ల పోటీలో అది అసాధ్యంగా పరిణమించింది. ప్రాథమిక స్తాయిలో తెలుగును కూడా ఒక బోధనాంశంగా తప్పక వుండాలనేది కనీస నియమంగా చేయాలి. అది పాటించిన సంస్థలకు అనుమతి నిరాకరించాలి. ఇంగ్లీషు మీడియంలో పదేళ్లు చదివిన పిల్లలపై సర్వే జరపగా వారిలో 64 శాతం మందికి భాష పట్ల సరైన అవగాహన లేదని తేలింది. అందులోనూ ఉచ్చారణకు సంబంధించి మాతృభాష తరహాలో ఇంగ్లీషు మాట్లాడాలని ఆశించడం శాసించడం చాలా తప్పని భాషా వేత్తలే చెబుతున్నారు. అయితే ప్రపంచ ఆర్థిక రాజకీయ సాంస్కృతికాధిపత్యాలు ఇంగ్లీషులో నడుస్తున్నాయి గనక (క్రాస్టో మాటల్లో చెప్పాలంటే ఇంకా డాలర్, ఇంటర్‌నెట్, హాలివుడ్ కూడా ఈ జాబితాలోకి వచ్చేవే) ఇంగ్లీషు నేర్చుకోవడం తప్పని సరి. అయితే ఆ పరిజ్ఞానాన్ని తెలుగులోకీ తెచ్చుకోవడం కోసం ప్రణాళికా బద్దమైన నిరంతర కృషి కూడా వుండాలి. చైనా జపాన్‌లు ఆ పని జయప్రదంగా చేశాయి. భారతదేశంలో తెలుగే గాక ఇతర భాషలు కూడా వెనకబడుతున్నాయి. ఇంటర్నెట్‌ను అంతర్జాలం అనడం వంటివి సరైనవో కాదో కాలపరీక్షకు నిలవడాన్నిబట్టి తేలుతుంది. కాని చరవాణి వంటి కృత్రిమ ప్రయోగాలు నిలవవు.ఇన్నేళ్ల తర్వాత కూడా స్కూలు లేదా బడి అనే పదాలు తప్ప పాఠశాల, వైద్యశాల, కళాశాల, కార్యాలయం వంటి పదాలే ఎవరూ వాడటం లేదు. ఈ సభల్లో జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నట్టు కేవలం సాహిత్య సృజనకు భాషను ఉపయోగించడంతోనే అభివృద్ధి జరగదు. సాహిత్యేతర అవసరాలను ఏ మేరకు అందుకోగలుగుతుంది ఆ విజ్ఞానం భాషలో ఏ మేరకు అందుబాటులో వుందనే దానిపైనే భాషా వికాసం ఆధారపడి వుంటుంది. దేశ దేశాల మధ్య రాకపోకలు కంప్యూటర్ యుగంలో విజ్ఞానాభివృద్ధి జరిగాక ఇంగ్లీషు వాడకం అనివార్యంగా పెరుగుతుందనే వాస్తవాన్ని అంగీకరించవచ్చు. కాని అన్నాన్ని రైస్ అనీ ఉప్పును సాల్ట్ అని అనాల్సిన పనిలేదు. టీవీ మీడియాలో అప్పటికప్పుడు చెప్పాలి గనక ఇంగ్లీషు పదాలుకొన్ని తప్పనిసరిగా దొర్లినా అవే ఆకర్షణ అనుకోనవసరసం లేదు. మొత్తం మీడియా మరోసారి సమానార్థక పదాల కోసం కృషి ముమ్మరం చేయాలి.

రెండు తెలుగు రాష్ట్రాలైనప్పటికీ 56(లేదా51) తెలుగు అక్షరాలు విడిపోయే ప్రసక్తి లేదు. ఇరు వైపులా వున్న కళా సాహిత్యాలలో ఉమ్మడి అభిరుచులే వున్నాయి. భాష పరమైన వెనకబాటులోనూ పెద్ద తేడా లేదు. కనుక రెండు చోట్లా ప్రభుత్వాలు తెలుగుభాషా వికాసానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టి కేటాయింపులు చేయాలి. ఎందుకంటే మాతృభాషాభివృద్ధి మనుషుల ప్రాథమిక హక్కు. ప్రజాస్వామిక అవసరం. వెంటబడి తెచ్చుకున్న ప్రాచీన భాష వంద కోట్ల రూపాయలు ఏ వ్యవస్థద్వారా ఎలా ఖర్చుచేయాలనేదానిపైనా ఇంత వరకూ స్పష్టత లేక ఉపయోగించుకోలేకపోతున్నాము. దాన్ని సద్వినియోగం చేసుకునే మార్గాలు వెతకాలి. ప్రాచీనతా పునరుద్దరణ గాక ఆధునికాభివృద్ధి దిశగా అడుగులు వేయాలి. సామాజిక దొంతరల ఈ సమాజంలో అన్ని తరగతుల అవసరాలనూ దృష్టిలో పెట్టుకోవడం కూడా ముఖ్యమే. వత్తులూ పొల్లులూ మాత్రమే భాష అనుకోకూడదు. ఇంగ్లీషు మీడియం ప్రభావం వల్ల యువత గాని మరెవరు గాని తెలుగులో కాస్త ఇబ్బంది పడితే తక్కువనుకోకూడదు. అందరికీ భాషా సౌందర్యం సదుపాయం తెలిపే మార్గాలు వెతకాలి. ఉద్యోగావకాశాలతో ఉన్నత జీవిత ఆకాంక్షతో భాషకు వున్న బంధాన్ని గుర్తించి తెలుగు చదివినా అవకాశలకు లోటుండదనే నమ్మకం కలిగించాలి. ఆ విధమైన సమగ్ర దృష్టితో నిరంతర కృషితో మాత్రమే తెలుగు భాషా వికాసం సాధించగలమని విజయవాడ సభలు విదితం చేస్తున్నాయి. ◆

## స్పందన



# ఫిబ్రవరి ప్రస్థానంలో కథలు - ఒక సమీక్ష


**కె. ఆనందాచారి**

**9948787660**


***సమాజాన్ని, సమూహాల్ని, వారి జీవితాల్ని ఏ శక్తి డ్రైవ్ చేస్తుందో తెలిసిన రచయిత నుండి ఇలాంటి పరిష్కారాన్ని కానీ, ఇలాంటి స్వప్నాల్ని కానీ పాఠకుడు చూడలేదు. ఎందుకంటే అది వైయక్తిక సంస్కరణ తప్ప, సామాజిక పరిష్కారం కాదు. వ్యక్తులు మారితే వ్యవస్థ మారదు, వ్యవస్థను బట్టే వ్యక్తులు తయారవుతారు కదా! వ్యక్తుల్నే కాదు, ప్రభుత్వాల్ని, దేశాల్ని సైతం తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకుంటున్న మార్కెట్ శక్తులు ఈ చిన్న చిన్న మార్పులకు అదరరు, బెదరరు.***

సాహిత్య ప్రస్థానం ఫిబ్రవరి సంచికలో మూడు కథలున్నాయి. "రైలు వెళ్తోంది", "బండరాయి", "దింపుడు కళ్ళెం". మూడు కథలూ చదివాను. ముఖ్యంగా రైలు వెళ్తోంది కథ చదివిన తర్వాత, ఆ కథపై ఎవరితోనైనా చర్చించాలని అనిపించింది. అనుభవమున్న కథకులు అక్కినేని కుటుంబరావు. చాలా నైపుణ్యంగా ఒక సందర్భాన్ని తీసుకుని, అది కథకు ఎంతో సింబాలిక్‌గా వున్న ఒక రైలు ప్రయాణంలో అపరిచితుల మధ్య జరిగిన సంభాషణతో కథను నడిపించారు. సందర్భం, కథలోని సంఘటన, చర్చించిన తీరు చాలా చిన్నవిగానే కనపడవచ్చు. కానీ ఒక నవలంత విషయముంది అందులో లేదా ఒక వ్యవస్థకున్నంత చరిత్ర వుంది. రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలతో కూడుకున్న ఒక ఆలోచనకు, ఆలోచనల సంఘర్షణకు సంబంధించిన విషయం అందులో నాకు కనిపించింది.

అందుకే ఈ కథను ఇక్కడితో అంతా చదివేయటంతో వొదిలి పెట్టలేక రాస్తున్నాను. కథపై నాకున్న అభిప్రాయాలను. అలాగే బండరాయి కథ కూడా కదిలించే కథ. ఇక 'దింపుడు కళ్ళెం' ఒక ప్రశ్నను లేవనెత్తే కథ. మూడు భిన్నమైన కథలు.

మొదట 'రైలు వెళ్తోంది' కథను చూద్దాం. ఇద్దరు పెద్దవాళ్ళయిన భార్యాభర్తలను, ఇద్దరు పిల్లలున్న యువదంపతులు రైలు ప్రయాణంలో పరిచయమవుతారు. వారి మధ్య సంభాషణలో యువ దంపతులు సిటీ నుండి వారు చేస్తున్న ఉద్యోగాలు వొదిలేసి, వొత్తిడి, కాలుష్యం, విషపూరిత ఆహారానికి దూరముండేందుకని, స్వచ్ఛంగా, స్వేచ్ఛగా వుండేందుకని పల్లెకు వెళుతున్నారని తెలిసి ఆ వృద్ధ దంపతులు ఎంతో ఆనందిస్తారు. ఒక గొప్ప మార్పుకు శ్రీకారం చుడుతున్నందుకు సంతోషించి ఇలానే ఇంకొందరు ఇలా ఇలా పెరిగి వస్తు వ్యామోహ, రోబో సంస్కృతి నుండి మానవీయ సంస్కృతి వైపు ప్రయాణంగా చిత్రించారు కథకులు.

సంభాషణ, నరేషన్, చర్చించిన విషయాలు అన్నీ చాలా అద్భుతంగా వున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు అంటే భావితరంపై వారి మానసిక పరిస్థితులపై చదువులు ఎంత వొత్తిడి పెంచి ఎలా తయారు చేస్తున్నది, పిల్లలు చిన్నతనంలోనే ఎలాంటి అలవాట్లకు గురవుతున్నది వారి తల్లిదండ్రులు కూడా అదే వాతావరణం నుండి పెరిగి రావటం వల్ల జీవించడమంటే, అన్నీ అనుభవించడమే అనే ధోరణి పెరిగిన విషయాలను చాలా చక్కగా డీల్ చేశారు కుటుంబరావు. ప్రస్తుతం సమాజంలో వున్న వినియోగదారీతత్వం మనిషిని హృదయం లేని వాడిగా మార్చేస్తున్న అంశాన్ని, కార్పొరేట్ శక్తుల లాభాల కోసం ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్న విషయాన్ని చాలా సూటిగా స్పష్టంగా కథలో చెప్పారు. ఇందులో చర్చించిన అనేక అంశాల పట్ల రచయితకు వున్న లోతైన అవగాహన మనకు ప్రస్ఫుటమవుతుంది.

అయితే కథలో నాయకుడు చూసుకున్న పరిష్కారం పట్ల నాకు భిన్నాభిప్రాయం వుంది. కథలో ఇలా అంటారు.. "వీధిలో కెళ్తే వాతావరణ కాలుష్యం, పనిచేసే చోటా భావ కాలుష్యం, తినే తిండిలో కాలుష్యం... పిల్లల పెంపకంలో అవినీతి

కాలుష్యం... ఈ కాలుష్యాలన్నిటికీ దూరంగా ఆరోగ్యంగా తాగేనీటిలో, తినే తిండిలో, పీల్చే గాలిలో, పిల్లల బాల్యంలో, మన సమయంలో అన్నిటిలో ఆరోగ్యకర వాతావరణం సృష్టించుకోవాలి. అందర్నీ మార్చలేమని అర్థమయిపోయింది. మేమన్నా మారాలనుకున్నాం.” అని చెప్తూ మాక్కావలసిన స్వచ్ఛమైనవన్నీ మేమే సమకూర్చుకుంటాం. పాడు చేసే స్కూళ్ళ నుండి మా పిల్లల్ని రక్షించుకుని వాళ్ళకు మేమే చదువు చెప్పుకుంటాం” అని చెపుతారు.

ఊళ్ళలో కూడా నీళ్ళు, గాలి, కరెంటు సరిగా లేవన్న ప్రస్థావన చేసి అవ్వేమీ లేకుండా జీవిస్తామన్న కథానాయికుల ధృఢ నిశ్చయానికి ముగ్ధులయిపోతారు కలిసిన వృద్ధులు.

ఇంకొక ముఖ్యమైన విషయ ప్రస్తావన ఏమిటంటే “మేం సాధ్యమైనంత వరకూ ప్రభుత్వం మీదా, వారి శాఖల మీదా అధికారుల మీదా ఆధారపడకూడదను కుంటున్నాం. మా కోసం మేమే బతకాలనుకుంటున్నాం. మనకి మనం, మన పిల్లలకి మనం. మన చుట్టూ వున్న మన జనానికి మనం ఎంత ఉపయోగపడగలమో చూద్దామను కుంటున్నాం” అన్న మాటల్ని సుందర స్వప్నంగా పేర్కొనటం జరిగింది.

సమాజంలో ఒక భాగంగా జీవిస్తున్న మనం దానికి ఏ సంబంధమూ లేకుండా అసలు బ్రతకలేము. సమాజాన్ని ఇంతటి కాలుష్య సహితం చేస్తున్న వారిపై ప్రజలు సమిష్టిగా చైతన్యయుతంగా పోరాడి ఒక నవ్య నిర్మాణం కోసం ముందుకు పోవాలి. అందుకు అవసరమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యాన్ని అందరిలో కలిగించాల్సిన బాధ్యత చదువుకున్న, అవగాహన కలిగిన తరానిది.

అలా కాకుండా తనకు తాను, తనకోసం తాను బ్రతకాలని అనుకోవడంలోనే నిరపేక్షాభావం కనపడుతోంది. సమస్యలకు కారకులైన వారి జోలికి పోకుండా, జోలికి పోమని మరీ చెప్పి వెళ్ళటం సమస్యల నుండి, సమాజంనుండి పలాయనం చిత్తగించటమే అనిపించింది. “Where you go corporates, multinations follows you” కాలుష్యం ఉంటుంది. అది అనివార్యం, మనమే దానికి దూరంగా ఉండాలి. ఒకవేళ ఉండాలనుకుంటే అని చెప్పడం చైతన్యాన్ని పురికొల్పడం కానేరదు.

సమాజాన్ని, సమూహాల్ని, వారి జీవితాల్ని ఏ శక్తి డ్రైవ్ చేస్తుందో తెలిసిన రచయిత నుండి ఇలాంటి పరిష్కారాన్ని కానీ, ఇలాంటి స్వప్నాల్ని కానీ పాఠకుడు చూడలేదు. ఎందుకంటే అది వైయక్తిక సంస్కరణ తప్ప, సామాజిక పరిష్కారం కాదు. వ్యక్తులు మారితే వ్యవస్థ మారదు, వ్యవస్థను బట్టే వ్యక్తులు తయారవుతారు కదా! వ్యక్తుల్నే కాదు, ప్రభుత్వాల్ని, దేశాల్ని సైతం తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకుంటున్న మార్కెట్ శక్తులు ఈ చిన్న చిన్న మార్పులకు అదరరు, బెదరరు.

**ఆధునిక సమాజం ఇచ్చిన ఆధునిక సౌకర్యాలను, వసతులను, సాంకేతికతను అందిపుచ్చుకొంటూనే ఒక స్వచ్ఛమైన, మానవీయ సమాజాన్ని నిర్మించుకోవాలి. కానీ అన్నీ వొదిలి వెనక్కి పోవటం కాదు. టెక్నాలజీ, సౌకర్యాల వల్ల ఈ కాలుష్యం రాలేదు. లాభాల దాహోర్తుల విధ్వంసం వల్ల ఏర్పడింది.**

రచయిత ప్రస్తావించిన అన్ని అంశాల పట్లా నాకు ఏకాభిప్రాయమున్నది. ఈ కథ ఎవరు చదివినా అలాంటి మార్పు అందరిలో రావాలనే ఆశా కలుగుతుంది. నాకూ చాలా మంచిగా అనిపించిన కథ కూడా. ఒక్క పరిష్కారంలో ఎంచుకున్న విధానం తప్ప. ఎందుకంటే మనకు మనం మంచిగా ఉండటానికి అవకాశం వుందనే భ్రమను కల్పిస్తుంది. ఇది ప్రమాదకరమైనది. అంటే మొత్తం కాలుష్యాల్లో, అమానవీయంగా ఇలానే ప్రతి ఒక్కరూ బ్రతకాల్సిందేనా? వ్యక్తిగతంగా మనం వీటికి విరుద్ధంగా ఉండాల్సిన అవసరం లేదా? అనే ప్రశ్నలు వేయవచ్చు. కొంతవరకు మాత్రమే నిరోధించవచ్చు. అసలు కారణాల జోలికి వెళ్ళే చైతన్యం కలిగి ఉండడం అవసరం. ఆధునిక సమాజం ఇచ్చిన ఆధునిక సౌకర్యాలను, వసతులను, సాంకేతికతను అందిపుచ్చుకొంటూనే ఒక స్వచ్ఛమైన, మానవీయ సమాజాన్ని నిర్మించుకోవాలి. కానీ అన్నీ వొదిలి వెనక్కి పోవటం కాదు. టెక్నాలజీ, సౌకర్యాల వల్ల ఈ కాలుష్యం రాలేదు. లాభాల దాహోర్తుల విధ్వంసం వల్ల ఏర్పడింది.

ఇక ‘బండరాయి’ కథ. భర్త కోసం భార్య వ్యభిచారం చేయటం, భర్తను బ్రతికించుకోవటం కోసం భార్య చేసిన త్యాగం చివరకు వ్యర్థం కావటం. అంటే అమితంగా ప్రేమించే భర్తే చివరికి అనుమానించడం, తల్లిదండ్రులు కూడా అవమానపర్చడం చాలా హృద్యంగా చిత్రించారు రచయిత్రి. బంగ్లాదేశ్, అస్సాం ప్రాంతాల నేపథ్యంలో జరిగిన కథగా చిత్రించిన రచయిత్రి అక్కడి ఉగ్రవాదాన్ని కూడా వర్ణించింది. కథాంశం పాతగా వున్నప్పటికీ కథ ఎత్తుగడ, మగవాని మనస్తత్వం చిత్రించడంలో విజయం పొందింది. సాధారణ మనుష్యుల ప్రవర్తనలు చాలా వాస్తవికంగా చిత్రించారు. చదువుతుంటే కథలోని పాత్రలు, సన్నివేశం దృశ్యమానమవుతుంది. హృదయాన్ని కదిలిస్తుంది. అయితే బంగ్లాదేశ్, అస్సాం నేపథ్యంలో రాస్తున్నప్పుడు భాష, సంభాషణలో ఆయా భాషా పదాలు, వర్ణనలు చేస్తే ఇంకా బాగుండేదనిపించింది. ◆

## నివేదిక



# ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

- వల్లభాపురం జనార్దన

9440163687

విజయవాడ నగరంలోని పటమట ఎన్.టి.ఆర్.సర్కిల్ శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూలు ఆవరణలో ఫిబ్రవరి 21,22 తేదీల్లో రెండు రోజులు మూడవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరిగాయి. ఈ సభలు కృష్ణాజిల్లా, రచయితల సంఘం ప్రపంచ తెలుగు రచయితల సంఘం కలిసి నిర్వహించాయి.

మండలి బుద్ధ ప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ల పర్యవేక్షణలో జరిగిన సభల్లో 1500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణా రాష్ట్రం నుండి 600 మంది పాల్గొన్నారు. అంతే కాదు ఇంగ్లండు, పారిస్ వంటి విదేశాల నుండి దేశంలోని తమిళనాడు. గుజరాతు, బెంగుళూరు, రాయగడ్, రాయచోటి ప్రాంతాల నుండి తెలుగు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 21 ఉదయం 10 గం.కు 3 వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ప్రారంభమైనాయి. ప్రారంభ సభతోపాటు తెలుగు భాషా వికాసం. ప్రాచీనతా హోదా - ప్రపంచ భాషగా తెలుగు అంశాలపై చర్చలతోపాటు విదేశాంధ్రుల - రాష్ట్రేతరాంధ్రుల సదస్సులు, కవిసమ్మేళనం జరిగాయి.

మహాసభలను ప్రారంభిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ 3వ ప్రపంచతెలుగు రచయితల మహాసభలు జరగడం తెలుగు వాళ్ళంతా సంతోషించాల్సిన విషయం, ప్రపంచ పరిణామాలపై తెలుగులో విస్తృతంగా పుస్తకాలు వస్తేనే తెలుగుభాష అభివృద్ధి చెందుతుందన్నారు కేవలం సాహితీ సేద్యంతోనే తెలుగు బతకదు న్యాయ పాలనా విషయాలు సామాన్య ప్రజలందరికీ అర్థమయ్యేలా తెలుగులో పుస్తకాలు వచ్చినప్పుడే తెలుగు బతుకుతుందన్నారు.

ముఖ్య అతిథిగా వచ్చిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, మరియు పట్టణాభివృద్ధి శాఖా మాత్యులు ముప్పవరపు వెంకయ్యానాయుడు తెలుగు భాష అభివృద్ధికి ప్రజా ఉద్యమం రావాల్సిన అవసరముందని, ప్రభుత్వ వ్యవహారాలన్నీ అమ్మ భాషలోనే జరగాలని, అమ్మ భాష వల్లనే పరిపక్వత, మానసిక వికాసం వస్తుందని సందేశమిస్తూ ఇంకా తెలుగును అవమానించే ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, మాతృభాషను మరచిన వాడు మనిషేకాదని ఇది గుర్తుంచుకోవాలని తెలుగు భాషను కాపాడటానికి అభివృద్ధి చేయటానికి రెండు తెలుగు రాష్రాల ముఖ్యమంత్రులు పూనుకోవాలన్నారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ భౌగోళికంగా రెండు తెలుగు రాష్ట్రాలున్నా భాష కోసం ఏకోన్ముఖంగా సాగాలన్నారు. ఇంటి నుండే తెలుగు వెలుగులు ప్రసరింపజేయాలన్నారు.

మండలి బుద్ధ ప్రసాద్ జాతిని, భాషను, సంస్కృతిని సుసంపన్నం చేయడమే ఈ సభల లక్ష్యమంటూ తెలుగు భాషాభివృద్ధికి కేంద్రీయ హిందీ సంస్థాన్ లాగా ప్రత్యేక సంస్థ ఏర్పడి పని చేయాలన్నారు.

తెలుగు భాసావికానం సదస్సులో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు జి. ఉమామహేశ్వర రావు గారు, సామల రమేష్ బాబు, శిఖామణి తదితరులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో ప్రజావ్యవహారాల్లో ఉన్న పదాలను సేకరించి సంపూర్ణ నిఘంటువును తయారు చేసి వినియోగంలోకి తేవడంతో పాటు పాలనా సంబంధ నిత్య వ్యవహారాల్లో తెలుగును వినియోగించేలా బృహత్తర కృషి జరిగితేనే భాషా వికాసం జరుగుతుందన్నారు.

తెలుగు ప్రాచీనత హోదా సదస్సులో కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి ఆచార్య శరజ్జ్యోత్స్నా రాణి, యెండ్లూరి సుధాకర్ పాల్గొన్నారు.

ఆచార్య శరజ్జ్యోత్స్నారాణి ప్రాచీన హోదా కింద వచ్చిన నిధులను వినియోగించి కేంద్రీయ విశ్వవిద్యాలయం

# నివేదిక

ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సెమినార్లను నిర్వహించామన్నారు. అలాగే తెలుగు ప్రాచీన సాహిత్యంలోని అందచందాలను సామాన్యులకు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రాచీన కావ్యాల నుండి ఎంపిక చేసిన అంశాలను సులభ వ్యాఖ్యానంతో ముద్రించి అందుబాటులోకి తెచ్చామని చెప్తూనే చేయాల్సింది ఇంకా ఎంతో ఉందన్నారు.

సాహితీస్రవంతి అధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ అధికార భాషా సంఘాలు, తెలుగు అకాడమీలు, భాష కోసమే ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయం ఉన్నా ఏటా ఎన్నెన్నో పి.హెచ్.డీ పరిశోధనలు వెలుగు చూస్తున్నా తెలుగు భాషా వికాసం జరగాల్సినంతగా జరగలేదు. పాలకుల నిర్లక్ష్యమే దీనికి కారణంగా చెప్పవచ్చు. అలాగే ప్రాచీన హోదా కోసం అడుగుతున్నప్పుడు పాతకాలపు రాజులనూ, రాచరికాలనూ ముందుకుతెచ్చి గత వైభవాన్ని పునరుద్ధరించేరీతిలో ఆలోచనలు సాగినాయి. ఇప్పుడే సభల ప్రాంగణానికి విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టడం ఆ కోవలోకే చెందుతుంది. దీన్ని బట్టి మనం కోరుతున్న వికాసం ముందుకు పోవడమా గతంలోకి ముడుచుకుపోవడమా భాషాభిమానులు ఆలోచించుకోవాలన్నారు.




ప్రపంచ భాషగా తెలుగు సదస్సులో గొల్లపూడి మారుతీరావు, కూచిభొట్ల ఆనంద్‌లు ప్రసంగించారు. ముఖ్యంగా కూచిభొట్ల ఆనంద్ ప్రపంచభాషగా తెలుగు ఎదగాలంటే ఇంటికే పరిమితమై మడిగట్టుకొని కూర్చుంటే కుదరదు. ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలను భాషకోసం వినియోగించుకోవాలి. అప్పుడే తెలుగు ప్రపంచ భాషగా ఎదుగుతుంది. ఆ దిశలో మనం చాలా వెనకబడి ఉన్నాం. గూగుల్‌లో మన తెలుగుకు సంబంధించి ఒక లక్ష పేజీలు మాత్రమే ఉన్నాయి. తెలుగుకు సంబంధించి అంతర్జాలంలో వాడకానికి 16 'ఖతు'లను ఆవిష్కరించుకున్నాం. తెలుగు సాహితీవేత్తలు ఆ ఖతులను వాడుకొని యూనికోడ్‌లోకి మార్చి గూగుల్‌లోకి ప్రవేశపెట్టాలని ఆ పని ఇబ్బడిముబ్బడిగా జరిగితేనే తెలుగు ప్రపంచ భాషగా ఎదుగుతుందని ఈ సభలు ఆ దిశగా అడుగులు వేయడానికి ఉపయోగపడాలని అన్నారు.

ఫిబ్రవరి 22న రెండవరోజు తెలుగు భాషావ్యాప్తి సదస్సు, పత్రికలు దృశ్యశ్రవణ మాధ్యమాలు, తెలుగు సాహితీ సంస్థల ప్రతినిధుల సదస్సులు, కవి సమ్మేళనం జరిగాయి.

తెలుగు భాషా వ్యాప్తి సదస్సులో ఆంధ్రలయోలా కాలేజీ ప్రిన్సిపాల్, ఎమెస్కో విజయకుమార్, తుర్లపాటి రాజేశ్వరి, కె.బి. లక్ష్మి మాట్లాడారు. వక్తలు తెలుగు భాషా వ్యాప్తివికాసం పత్రికలను ఇతోధికంగా ఉపయోగించు కున్నప్పుడే జరుగుతుందన్నారు.

పత్రికలు దృశ్యశ్రవణ మాధ్యమాలు సదస్సులో ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ ఎ. కృష్ణారావు, డా॥ వేదగిరి రాంబాబు, శంకర్ నారాయణలు పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాషకు, సాహిత్యానికి పత్రికలు, దృశ్యశ్రవణ మాధ్యమాలు బాగానే కృషి చేస్తున్నాయి. చేయూత నిస్తున్నాయి. అయితే ఇది చాలదు. ఇంకా వాటిని వినియోగించుకోవడంలో ముందడుగు వేయాలన్నారు. అలాగే ప్రపంచమంతటా తెలుగు భాషావ్యాప్తి జరగాలంటే తెలుగు రచనలు తెలుగు వారికే పరిమితమైతే సరిపోదు. మన తెలుగు సాహిత్యంలోని మంచిని, విశిష్టతను ఇతర భాషలు ఇంగ్లీషు మాట్లాడే వారికి పరిచయం చేయాలి. తెలుగు సాహిత్యాన్ని అనువాదం చేసి ఇతర భాషల్లోకి తీసుకెళ్ళినప్పుడే తెలుగు భాష వ్యాపిస్తుంది. అలాగే విదేశాంధ్రుల సదస్సు రాష్ట్రేతరాంధ్రుల సదస్సులలో తెలుగు భాష వికాసానికి తెలుగు రాష్ట్రాలు ప్రభుత్వాలు మరింతగా తోడ్పడాలన్నారు.

మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు పెద్ద యెత్తున జరిగాయి. కానీ వర్తమాన సాహిత్యాన్ని, దాని తీరుతెన్నులను పరిణామాలను గూర్చి చర్చించని ఈ సభలు వర్తమాన సాహిత్యానికి దిశానిర్దేశం చేయడంలో విఫలమైనాయని చెప్పవచ్చు. ముఖ్యంగా ఇటీవల రచయితలపై మతోన్మాదులు, కులోన్మాదులు తెగబడి దాడులు చేస్తూ భావప్రకటనా స్వేచ్ఛకు అడ్డుతగులుతున్న విషయాన్ని ఖండించాల్సిన అవసరాన్ని, ఆవశ్యకతను పట్టించుకోకపోవడం, రచయితలకు అండగా ఉంటామనే విశ్వాసాన్ని కలిగించకపోవటం ఒక పెద్ద లోటుగా భావించాల్సి వస్తుందనటంలో ఎంతమాత్రం అనుమానం లేదు. ◆

# స్వీకారం

## వెల్లడి (వచనం+కవిత్వం)




**యిండ్రవెల్లి రమేష్**

వెల : రూ.101/- పేజీలు: 104(ఎ4 సైజు)

ప్రతులకు :9985440002

రచయిత తన కవితలను, కొన్ని వ్యాసాలను, ఇంటర్వ్యూలను కలిపి సంకలనంగా వేసుకున్నారు. నిర్మోహమాట ప్రకటనలు, సూటిదనంతో పాటు సంచలనాత్మక ధోరణి కూడా తగినంత ఈ రచనలు వ్యక్తం చేస్తాయి. అమూల్యమైన, అరుదైన రచయితల ఇంటర్వ్యూలు, అభిప్రాయాలూ పాఠకుడిలో ఆలోచనలు రేపుతాయి.

**- వారప్రసాద్**

## తెలుగు సాహిత్యం హేతువాద భావాలు - ప్రభావాలు




**డా॥ కనుపర్తి విజయలక్ష్మి**

వెల : రూ.175/- పేజీలు: 309

ప్రతులకు : 9441382303

క్లిష్టమైన, జటిలమైన అంశం తీసుకుని శ్రీమతి విజయలక్ష్మి అలవోకగా పరిశోధన చేసారు. శివకవుల కాలం నుండి, వేమన వంటి వారి రచనలలో హేతువాద భావాలను గురించి ఎన్నో విషయాలు తవ్వి తీసారు. ఆధునిక సాహిత్య ప్రక్రియలలో, రచయితలలో హేతువాద ప్రభావం ఏ మేరకు కనిపిస్తున్నదో పరిశోధించి చూపారు.

**- జయధీర్ తిరుమలరావు**

## ప్రత్యూష పవనం & వెలుతురు పువ్వులు నవలలు




**డా॥ ఆలూరి విజయలక్ష్మి**

వెల : రూ.110/- పేజీలు: 182

ప్రతులకు : 9849022441

రెండు నవలికలు మీ చేతుల్లో ఉన్నాయి. సరళంగా, సూటిగా ఉన్న ఈ రెండు కథల్నీ చదవగానే నా మనసులో చాలా ఆలోచనలు ముసురుకున్నాయి. వాటిలో కొన్ని జ్ఞాపకాలు, కొన్ని ప్రశ్నలు, కొంత మనం ఊహించని ఊరడింపు. ఎంతో బాధ్యత తెలిసిన మనిషి రచయిత్రిగా చెప్పిన ఈ రెండు కథల్లోనూ నేటి కాలానికీ, నేటి సమాజానికీ పట్టిన రుగ్మతలకి అవసరమైన ఔషధం చాలానే ఉందనిపించింది.

**- వాడ్రేవు చినవీరభద్రుడు**

## ట్రాఫిక్ జామ్ (కథలు)




**యస్. మునిసుందరం**

వెల : రూ.180- పేజీలు: 176

ప్రతులకు : 0877-2220769

యెక్కువగా కవిత్వమే రాయడం వలన, మునిసుందరం గారి కథల్లో గూడా కవిత్వాత్మ కత అవకాశమున్నప్పుడల్లా తొంగి చూస్తూనే వుంటుంది. ఆ తరువాత నాటకరచనలో అభినివేశము న్నందుచేత ఆయన కథలన్నింటిలోనూ నాటకీయత చోటుచేసుకుంటుంది. యీ కథలన్నింటిలోనూ వున్న పఠనీయత ప్రశంశనీయమైంది.

## ప్రయాణానికే జీవితం (పూనె నుంచి జమ్మూకి మోటార్ సైకిల్ యాత్ర)




**ఆంగ్లమూలం: అజిత్ హరిసింఘాని**

**అనువాదం: కొల్లూరి సోమ శంకర్**

వెల : రూ.120/- పేజీలు: 168

ప్రతులకు : 9948464365

సంఖాల గురించీ, ప్రయాణాల గురించీ, ప్రదేశాల గురించీ, జీవితాల గురించీ, మానవాళి గురించీ, ప్రపంచం గురించీ మనకుండే అవగాహనను సమూలంగా ప్రశ్నించి, శీర్షాసనం వేయించగల శక్తి మీ చేతుల్లో ఉన్న పుస్తకానికి ఉంది.

**- దాసరి అమరేంద్ర**

## శ్రీ కృష్ణదేవరాయల కథలు




**డా॥ వి.ఆర్. రాసాని**

వెల : రూ.140/- పేజీలు: 128(ఎ4 సైజు)

ప్రతులకు : 9291530714

'ఈ కథలు పిల్లల్ని, యువతీ యువకుల్ని బాగా ఆకట్టుకొని ఆనందాన్ని పంచడమే గాక, ఆలోచింప చేస్తాయి. కాబట్టి ఇవి ఆనందంగా నవ్వుకొని సంతోషించ డానికే. వీటిలోని సంఘటనలకు ఆధారాలను వెతకడం, నిజానిజాలు బేరీజు వేయాలను కోవడం అనవసరం. నిరంతరం వత్తిడికి లోనవుతున్న ఈనాటి సమాజానికి కాస్తంత మానసికానందాన్ని కలిగిస్తే అదే దివ్యౌషధంగా మారి మానసికారోగ్యానికి దోహదపడుతుంది.

**- వి.ఆర్ . రాసాని**

# తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో కవితల జాతర




దేశంలో ఒక కవి ఉంటే.. మరో ప్రభుత్వం ఉన్నట్లేనని అభ్యుదయ కవి కె శివారెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. కవులు, గాయకులు, కళాకారులు ప్రజల వైపా.. ప్రభుత్వం వైపా తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవితల జాతర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ మట్టిలోనుంచి సాహిత్యం ఉద్భవించిందని చెప్పారు. నేడు కవుల ప్రశ్నించే గొంతుపై ఆంక్షల కుట్లు వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వైపు ఉండే కవులు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారని, ప్రజల వైపుండే కవులు పల్లెలకేగుదామని పిలుపునిచ్చారు. పల్లె ప్రజలకు భరోసా ఇద్దామని చెప్పారు. నిజాంకు వ్యతిరేకంగా మహత్తర పోరాటం జరిగిందని, నేటి పాలకులు ఆ నిజాంను కీర్తిస్తున్నారని అన్నారు. ఈ పాలకులకు వ్యతిరేకంగా నిలబడే ప్రజలకు కవులు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. నవ తెలంగాణ నిర్మాణం కోసం కవులు గళం, కలం ఎత్తి మరోపోరాటం చేయాల్సిన అవసరాన్ని గుర్తిస్తారని హెచ్చరించారు. ఇద్దరు చంద్రుల నడుమ నరేంద్రుడు చేరి ప్రజలను మతోన్మాదం, కులం, ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదానికి ఎర్రతివాచీ పరుస్తున్నారని విమర్శించారు.

శ్రమజీవుల సంస్కృతి ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతిదీ సరుకుగా మారిపోయిందని ప్రజాకవి నిఖిలేశ్వర్ చెప్పారు. ఆట, పాట, సంస్కృతి అన్నింటినీ పెట్టుబడిదారులు మార్కెట్‌కు ఉపయోగించుకున్నారని అన్నారు. ఆట, పాట, సాహిత్యం, శ్రమజీవుల సంస్కృతిని పరిపూర్ణంగా మానవులకు అందించే బాధ్యతను కవులు, కళాకారులు భుజాన వేసుకోవాలని కోరారు. కవి జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ కవి ప్రజల పక్షం ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమై సాహిత్యం రాస్తేనే కవులకు మనుగడ ఉంటుందన్నారు. కవి గుడిపాటి మాట్లాడుతూ భౌగోళిక తెలంగాణ వచ్చిందని చెప్పారు. ప్రజాకాంక్షలు నెరవేర్చకపోతే పాలకులను నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. అన్యాయం చేస్తే ప్రాంతం వాడైనా నిలదీయాలని కాళోజీ అన్నారని గుర్తు చేశారు. ప్రజల తెలంగాణ, సమసమాజం స్వప్నం కోసం ప్రజలు, కవులు, కళాకారులు ప్రయత్నించాలని సూచించారు. పాలకవర్గాలపై భ్రమలు పెంచుకోవాల్సిన అవసరం లేదని, కవులు ప్రతిపక్షంగా వ్యవహరించాలని కోరారు. కవి యాకూబ్ మాట్లాడుతూ పాలకులు ప్రజలందరినీ సమానంగా చూడాలని, అమ్మ ప్రేమను పంచాలని కోరారు. వీధికి, ఆడిటోరియం, విశ్వవిద్యాలయాలకు సాహితీ వేత్తల పేర్లు పెట్టాలని డిమాండ్ చేశారు. అధ్యక్షత వహించిన తెలంగాణ సాహితి కన్వీనర్ కె ఆనందాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కవులు, కళాకారులు, గాయకుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం ఏం చేస్తుందో



చెప్పాలన్నారు. తెలంగాణ సాహితి కో కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవులు, కళాకారులకు వృద్ధాప్య పింఛన్లు కింద రూ.2000 చెల్లించాలని డిమాండ్ చేశారు. పుస్తకాల ముద్రణకు తెలంగాణ సాహిత్య అకాడమి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవులు అమ్మంగి వేణుగోపాల్, మోతూకూరి నరహరి, తంగిరాల చక్రవర్తి, వల్లభాపురం జనార్ధన, స్ఫూర్తి, రౌతురవి, సునంద, రత్నకుమార్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కవులు రచించిన తమ స్వీయ కవితలను చదివి వినిపించారు. ◆

## కాకినాడ 'సాహిత్య హేల'లో తంగిరాల పుస్తకావిష్కరణ



కాకినాడ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15న విశ్రాంత ప్రభుత్వోద్యోగుల కార్యాలయభవనంలో తంగిరాల చక్రవర్తి వ్రాసిన అద్దేపల్లి సారస్వతీ సమీక్షదర్శిని ఆవిష్కరణ సభ జరిగింది. సభకు అధ్యక్షత వహించిన విశ్రాంత ప్రభుత్వోద్యోగుల సంఘ అధ్యక్షులు పి.యస్.యస్.యన్.పి. శాస్త్రి తన తొలిపలుకులలో డా॥ అద్దేపల్లి నిరంతర సాహితీ కృషిని కొనియాడారు. ఆవిష్కర్త కవి, విమర్శకులు జి. సుబ్బారావు మాట్లాడుతూ 'గోదావరి నా ప్రతిబింబం' అనగల ధైర్యం అద్దేపల్లికే సొంతమని అన్నారు. పుస్తకంపై మాట్లాడిన కవి, విమర్శకుడు మాకినీడి సూర్యభాస్కర్ మాట్లాడుతూ తంగిరాల చక్రవర్తి స్థూలంగా అప్పుడప్పుడు రాసిన వ్యాసాల సంకలమైనా, డా॥ అద్దేపల్లి కవితా లక్షణాల్ని అద్దంలో కొండలా చూపించగలిగారిని, అద్దేపల్లి వ్యక్తిత్వ ఆవిష్కరణలో కవిత్వ ఆత్మను గ్రహించడంలో నైపుణ్యం ప్రదర్శించారని ప్రశంసించారు.



***సాహితీ స్రవంతి, కాకినాడ ఆధ్వర్యంలో ఫిబ్రవరి1న గాంధీభవన్‌లో జరిగిన సాహిత్య సభలో గౌరీమల్లిక్ రాసిన 'పార్వతీశ శతకం' పద్య రచనని డా॥ అద్దేపల్లి రామమోహనరావు ఆవిష్కరించారు. చిత్రంలో గనారా, గద లలిత ప్రసాద్, వి.ఆర్. విద్యార్థి, అద్దేపల్లి రామమోహనరావు, అంపశయ్య నవీన్***

## జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు

రావి రంగారావు సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జన రంజక కవి ప్రతిభా పురస్కారాలకు తొంభై ఏడుగురు కవులు 133 కవితల సంపుటాలు పంపించారని ఆ సంస్థ కన్వీనర్ నర్రా ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. వారు వరుసగా బిక్కి కృష్ణ (చినుకు), మౌనశ్రీ మల్లిక్ (గరళం), గరిమెళ్ళ నాగేశ్వరరావు (ప్రపంచాక్షరి), చిన్ని నారాయణరావు (మాట), వై.శ్రీరాములు (విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా), అద్దంకి శ్రీనివాస్ (రాతి జల), స్ఫూర్తి (స్ఫూర్తి పాటలు), వారిలో ఈ ఏడుగురు రచయితలను ఎంపిక చేశామని తెలిపారు. ఒక్కొక్క కవి రెండు వేల రూపాయలతో ఈ "సహజ కవి" ప్రతిభా పురస్కారాలను మార్చి 16న సాయంత్రం 6 గంటలకు గుంటూరులో బృందావన్ గార్డెన్స్ కఃశ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో అందజేయడం జరుగుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.



***కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ నగరంలో 'వేమన విద్యావర్ధక సంఘం' ఆధ్వర్యంలో జరిగిన వేమన జయంతి సభలో డా॥ ఎన్. గోపిని సన్మానిస్తున్న గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖా మంత్రి హెచ్.కె. పాటిల్. చిత్రంలో రాణి బెన్నూరు ఎం.ఎల్.ఏ.కె.బి. కోలివాడ్, సంస్థ నిర్వాహకుడు రాజు పాటిల్ ఉన్నారు.***

## ఉగాది కవితల పోటీ ఫలితాలు

సాహితీకిరణం ఆధ్వర్యంలో జరిగిన 'సోమరాధాకృష్ణ' స్మారక కవితల పోటీ ఫలితాలను ఆ సంస్థ తరపున ఒక ప్రకటనలో వెల్లడించారు. సుప్త చేతనత్వం నుండి : మౌనశ్రీ మల్లిక్, హైదరాబాద్, ఆ అద్వైత స్థితికోసం : ఎరుకలపూడి గోపీనాథరావు, విజయవాడ, మాట : గుర్రాల రమణయ్య, నెల్లూరు, మనిషికోసం : ఆవుల వెంకటేశులు, ఉరవకొండ, తేడా : ప్రతాప వెంకట సుబ్బారాయుడు

## దాట్ల' సాహిత్య పురస్కారాలు

ప్రముఖ కవి డా॥ ఎన్. గోపి, ప్రముఖ కథకులు ఏ.ఎన్. జగన్నాథశర్మలకు 2015 సాహిత్య పురస్కారాలను అందజేయడానికి 'దాట్ల దేవదానం రాజు సాహితీ సంస్థ' నిర్ణయించిందని ఆ సంస్థ తరపున డి.వి.యస్. రాజు ఒక ప్రకటనలో తెలపారు. మార్చి 22 తేదీన యానాంలో జరిగే సభలో ఇరువురికి పురస్కార ప్రదానం జరుగుతుందని, ఈ పురస్కారం కింద ఒక్కొక్కరికి పదివేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తామని తెలిపారు.

## డైరీ

### విశాఖలో జనకవనం



సమాజాన్ని మధ్యయుగాల నాటి అంధకారంలోకి నెట్టేసే మత దురహంకార ధోరణులను కవులు, రచయితలు, అభ్యుదయవాదులు తీవ్రంగా ప్రతిఘటించాలని ప్రముఖ సాహితీవేత్త రామతీర్థ పిలుపునిచ్చారు. దేశంలో అధికారంలోకి వచ్చిన మతోన్మాద శక్తులు నేడు విచ్చిన్నాన్ని, విభజనను ప్రేరేపిస్తున్నాయని విమర్శించారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యాన జనవరి 30వ తేదీన విశాఖ నగర గ్రంథాలయంలో జరిగిన 'మత దురహంకార ధోరణులపై కవులు, రచయితల స్పందన' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అన్ని కాలాల్లోనూ, అన్ని దేశాల్లోనూ మతమౌఢ్యం సమాజ అభ్యున్నతికి అడ్డు తగిలిన సందర్భాలు అనేకం ఉన్నాయని ఉదహరించారు. కానీ, అవేవీ శాశ్వతంగా చెల్లుబాటు కాబోవని పేర్కొన్నారు. కేవలం భయం వల్లే మతోన్మాదులు ప్రశ్నను, విజ్ఞాన వికాసాన్ని తట్టుకోలేరని అన్నారు. భావాలపై భౌతికదాడి పిరికివాడి లక్షణమని అన్నారు. ఇలాంటి దుర్మార్గాలను భారతీయ సమాజం అంగీకరించబోదని; గతంలోనూ అనేక రూపాల్లో ప్రతిఘటించిందని చెప్పారు. ప్రముఖ కవయిత్రి జగద్ధాత్రి మాట్లాడుతూ- మతం వ్యక్తిగతమని, దాని ఆధారంగా విభజన మూర్ఖత్వానికి నిదర్శనమని అన్నారు. మతోన్మాద చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని; వాటికి మేధావులు ఎవరూ బెదిరిపోరని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి బాధ్యులు సత్యాజీ మాట్లాడుతూ-మతోన్మాదులు సాహిత్య సాంస్కృతిక రంగాలపై దాడి చేయడం గర్హనీయమని అన్నారు. భావప్రకటనా స్వేచ్ఛకు, సృజనాత్మకతకూ సంకెళ్లు వేసే ఈ ధోరణిని ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. గాడ్సేలు ఎప్పటికీ అనుసరణీయులు కాబోరని పేర్కొన్నారు. నూనెల శ్రీనివాసరావు, శ్రీదీప్తి, రమణారావు తదితరులు కవితలు వినిపించారు. మతసామరస్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఇంకా నర్సింహారావు, స్వతంత్రకుమార్ మాట్లాడారు.

### సాహిత్యంతోనే వికాసం




సమాజ వికాసానికి సాహిత్యం ఎంతో అవసరమని సాహితీ విమర్శకుడు రామతీర్థ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన ఫిబ్రవరి 21వ తేదీన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయమైన విధానాలవైపు మొగ్గు చూపాలంటే అటువంటి పాఠశాలలు నెలకొల్పాలని అన్నారు. విద్యా విధానాన్ని ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుందని, పాశ్చాత్య పోకడలను తెరపైకి తెచ్చి తెలుగు భాషా విధానానికి స్వస్తి పలుకుతూ కార్పొరేట్ శక్తులను ఆహ్వానిస్తుందని విమర్శించారు. ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో తెలుగు సంస్కృతికి పెద్ద పీట వేయాలన్నారు. నూనెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గవిడి శ్రీనివాసరావు, టి.హనుమంతరావు, టి.శ్రీరామమూర్తి, జగద్ధాత్రి, సుజాత మూర్తి, కళ్యాణి శ్రీదీప్తి కవితలను వినిపించారు. సమకాలీన సమస్యలపై అక్షరాస్త్రాలు సంధించారు.



*తెలుగు వికీపీడియా వార్షికోత్సవ సభలో కొమర్రాజు లక్ష్మణరావు విశిష్ట పురస్కారం 2014ను స్వీకరిస్తున్న అంగజాల రాజశేఖర్. చిత్రంలో ప్రణయ్‌రాజ్ వంగరి, పాలగిరి రామకృష్ణారెడ్డి, ఎల్లంకి భాస్కరనాయుడు, విష్ణువర్ధన్‌లు*



*తిరుపతిలో ఫిబ్రవరి 2న జరిగిన డా. వి.ఆర్. రాసాని రచనల ఆవిష్కరణ సభ. చిత్రంలో ఆచార్య మేడిపల్లి రవికుమార్, బండి నారాయణస్వామి, భూమన్, డా॥ శాంతి నారాయణ, డా॥ తమటం రామచంద్రారెడ్డి, ఎ.ఎం.ఆర్. ఆనంద్*

## రచయిత మునిసుందరం మృతి



కవి, రచయిత ఎస్.మునిసుందరం (78సం॥) ఫిబ్రవరి 13న కన్నుమూశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన రాసిన హాస్య, సాంఘిక, పౌరాణిక, చారిత్రక నాటకాలు మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. తొమ్మిది కవితా సంపుటాలు మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. తొమ్మిది కవితా సంపుటాలు ప్రచురితమయ్యాయి. 'ఒక యుద్ధం తర్వాత' అనే నవల అచ్చయింది. ఇటీవల కథాసంపుటి 'ట్రాఫిక్ జామ్' వెలువరించారు. చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం పారకాల్వలో పుట్టిన మునిసుందరం హిందీ అధ్యాపకుడిగా పనిచేశారు. నూతలపాటి గంగాధరం పేరుతో ఏటా కవులకు అవార్డులు ఇస్తున్నారు. చైతన్యభారతి సాహితీ సంస్థ తరపున ఉగాది, దీపావళి, సంక్రాంతి పండుగలకు కవిసమ్మేళనాలు నిర్వహించేవారు. ప్రస్థానం పత్రికకు తన రచనలు తరచూ పంపించేవారు.




*'గురజాడ జాతీయ సాంస్కృతిక కేంద్రం' ఏర్పాటు చేయాలని కోరుతూ విజయనగరంలోని గురజాడ స్వగృహంలో ఫిబ్రవరి 17న జరిగిన సమావేశం. చిత్రంలో చాగంటి తులసి, డివిజి శంకర్ రావు, చీకటి దివాకర్, బాలకృష్ణ*

## విద్వాన్ విశ్వం శతజయంతి సభ




అనంతపురంలో ఫిబ్రవరి 28న డి.ఆర్.డి.ఎ అభ్యుదయ హాల్లో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ సాహిత్యవేత్త విద్వాన్ విశ్వం శత జయంతి సభ జరిగింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రముఖ రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోర్కి, సివి రచనలను ఆవిష్కరించారు. సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు తెలకపల్లి రవి ప్రధాన వక్తగా ప్రసంగిస్తూ విద్వాన్ విశ్వం ఒక అభ్యుదయ రచయితగా నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. తెలుగులోనే కాకుండా ఆంగ్ల, సంస్కృత భాషల్లోను ఆయనకు ఎంతో ప్రావీణ్యం ఉందన్నారు. ఆయన రచించిన 'పెన్నేటిపాట' రాయలసీమ ప్రాంత ప్రజల జీవనాన్ని అద్దంపట్టే విధంగా ఉందని కొనియాడారు. ప్రముఖ రచయిత సింగమనేని నారాయణ ప్రారంభోపాన్యాసం చేస్తూ విద్వాన్ విశ్వం లాంటి వారు తొలితరం రచయితల్లో ప్రముఖులన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శనీయులన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, జూపల్లి ప్రేమ్‌చంద్, జన సాహితీ సంస్థ అధ్యక్షులు సూర్యసాగర్, మల్లెల నర్సింహమూర్తి, ఏలూరు ఎంగన్న తదితరులు ప్రసంగించారు. సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా కన్వీనర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


**FORM IV**

(Rule 8)

**UNDER PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867**
**STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT MONTHLY -SHAITYA PRASTHANAM**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of its Publication | : | Monthly |
| 3. Printer's Name | : | V. Krishnaiah |
| 1 (a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 4. Publisher's Name | : | V. Krishnaiah |
| 1 (a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 5. Editor's Name | : | T. RAVI |
| Nationality | : | INDIAN |
| 1(a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 6. Name and addresses of owner | : | V. Krishnaiah |
| 1(a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |

**I, V. KRISHNAIAH, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

**Sd/**
**V. KRISHNAIAH**
**Publisher**

**Date: 28.02.2015**



Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# సుంకర సత్యనారాయణ

23.03.1909 - 05.09.1975

ప్రసిద్ధ ప్రజా రచయిత. సంచలనం సృష్టించిన మా భూమి
నాటకం వాసిరెడ్డితో కలిసి రచించారు. ఇంకా అనేక
నాటకాలు, బుర్రకథలు రాశారు.



SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/13-15
Date of Positng : 06.03.2015 ▪ Date of Publication: 02.03.2015




If Un delivered please return to: Prasthanam, C/o M.H. Bhavan, Plot No. 21/1,
Near RTC Kalyana mandapam, Azamabad, Hyderabad - 500 020. Ph: 040- 27660013, Cell: 9490099059